మాగజైన్ గత వారంలోజుల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 130 పేజీలు: 8+16 వెల: 6.50



కాక్రోచ్ పార్టీకి పోటీగా 'ఇష్క్ కరో' పార్టీ

హెచ్-1 బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు 5


## ఘన్‌పూర్‌కు రూ.60.62 కోట్ల విద్యుత్ వరం

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మహిళా సంఘాలకు రూ.35.96 కోట్ల రుణాల పంపిణీ: డి.సిఎం భట్టి



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** వ్యవసాయాభివృద్ధి, గ్రామీణప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, మహిళాసాధికారతకు రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.60.62కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్‌అభివృద్ధి పనులకు సంబంధించిన పలు సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 60,838మంది వినియోగదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే విద్యుత్ మౌళిక సదుపాయాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 132/33 కేవీ పీచర సబ్‌స్టేషన్ - రూ.43.92కోట్లు, వేలేరు మండలంలోని పీచరలో 210/16 ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించిన 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను, 33/11 కేవీ కొండాపూర్ సబ్‌స్టేషన్ - రూ.2.50కోట్లు, 33/11 కేవీ సాగరం సబ్‌స్టేషన్ - రూ.2.29కోట్లు, 33/11 కేవీ కుర్చపల్లి సబ్ స్టేషన్-రూ.2.25కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు.అలాగే చిల్పూర్ మండలపరిధిలో రూ.9.66 కోట్లవ్యయంతో మూడు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి, పల్లగుట్ట 33/11 కేవీ సబ్‌స్టేషన్-రూ.3.25 కోట్లు, లింగంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్-రూ.2.81కోట్లు, నష్కల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్-రూ.3.60కోట్ల వ్యయంతో నిర్మించనున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.తదనంతరం ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించిన రైతుసేవా కేంద్రం స్టాల్‌ను ప్రారంభించారు.

## నెహ్రూను దాటేసిన 'పుష్కర మోడీ'

పన్నెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న ఎన్డీయే



### నేడు కేబినెట్ భేటీలో ప్రధానికి ఘనసత్కారం


### బిజెపి కేంద్ర కార్యాలయంలోను వేడుకలు

**న్యూఢిల్లీ,జూన్ 9:** కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి 12 ఏళ్ల అధికారం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధ, గురు వారాల్లో ఎన్డీయే పక్షాల కీలక భేటీ జరగనున్నది. 12 ఏళ్ల పూర్తైన సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు, భవిష్యత్‌లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలి అనే అంశాలపై ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఎన్డీయేకు చెందిన నేతలు సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్నారు.ఇకగురువారం ప్రధానిమోడీ ఎన్డీయే

>>2



సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో వానలో సిఎం సభకు వెళ్తున్న ప్రజలు



కొండాపూర్ చౌరస్తాలో వరద నీటిలో మునిగిన కారు

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళా వైభవం

భారత మాత, తెలంగాణ తల్లి అంటూ మహిళకు సమున్నత స్థానం

33% రిజర్వేషన్లతో ఇక మహిళల కీలకపాత్ర

ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సిఎం రేవంత్

వాన జల్లులో తడిసిన సిఎం, మంత్రులు



మంగళవారం సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

**హైదరాబాద్ (బేగంపేట), జూన్ 9, ప్రభాతవార్త:** మహిళా శక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని,మన సంస్కృతి సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం జరిగిన మహిళా శక్తి సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.పరేడ్ మైదానంలో నిర్వహించిన మహిళాశక్తి సభలో స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్,ధనసరి అనసూయ(సీతక్క),కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కల్సి స్వయం సహాయక బృందాల మహిళలకు ఆర్టీసీ బస్సులను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక

>>2

# ముంచెత్తిన హోరువాన

### రుతుపవనాలు రాగానే తడిసి ముద్దయిన నగరం



గచ్చిబౌలిలో భారీ ట్రాఫిక్‌జాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడంతో వర్షాలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నగరంలోని చాలా చోట్ల ఈదురుగాలులతో వానపడింది. దీంతో అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఫలితంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీవర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సమస్యను పరిష్కరించేందుకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. భారీ వర్షం, ఈదురుగాలులకు పాతబస్తీ బండ్లగూడలో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఈ ఘటనలో జాఫర్(25), అబూ(16) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఛత్తా బజార్‌లో రోడ్డుపై కమాన్ కూలింది.

>>2

కూలిన చెట్లు, పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్

కరెంట్ తీగలు తెగిపడి ఇద్దరు మృతి

రాష్ట్రంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కృతి



**భోపాల్,జూన్ 9:** రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈ నెల 18వ తేదీ జరిగే ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభలో మూడింటి రెండొంతుల మెజార్టీ సాధించే అవకాశం ఉండటంతో బీజేపీ వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇదే క్రమంలో మధ్యప్రదేశ్ నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్‌ను ఓడించేందుకు ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తుండటంతో వారంతా బెంగళూరు క్యాంప్ కు తరలివెళ్లారు. అయితే ఆ తర్వాత కూడా మీనాక్షి నటరాజన్‌కు షాక్ తప్పలేదు.మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ సమర్పించిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆమె

>>2

## డిబిటి ద్వారానే ఫీజు రీయింబర్స్‌మెంట్



యేడాదంతా దరఖాస్తులకు అవకాశం

నాలుగు విడతల్లో స్కాలర్‌షిప్‌లు మంజూరు

జీవో 7ను రద్దు చేసి, 8ని జారీ చేసిన సర్కార్

జీవో 9 ప్రకారమే విద్యార్థులకు చెల్లింపులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 09:** తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థులందరికీ ఇకపై డైరక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్(డీబీటీ) ద్వారానే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను అందించనున్నారు. ఫీజురీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ మంజూరు విషయంలో గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 7ను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 8ని జారీ చేసింది. ఇప్పటి వరకు ఎస్సీ విద్యార్థులకు మాత్రమే డీబీటీ ద్వారా స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్ మెంట్‌ను పంపిణీ చేసిన ప్రభుత్వం ఇకపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థులందరికీ డీబీటీ ద్వారానే అందజేయనున్నట్టు స్పష్టం చేస్తూ జీవో జారీ చేసింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జీవో ఎంఎస్ నంబర్ 9 ద్వారా ప్రభుత్వం జారీ చేసింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం నోడల్ డిపార్ట్‌మెంట్‌గా ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఇకపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతి, ఆర్థికంగా వెనుకబడిన తరగతి, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డీబీటీ) విధానం ద్వారా పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను (ట్యూషన్ ఫీజు, మెయింటెనెన్స్ ఫీజు) మంజూరు చేయడానికి, భారత ప్రభుత్వ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (పిఎంఎస్-ఎస్‌సి) మార్గదర్శకాలు, మార్చి 2021ను సాధారణ కార్యాచరణ ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించి, మెయింటెనెన్స్ ఫీజు, నిర్దిష్ట నిబంధనలతో ఈ పథకాన్ని ఏకరీతిగా, సమర్థవంతంగా లబ్ధిదారులకు కేంద్రీకృతంగా అమలు చేయడానికి నిర్ణయించి.. 2026-27 విద్యా సంవత్సరం నుండి అమలులోకి వచ్చేలా వివరణాత్మకమైన ఏకీకృత మార్గదర్శకాలను జీవో ఎంఎస్ నంబర్ 9 ద్వారా జారీ చేశారు. కేంద్రం 2024-25 విద్యా సంవత్సరం నుండి ఎస్‌సి విద్యార్థుల కోసం ఆర్‌టిఎఫ్, ఎంటిఎఫ్‌తో సహా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరును ఆధార్ పేమెంట్ బ్రిడ్జ్ సిస్టమ్ (ఏపిబిఎస్) ద్వారా విద్యార్థులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ ఫర్ (డీబీటీ) విధానానికి మార్చింది. అదే విధానాన్ని ఇకపై ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులకు అమలు చేయనున్నారు. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్

>>2



## అమ్మ దర్శనానికి వచ్చి అనంత లోకాలకు..

బాసరలో విషాదం.. గోదావరిలో ముగ్గురు అన్నదమ్ములు మృతి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9 ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా బాసరలో గోదావరి నదిలో జరిగిన దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. సెలవు రోజు కుటుంబంతో ఆనందంగా గడపాలనే ఉద్దేశంతో గోదావరి తీరానికి వెళ్లిన వారు స్నానానికి దిగగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకరిని కాపాడబోయి ఒకరి తరువాత ఒకరు ఇలా ముగ్గురు నీటిలో దిగి గల్లంతయ్యారు. మంగళవారం మధ్యాహ్నం బాసరలోని ట్రిబుల్ ఐటీ ఇంటెక్ వాల్ సమీపంలో గోదావరి నదిలోకి దిగిన ముగ్గురు అన్నదమ్ములు లోతైన నీటిలోకి వెళ్లడంతో ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యారు.గల్లంతైన వారిని చంద్రశేఖర్(38),రామచందర్(36), మల్లేష్ కుమార్ (31)గా గుర్తించారు.వీరు హైదరాబాద్ కాచిగూడ చెప్పల్ బజార్ నుండి సరస్వతి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే ఏఎస్పి సాయికుమార్

>>2

## ఎసిబి వలలో మరో భారీ అవినీతి తిమింగలం



### పట్టుబడిన ఆర్ అండ్ బి ఇఎన్‌సి మోహన్ నాయక్

### అక్రమాస్తులు రూ. 200 కోట్లపైనే..

**హైదరాబాద్ జూన్ 9, ప్రభాతవార్త:** మరో బడా అవినీతి అధికారిని ఎసిబి పట్టుకుంది. రోడ్లు భవనాలశాఖలో ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ (ఈఎన్‌సి)గా పనిచేస్తున్న మోహన్ నాయక్ అక్రమాస్తుల కేసులో ఎసిబికి దొరికిపోయారు. ఆయన వద్ద అధికారికంగా రూ.17.94 కోట్ల రూపాయల అక్రమాస్తులు లభ్యమవగా బహిరంగ మార్కెట్లో దీని విలువ 200 కోట్ల రూపాయలకు పైగానే వుంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రభు త్వ విభాగాల్లో రోడ్లు భవనాల శాఖ ముఖ్యమైనది కాగా ఇందులో ఈఎన్‌సి పోస్టు ఎంతో కీలకమైనది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రోడ్ల ని ర్మాణానికి ఈఎన్‌సి పోస్టులో వున్న అధికారి అనుమతి తప్పనిసరి. ప్రస్తుతం ఈ పోస్టులో వున్న మోహన్ నాయక్ (58)పై కొన్నేళ్లుగా తీవ్రమైన అవినీతి ఆరోపణలు రాసాగాయి. రోడ్లువేసే కాంట్రాక్టర్ల నుంచి దండిగా లంచాలు తీసుకుని భారీగా అక్రమాస్తులు కూడపెడుతున్నట్లు ఆయనపై అభియోగాలు వచ్చాయి. దీనిపై ఎసిబికి ఫిర్యాదులు అందడంతో ఆవిభాగం అధికారులు మోహన్ నాయక్‌పై నిఘా వుంచడంతో పాటు ఆయన ఆస్తిపాస్తులపై ఆరాతీసి, భారీగా అక్రమాస్తులు వున్నట్లు నిర్ధారణకు వచ్చారు. దీని తరువాత

>>2

## గచ్చిబౌలిలో భారీ చోరీ

వ్యాపారి ఇంట్లో రూ.5 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల అపహరణ



మంగళవారం పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

మళ్లీ చెలరేగిన నేపాలీ గ్యాంగ్‌లు!

### 6 ప్రత్యేక బృందాలతో గాలింపు

### పోలీసుల అదుపులో నిందితులు

### కొంప ముంచిన చెంబులో 'కీ'

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 9 ప్రభాతవార్త:** నగరంలో నేపాలీ గ్యాంగ్ మరో దోపిడీ సంచలనం స ృష్టించింది. ఐటి కారిడార్ పరిధిలోని గచ్చిబౌలిలో ఓ వ్యాపారవేత్త ఇంటికి కన్నం వేసిన నేపాలీ గ్యాంగ్ ఏకంగా 6కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలతో పరారయ్యారు. నెల రోజుల క్రితమే ఇంట్లో చేరిన నేపాలీ జంట మరో మహిళతో కలిసి వ్యాపారవేత్త కుటుంబం ఇంట్లో లేని సమయంలో ఈ చోరీకి పాల్పడ్డారు. కాగా వ్యాపారవేత్త తన కుటుంబంతో ఢిల్లీకి వెళ్తూ, లాకర్‌కు తాళం వేసి

>>2


ప్రశాంతంగా ముగిసిన చేపప్రసాదం పంపిణి 3

జూలైలో సమ్మెకు సింగరేణి కార్మికుల నోటీసు 3

బాణాసంచా గిడ్డంగిలో అగ్ని ప్రమాదం, ఏడుగురి మృతి 5

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళా వైభవం

>> సంఘాల బృందాలకు బస్సులు అందజేసే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులో వచ్చారు.అదే సమయంలో భారీ వర్షం కురిసింది.దీంతో బస్సు దిగి వేదిక వద్దకు చేరుకునే లోపు సీఎం తో పాటు మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి,సీతక్కలు వర్షంతో తడిచిపోయారు.ఇదే సమయంలో టెంట్ల కింద కుర్చీలలో కూర్చున్న వారు అక్కడే కూర్చోగా కుర్చీలు సరిపోక ప్రాంగణంలో నిలబడి ఉన్న వారు వర్షం ధాటికి ఆర్టీసీ బస్సులలో ఎక్కి కూర్చున్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డలను లక్ష్మీదేవితో కొలిచే సంస్కృతి మనదన్నారు.భూమిని భూమాతగా ,దేశాన్ని భారతమాతగా ,రాష్ట్రాన్ని తెలంగాణా తల్లిగా భావిస్తామన్నారు. చాకలి ఐలమ్మ,ఆరుట్ల కమలాదేవి,మల్లు స్వరాజ్యం మన కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు.ఆడబిడ్డలకు ఓటు హక్కును కల్పించి వారి చేతికి అధికారం ఇచ్చిన ఘనత దివంగత ప్రధాని నెహ్రూకే దక్కిందన్నారు.రాష్ట్రపతిగా, మంత్రులుగా ఆడబిడ్డలకు అవకాశం కల్పించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లలో ఒక్క ఆడబిడ్డకు కూడా మంత్రిగా అవకాశం కల్పించలేదన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఏ నాడు వాళ్ల పార్టీ అధ్యక్షస్థానంలో మహిళను నియమించలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం లోనే మహిళలకు గుర్తింపు ఉంటుందన్నారు. తమ ప్రజా ప్రభుత్వం మహిళలను స్పూర్తిగా తీసుకుని పరిపాలన సాగిస్తుందన్నారు.మంత్రులుగా ,కార్పోరేషన్ ఛైర్మన్లుగా మున్సిపల్ ఛైర్మన్లు,మేయర్లుగా ఆడబిడ్డలు రాణించారని సీఎం గుర్తు చేసారు.చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని 2013లో సోనియాగాంధీ పార్లమెంట్‌లో బిల్లు పెట్టారని గుర్తు చేసారు.రాబోయే రోజుల్లో 33శాతం మహిళలు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలలో ప్రధాన పాత్ర పోషించబోతున్నారని స్పష్టం చేసారు.గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సి న సున్నా వడ్డీ కూడా చెల్లించలేదని,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే



పెరేడ్ గ్రౌండ్స్ సిఎం సభలో భారీ వర్షం రావడంతో కుర్చీలు అడ్డుగా పెట్టుకున్న ప్రజలు

మహిళలకు సున్నావడ్డీ రుణాలను మంజూరు చేసామని తెలియజేసారు.ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని,కొందరు కడుపు నిండా విషం నింపుకుని కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని,ఉచిత బస్సు పథకాన్ని రద్దుచేయాలంటూ రోడ్డెక్కారని,అయినా ఎక్కడా వెనక్కి తగ్గకుండా ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని సీఎం అన్నారు.ఉచిత బస్సుల్లో వెళ్లి మా ఆడబిడ్డలు ఉన్నత చదువులు చదువుకుంటున్నారని ,పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుపని మహిళా సంఘాలకే అప్పగించామని అన్నారు.అమెజాన్,ఫ్లిప్ జారీ వరకు ఆన్‌లైన్‌లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచే స్థాయికి సంఘాలు ఎదిగాయన్నారు.ఎలినినో ఉందని వాతావరణ శాఖ చెప్పిందని,మనం 553బస్సులను ప్రారంభించుకోగానే వరుణ దేవుడు కరుణించాడని ,తెలంగాణా ప్రగతి ఆడబిడ్డల చేతిలో ఉందన్నారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాల సంఖ్య కోటి మందికి చేరాలన్నారు.కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే బాధ్యత నాదే అని ముఖ్యమంత్రి అన్నారు.2034వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తామని ఆయన అన్నారు.వెయ్యికాదు మూడు వేల బస్సులకు ఆడబిడ్డలను యజమానులను చేస్తామన్నారు.వ్యవసాయంలో అన్ని రకాల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపు నిచ్చారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదల పెన్నిది అక్కా చెల్లెమ్మలకు ఆత్మీయ సోదరుడు మనందరిని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అగ్రభాగాన ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కి మహిళల తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు.ఆర్టీసీశాఖ మంత్రి గా ఉండి 553బస్సులు ఇవ్వడంలో కీలక పాత్ర పోషించిన పొన్నం కు ధన్యవాదాలు తెలియజేసారు.మహిళలకు 61వేల కోట్ల బ్యాంకింగ్ రుణాలను ఇప్పించామన్నారు.2000కోట్ల వడ్డీ డబ్బులను మహిళా సంఘాలకు చెల్లించామన్నారు.మహిళలకు పెట్రోలు పంపులతో పాటు సోలార్ ప్లాంట్లు,ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లను ఇచ్చామన్నారు.వడ్ల కొనుగోలు కేంద్రాల్లో 40శాతం మహిళలు నిర్వహిస్తున్నారన్నారు.గత ఏడాది 168కోట్ల వడ్ల కొనుగోలు కమీషన్ ఇచ్చామన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళలకు బస్సులకు యజమానులుగా చేసి 553బస్సులను ఆర్టీసీకి అద్దెకిచ్చి నెల నెల అద్దె చెల్లించేలా బస్సులు ప్రారంబించుకోవడం సంతోషంగా ఉందన్నారు.మృగశిర కార్తె సందర్భంగా పండుగలా ఒక వైపు వర్షం పడుతూ మరో వైపు మహిళా బస్సుల పండుగ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి,సీతక్క,పొన్నం ప్రభాకర్,ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్,ఎమ్మెల్యే శ్రీగణేష్,తెలంగాణా మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి,ఎమ్మెల్యే నవీన్‌యాదవ్,మహిళా స్వయం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్కాజ్ గిరి సిపీ బి.సుమతి నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు.

## నెహ్రూను దాటేసిన 'పుష్కర మోడీ'

>> పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో కూడా భేటీ కానున్నారు. తమ పాలన ఉన్న రాష్ట్రాల్లో వికసిత్ భారత్ కోసం ఎలా పని చేయాలి, పశ్చిమాసియా సంక్షభాన్ని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై మోడీ వారితో చర్చించే అవకాశం ఉంది. ఎన్డీయే పాలనలోకి వచ్చి 12 ఏళ్లుపూర్తిచేసుకున్న సందర్భంగ ఆప్రధానిమోడీ సోషల్‌మీడియాలోపోస్టుచేస్తూ 12 ఏళ్లలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. దశాబ్దాలపాటు నిరాదరణకు గురైన వారికి అభివృద్ధి ఫలాలను చేరవేయడంపైనే తమ సర్కారు దృష్టిపెడుతుందన్నారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలుచేపట్టి రెండేళ్లయిన నేపథ్యంలోసోమవారం ఆయన సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. తమ ప్రభుత్వం తెచ్చిన ప్రత్యక్ష నగదు బదిలీ, స్వచ్ఛభారత్, పిఎం ఆవాస్‌యోజన ఆయుష్మాన్‌భారత్ వంటిపథకాలుప్రత్యేకించి ప్రస్తావించారు. ప్రజలకు అవకాశాలు గౌరవం కల్పించడమే లక్ష్యంగా వాటిని తెచ్చామని, వికసిత్ భారత్ లక్ష్యసాధనలో మరింత ముందుకు పోయేందుకు ప్రజాదీవెనలే మరింత ముందుకు నడిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే 12ఏళ్ల పాలన వేడుకలతోపాటు ప్రధాని మోడీ ప్రధానిగా రికార్డుకాలం పూరినతచేసుకున్నారు. మొత్తం 4399 రోజులు ప్రధానిగా పదవిలోకొనసాగి ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. జవహర్‌లాల్‌నెహ్రూ 1952 మే 13నుంచి 1964 మే 27వరకూ నిరాఘాటంగా పదవిలో కొనసాగి 4398 రోజులు గడిపారు. ఇపుడు ప్రధానిగామోడీ నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. అత్యధికకాలం ప్రధానిగా కొనసాగిన నేతల జాబితాలో మూడోస్థానంలో ఇందిరాగాంధీ నిలిచారు. ఆమె 1966 జనవరి 24నుంచి 1977 మార్చి 24వరకూ వరుసగా 4077 రోజులుపదవిలో ఉన్నారు. అలాగే దేశ చరిత్రలో అత్యధికకాలం పాలన కొనసాగించిన ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా కూడా మోడీ రికార్డుసాధించారు. సిక్కిం సీఎంగా పవన్‌కుమార్ చామ్లింగ్ 8930 రోజులు పనిచేస్తేప్రధానిమోడీ ఈ ఏడాది మార్చినలోనే ముఖ్యమంత్రి, ప్రధానిగా మొత్తం ఆరికార్డును అధిగమించారు. 2001 నుంచి 2014వరకూ గుజరాత్‌సీఎంగా మోడీ పనిచేసిన సంగతి తెలిసిందే. ఇక ఎన్డీయే పాలన వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రధాన పక్షం బిజెపి నిర్ణయించింది. నియోజకవర్గాల్లో ప్రత్యేకకార్యక్రమాలనిర్వహణకు కార్యాచరణ ప్రకటించింది. దేశ రాజధాని ఢిల్లీలోకూడా ప్రధాని మోడీ రికార్డు పాలనతో ఆయన్ను సత్కరించేందుకనిర్ణయించింది. ప్రధానిమోడీ అధ్యక్షతన కేబినెట్ సమావేశం కూడా జరుగుతోంది. ఆ భేటీలోనే ప్రధానిని మంత్రివర్గం మొత్తం సత్కరించనున్నది. అలాగే బిజెపి కేంద్ర కార్యాలయంలో కూడా 12 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అధ్యక్షుడు నితిన్‌నబీన్‌సింగ్, జెపినడ్డా, రక్షణ, హోంమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలతోపాటు ఇతర కేంద్రమంత్రులు, ఎంపిలు పార్టీ సీనియర్లు ఈ వేడుకలకు హాజరుకానున్నారు.

## హోరువాన

>> ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. నగరంలోని కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, ముషీరాబాద్, చంపాపేట్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, సైదాబాద్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్‌లో, నారాయణగూడ, హైదర్‌గూడ, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, లంగర్‌హౌస్, కార్వాన్, మెహదీపట్నం, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లిలో వాన పడింది. బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, బోలక్‌పూర్, కవాడిగూడ,



మంగళవారం ట్యాంక్‌బండ్‌పై వరద నీరు

రామ్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, గచ్చిబౌలి, లింగంపల్లి, హైటెక్‌సిటీలో భారీ వర్షం కురిసింది. బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, జేబీఎస్, బేగంపేట్ ప్రాంతాలలో భారీ వర్షం పడింది. ఈ భారీ వర్షాల కారణంగా హైదర్‌గూడలో ఓ భారీ వృక్షం నెలకొరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రామ్‌నగర్ వీఎస్టీ రోడ్డులో మరో చెట్టు నేలకొరిగింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం రహదారులపై వరద నీరు నిలిచిపోయింది. వరద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మాదాపూర్ పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద వరద వర్షపు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇదే తరహాలో గచ్చిబౌలి, మాదాపూర్‌లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. దీంతో ఆప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మియాపూర్ జేపీనగర్‌లో రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హిమాయత్‌నగర్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వృక్షం నేలకొరిగింది. బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయం వద్ద చెట్టు విరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రాజేంద్రనగర్‌లోని పాత కర్నూలు రహదారిపై వరద నీరు నిలిచింది. బన్సీలాల్‌పేటలో అత్యధికంగా 8.7 సెం.మీ, విఠల్‌వాడిలో 7.8 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7.8 సెంటీమీటర్లు, విద్యానగర్‌లో 7.3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద 7.8 సెం.మీ, బహుదూర్‌పురలో 5.7 సెం.మీ, మారేడపల్లి 5.7 సెం.మీ, నాంపల్లిలో 5.5 సెం.మీ, ఆసిఫ్‌నగర్‌లో 5.5 సెం.మీ వర్షపాతం రికార్డు అయింది. శేరిలింగంపల్లిలో 5.3, కూకట్‌పల్లిలో 5.2 సెం.మీ, అంబర్‌పేటలో 4.7 సెం.మీ. వర్షపాతం నమోదయింది. రాబోయే 48 గంటల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున, నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ అప్‌డేట్‌లను గమనించాలని, ప్రయాణించేటప్పుడు జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. కాగా నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని చేరుకోగా తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలియ జేసింది. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లో కూడా వర్షాలు కొనసాగుతాయని, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి మరియు మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ మరియు నల్గొండ జిల్లాలలోని కొన్ని ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే బుధవారం వాతావరణం తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట మరియు గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## అనంత లోకాలకు..

>> ఆధ్వర్యంలో, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన గాలింపులో తొలుత మృతదేహాలు లభించలేదు. అనంతరం స్థానిక గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టిన గాలింపులో ముగ్గురు అన్నదమ్ముల మృతదేహాలు వెలికి తీశారు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని కలచివేశాయి. ముగ్గురు కుమారుల మృతితో వారి తండ్రి రోధించిన తీరు పలువురు కంటతడి పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే వారు బాసరకు చేరుకుని గోదావరి తీరంలో బోరున విలపించారు. ఈ ఘటనతో ప్రాంతమంతా విషాద వాతావరణం నెలకొం ది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బాసర సీఐ దీపక్ తెలిపారు. ఇద్దరి కుమా రులకు వివాహం కాగా చిన్న కుమారుడికి వివాహం కాలేదని మృతుల తండ్రి తెలి పారు. మృతుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ హెచ్ ఓ తెలిపారు.ఈ ఘటన నదుల్లో స్నానానికి వెళ్లే సమయంలో అప్రమత్తత ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసింది. వర్షాకాలంలో నదుల ప్రవాహం, లోతు అంచనా వేయడం కష్టమవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## వారం - వర్జ్యం

10-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
దశమి రా.12.54
ఉత్తరాభాద్ర ఉ.9.18
వర్జ్యం : రా.8.46-రా.10.17
దు. ఉ.11.40-మ.12.32
శుభసమయం: ఉ.8.00-9.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగుతారు.

**వృషభం:** క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవ హరించండి. లాభనష్టాలు అనుకూల ప్రతికూల వ్యవహారాలు రెండు సమానంగా ఉంటాయి.

**మిథునం:** కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి. వాహనయోగం కలదు.

**సింహం:** సంతాన విద్యావిషయంలో ఎక్కువ ప్రాముఖ్యత కనబరుస్తారు. పేరు ప్రఖ్యాతల కోసం విశేషంగా శ్రమిస్తారు.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైనా ఆటంకాలు తొలగుతాయి. వస్త్రలాభం.

**తుల :** సెంటిమెంట్లు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల కలయిక.

**వృశ్చికం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఆస్తి విషయంలో ఒప్పందాలు కుదురుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆభరణాలుకొనుగోలు.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా వుండండి. కొత్త పరిచయాలు.

**కుంభం:** ఇళ్ళకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి. వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతాయి.

**మీనం:** బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పరిచయాలు పెరుగుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గచ్చిబౌలిలో భారీ చోరీ

>> తాళం చెవిని లాకర్ మీద ఉన్న చెంబులో పెట్టడమే నిందితులకు వరంగా మారింది. యదేచ్ఛగా తాళం చెవితో లాకర్‌ను తెరిచి కోట్లాది రూపాయల విలువైన సొత్తును చోరీ చేసిన దుండగులు, తాపీగా ఆటోలో వెళ్లి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లో రైలు ఎక్కి నగరం దాటారు. ఈ దోడిపీకి వెంటనే స్పందించిన పోలీసులు ప్రత్యేక బ ృందాలతో గాలింపు చేపట్టగా, దేశం దాటుతున్న నిందితులను ఉత్తరప్రదేశ్‌లో పట్టుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ఐటి కారిడార్ పరిధిలోని గచ్చిబౌలి హిల్‌రిడ్జ్ కమ్యూనిటీలోని విల్లా నెంబరు 73లో ప్రకాశ్ పాయ్(73) తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కాగా ప్రకాశ్ పాయ్ ఢిల్లీలో ఉన్న తన బంధువుల ఇంట్లో వేడుక కోసం తన భార్య వందన, కుమారుడు అభిజీత్‌తో కలిసి ఇంటికి తాళం వేసి ఈనెల 6వ తేదీన సాయంత్రం బయలుదేరి వెళ్లి, 7వ తేదీన సాయంత్రం తిరిగి వచ్చాడు. ఇంటి బాల్కానీకి చెందిన గ్లాసు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా, లాకర్ పైన వినాయకుడి పటానికి ఉన్న 4తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో పాటు ఇంట్లోని సర్వెంట్ గదిలో ఉండాల్సి న నేపాలీ భార్య, భర్తలు సైతం కనిపించకుండా పోయారు. దీంతో ప్రకాశ్ పాయ్ వెంటనే గచ్చిబౌలి పోలీసులకు 7వ తేదీన పిర్యాదు చేశాడు. కాగా 8వ తేదీ అతని కుమారుడు వచ్చి లాకర్ తెరువగా, అందులో ఉండాల్సి న 6కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాల ఆభరణాలు కనిపించలేదు. దీంతో ప్రకాశ్ పాయ్ మరోసారి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేశాడు. వ్యాపారవేత్త ప్రకాశ్ పాయ్ తన ఇంటి అవసరాల కోసం గత 20 రోజుల క్రితం విమలా షాహీ, కమల్ షాహీ అనే భార్య,భర్తలను పనిలో పెట్టుకున్నాడు. వీరు ఇంటి పనులు చేస్తూ అక్కడే ఉన్న సర్వెంట్ గదిలో నివాసం ఉంటున్నారు. కాగా ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న గదిలో రెండు లాకర్లు ఉండగా, వాటి తాళం చెవిని ప్రకాశ్ పాయ్ ఎప్పుడూ లాకర్ పైన ఉన్న చెంబులో పెట్టడం అలవాటు. ఈనెల 6వ తేదీన కుటుంబంతో ఢిల్లీ వెళ్లిన ప్రకాశ్ పాయ్ లాకర్‌కు తాళం వేసి రోజు మాదిరిగానే లాకర్ తాళం చెవిని చెంబులో పెట్టి, ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ప్రకాశ్ పాయ్ కుమార్తె సైతం తన కుటుంబంతో వీరి ఇంటికి కొద్ది దూరంలోనే నివాసం ఉంటుంది. కాగా యజమాని ఢిల్లీకి వెళ్లడంతో కమల్ షాహీ తన భార్య విమలా షాహీతో పాటు మరో మహిళ కల్పనతో కలిసి చోరీకి పథకం వేశాడు. 6వ తేదీ రాత్రి ఇంటి బాల్కానీకి ఉన్న గ్లాస్‌ను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం లాకర్ పైన ఉన్న వినాయకుడి విగ్రహం చిత్రపటానికి ఉన్న 4తులాల బంగారు గొలుసును చోరీ చేశాడు. దీంతో పాటు చెంబులో ఉన్న లాకర్ తాళంతో లాకర్ తెరిచి, అందులో ఉన్న దాదాపు 5 కోట్ల రూపాయల విలువైన 5కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాల ఆభరణాలను చోరీ చేశారు.

**తాపీగా నడుచుకుంటూ వచ్చి...**

చోరీ అనంతరం నేపాలీ గ్యాంగ్ హిల్ రిడ్జ్ విల్లా నుంచి తాపీగా నడుచుకుంటూ పక్కనే ఉన్న ట్రిపుల్‌ఐటి జంక్షన్‌కు వచ్చారు. అనంతరం అక్కడి నుంచి ఓ ఆటోలో సికి ంద్రాబాద్‌కు వెళ్లి ట్రైన్ ఎక్కి నగరం నుంచి పరారైనట్లు పోలీసు లు సిసి కెమెరాల ద్వారా గుర్తించారు. కాగా 7వ తేదీన ఇంటికి వచ్చిన ప్రకాశ్ పాయ్ కుటుంబ సభ్యులు మొదట వినాయకుడి చిత్రపటంకు వేసి ఉన్న 4తులాల బంగారు గొలుసు చోరీకి గురైనట్లు భావించి పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సైతం తేలిగ్గా తీసుకున్నారు. కాగా 8వ తేదీ వచ్చిన కుమారుడు తనవద్ద ఉన్న మరో తాళంతోలాకర్ తెరువగా, అందులోఉండాల్సిన 6కిలోలబంగారు ఆభరణాలు,వజ్రాల ఆభరణాలు కనిపించకపోవ డంతో 8వ తేదీన మరోసారి పోలీసులకు పిర్యాదు చేశారు. పగులగొట్టేందుకు వీలులేని భారీ లాకర్ ఉన్నా, తాళంవేసి తాళం చెవి అక్కడే ఉన్న చెంబులో పెట్టడం దొంగలకు వరంగా మారింది. లాకర్‌ను పగులగొట్ట కుండా తాళం చెవితో తెరిచి, అందులో ఉన్న కోట్లాది రూపాయల విలువైన సొత్తును చోరీ చేసి ఉడాయించారు.

**ఉత్తరప్రదేశ్‌లో చిక్కిన నిందితులు...**

కాగా వ్యాపారవేత్త ప్రకాశ్ పాయ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు 6 ప్రత్యేక బ ృందాలతో గాలింపు చేపట్టారు. మొదట 4 తులాల దొంగతనంగా భావించగా, మరుసటి రోజుకు కోట్లాది రూపాయల విలువైన దోపిడీగా మారడంతో కమీషనర్ ఆదేశాలతో పోలీసులు సైతం ప్రత్యేక బృందాలతో రంగంలోకి దిగారు. హిల్ రిడ్జ్ విల్లా నుంచి సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు 6 ప్రత్యేక బ ృందాలతో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో గాలింపు చేపట్టారు. నిందితులు దేశం దాటి నేపాల్‌కు వెళ్లకుండా ముందు జాగ్రత్తగా ఇతర రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేశారు. కాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉదయ్‌పూర్ జిల్లా రాంపూర్ వద్ద నేపాల్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఈ ముఠా పోలీసులకు చిక్కింది. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి చోరీ సొత్తును మొత్తం స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితులను నగరానికి తీసుకువస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇఎన్‌సి మోహన్ నాయక్ ఇంట్లో ఎసిబి సోదాల్లో బయటపడిన నగదు, ఆభరణాలు

# ఎసిబి వలలో మరో భారీ అవినీతి తిమింగలం

>> మంగళవారం ఉదయం ఆరు గంటల స మయంలో గచ్చిబౌలిలోని ఆయన నివసించే విల్లాతో పాటు ఆయన సన్నిహితులు, కుటుంబ సభ్యులు వుండే డిచ్‌పల్లి, నిజామాబాద్ సహా 15 చోట్ల ఎసిబి అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. దాడుల సందర్భంగా మోహన్ నాయక్ ఇంట్లో 55 లక్షల రూపాయల నగదు, ఏడు బ్యాంకు ఖాతాల్లో కోటి 44 లక్షల రూపాయల నగదు, రెండు కోట్ల రూపాయల విలువ చేసే 2500 గ్రాముల బంగారు నగలు, మూడు లక్షల 60 వేల రూపాయల వెండి నగలు, కోటి 26 లక్షల రూపాయల ఇతర వస్తువులు, 11 లక్షల 25 వేల రూపాయల విలువచేసే సెల్‌ఫోన్లు లా ప్‌టాప్‌లు, 25 లక్షల రూపాయల విలువ చేసే రెండు కార్లు, డిచ్‌పల్లిఓ 82 లక్షల 89 వేల, 750 రూపాయల ఖరీదు చేసే 19.38 ఎకరాల వ్యవసాయ పొలం, కొంపల్లిలో ఖరీదైన ఏడు ప్లాట్లు, గచ్చిబౌలిలె నాలుగు ప్లాట్లు (వీటి విలువ ఏడు కోట్ల 50 లక్షల రూపాయలు), కూకట్‌పల్లి లో కొత్తగా నిర్మాణమైన 62.14 లక్షల రూపాయల విలువైన మరో ఇల్లు, నిజామాబాద్‌లో కోటి రూపాయలతో నిర్మాణంలో వున్న మరో ఖరీదై న ఇల్లు వెలుగు చూశాయి. మొత్తం మీద మోహన్ నాయక్ అక్రమాస్తుల విలువ 17 కోట్ల 94 లక్షల 62 వేల 617 రూపాయలుగా తేలింది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. అక్రమాస్తుల కేసులో సోదాల అనం తరం మంగళవారం మోహన్ నాయక్‌కు ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. ప్రభుత్వ విభాగాల్లో అక్రమార్కులపై, అవినీతి అధికారులపై ఎసిబి టోల్‌ఫ్రీ నం.1064కు ఫోన్ చేయాలని ఎసిబిచీఫ్ చారుసిన్హా కోరారు.

## నామినేషన్ తిరస్కృతి

>> తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టినట్లు నిర్ధారించి ఎన్నికల అధికారులు దాన్ని తిరస్కరించారు. నటరాజన్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు ఈసీ అధికారులు వెంటనే నిర్ణయం తీసేసుకున్నారు. కాంగ్రెస్ ఈ అభ్యంతరాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అది నిరాధారమైనదని పేర్కొంది. నటరాజన్ ఎలాంటి క్రిమినల్ కేసును ఎదుర్కోవడం లేదని, అందువల్ల బీజేపీ పేర్కొన్న విషయాన్ని వెల్లడించాల్సి న అవసరం ఆమెకు లేదని ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్, ఇతర పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ విషయం కేవలం ఒక కోర్టు నోటీసుకు మాత్రమే సంబంధించింది కానీ, అధికారికంగా నమోదైన క్రిమినల్ కేసుకు కాదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం, అభ్యర్థులు అధికారికంగా నమోదై, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే వెల్లడించాలి కానీ, సాధారణ న్యాయపరమైన నోటీసులను కాదని ఆ పార్టీ వాదిస్తోంది.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ రద్దు ప్రజాస్వామ్యంపై దాడి

### ఆమెపై తెలంగాణలో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్9:** మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ దాఖలు చేశారు. దీనిని ఎన్నికల అధికారి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఈ నామినేషన్ తిరస్కరణను సీఎం తీవ్రంగా ఖండించారు. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం బీజేపీ కుట్ర అని ఆరోపించారు. 'వోట్ చోరీ', 'ఎస్‌ఐఆర్' తర్వాత, ఇప్పుడు 'సీట్ చోరీ'కి బీజేపీ పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో మీనాక్షినటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. ఇలా చేయడం ప్రజల గొంతులను అణచివేయడ మేనని సీఎం ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు అని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని పౌరులందరూ ఖండించా లని పిలుపునిచ్చారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని.. న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్

>> తెగ, వెనుకబడిన తరగతి, ఆర్థికంగా వెనుకబడిన తరగతి, మైనారిటీ, వికలాంగులు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్ పొందడానికి అర్హులు. కుటుంబ మొత్తం ఆదాయం సంవత్సరానికి రూ. 2,50,000/ (రెండు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే) మించకూడదు. అతను, ఆమె పేరు మీద ఆధార్‌తో అనుసంధానించబడిన మొబైల్ నంబర్‌కు లింక్ చేయబడిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలి. ఆదాయ ధృవీకరణ పత్రం ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం కొనసాగే కోర్సులో మొదటి ఏడాది ప్రవేశ సమయంలో ఒకసారి మాత్రమే సమర్పిస్తే సరిపోతుంది. అదే కోర్సు మొత్తం వ్యవధికి చెల్లుబాటులో ఉంటుందని జీవోలో పేర్కొంది. ఫీజులను నాలుగు దశల్లో డీబీటీ ద్వారా విద్యార్థుల ఖాతాలో జమ చేయనున్నారు.డీబీటీ ద్వారా ట్యూషన్ ఫీజుల విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను జీవో ఎంఎస్ 9లో వెల్లడించింది. ట్యూషన్ ఫీజులను విద్యా సంవత్సరం పొడవునా విడుదల చేస్తారు, ఈపాస్ పోర్టల్ సంవత్సరం పొడవునా తెరిచి ఉంటుంది. ఏప్రిల్ 1 నుండి జూలై 31 మధ్య నమోదు చేసుకున్న అర్హులైన విద్యార్థులకు.. ప్రభుత్వం తన వాటాను ఆగస్టు 15 లోగా విడుదల చేస్తుంది. ఆగస్టు 1 నుండి నవంబర్ 30 మధ్య నమోదు చేసుకున్న విద్యార్థులు తమ ట్యూషన్ ఫీజును డిసెంబర్ 30 లోగా అందుకుంటారు. డిసెంబర్1 నుండి జనవరి31 మధ్యనమోదు చేసుకున్న విద్యార్థులకు,ట్యూషన్ ఫీజుఫిబ్రవరి 28లోగాబదిలీ చేయబడుతుంది. ఫిబ్రవరి1 నుండి మార్చి31 మధ్య అందిన దరఖాస్తులకు.. వారి ఫీజు 75 రోజులలోపు విడుదల చేయబడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజును విడుదల చేసిన తర్వాత, కేంద్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తుంది. ఇప్పటి వరకు ఫీజు మొత్తాన్ని విడుదల చేయడానికి కాలపరిమితిని ఇవ్వకుండా, కళాశాలలకు బదులుగా విద్యార్థులకు డీబీటీని ప్రవేశపెట్టిన జీవో ఎంఎస్ నంబర్7లోని క్లాజ్ 12పై హైకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వు ప్రకారం, అడ్మిషన్ల సమయంలో ఫీజును ముందుగానే చెల్లించమని విద్యార్థులను బలవంతం చేయవద్దని కళాశాలలకు సూచించబడింది.

## ఫోన్ ట్యాపింగ్‌పై కొనసాగుతున్న విచారణ
# బోడుప్పల్ మాజీ మేయర్ వాంగ్మూలం

**హైదరాబాద్ జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల విచారణ కొనసాగుతోంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ గోల్‌మాల్ వ్యవహారం 2024 మార్చి నెలలో రట్టయిన విషయం తెలిసిందే. ఈ కేసులో నలుగురు నిందితులు అరెస్టవగా మరో ముగ్గురు ముందస్తు బెయిల్ పొంది పోలీసుల విచారణకు హాజరవడం విదితమే. రెండేళ్లకు పైగా విచారణ జరుగుతున్న ఈ కేసులో తాజాగా అప్పట్లో బాధితులుగా వున్న వారిని సిట్ అధికారులు వరుసగా విచారిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌ను సిట్ అధికారులు విచారించారు. అప్పట్లో అజయ్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ అధికారుల విచారణలో తేలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజయ్ యాదవ్ తండ్రి వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంఎల్ఏగా పోటీ చేయడంతో ఈ ట్యాపింగ్ జరిగిందని సిట్ అధికారులు తేల్చారు. గంటకు పైగా సాగిన విచారణ అనంతరం అజయ్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ నాటి బిఆర్ఎస్ సర్కారు రాజకీయ కారణాలతోనే తన ఫోన్‌ను ట్యాపింగ్ చేసిందని ఆరోపించారు. అప్పటి సర్కారు నిఘా విభాగంతో పాటు అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. తన ఫోన్ ట్యాపింగ్ వెనక నాటి మంత్రి మల్లారెడ్డి హస్తం వుందని అజయ్ యాదవ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌కు బాధ్యులైన వారిని కచ్చితంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.




# ఒడిశాలో భారీ డంప్ స్వాధీనం

**చింతూరు, జూన్ 9 ప్రభాతవార్త:** ఒడిస్సాలోని మల్కనగిరి జిల్లాలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్ మంగళవారం పోలీసుల వశమైంది. ఎల్ ఎం జి, ఇన్సాస్ వంటి ఆయుధాలతో సహా 32 రకాల ఆయుధ సామాగ్రిని పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. లొంగిపోయిన మావోయిస్టు ద్వారా సేకరించిన సమాచారంతో భద్రతా బలగాలు డంపు కోసం శోధించగా మావోయిస్టులకు చెందిన డంప్ బయటపడింది. ఈ విషయాన్ని మల్కాన్‌గిరి జిల్లా జిల్లా ఎస్పీ వినోద్ పాటిల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలోని కిటిమిటి, కటువావదర్ అటవీ ప్రాంతంలో బీఎస్ఎఫ్ మరియు డీవీఎఫ్ జవాన్లు సంయుక్తంగా నిర్వహించిన కూంబింగ్, గాలింపులో డంప్ బయట పడినట్లు ఆయన ప్రకటించారు. డంప్ స్వాధీనంతో మావోయిస్టుల కార్యకలాపాలకు గట్టి దెబ్బ తగిలిందని, మల్కాన్‌గిరి జిల్లాలో మావోయిస్టు ఉనికి లేనట్లే అని చెప్పవచ్చు అని ఈ సందర్భంగా ఎస్.పి తెలిపారు. ఈ ప్రాంతంలో కూంబింగ్, సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు.

# ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురు మృతి

**మిర్యాలగూడ, జూన్ 9 ప్రభాతవార్త:** దామరచర్ల మండలం వాడపల్లి శివారులో మంగళవారం అర్ధరాత్రి నార్కట్ పల్లి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన బత్తుల ధనుంజయరావు (44), ఉప్పుతల నరసింహారావు (40)లు లోడింగ్ కార్మికులుగా సిమెంట్ ఫ్యాక్టరీలలో పనిచేస్తుంటారు. స్థానిక ఇండియా సిమెంట్ కర్మాగారంలో లోడింగ్ పని లేకపోవడంతో, జాన్ పహాడ్ వద్ద గల డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీకి లోడింగ్ కోసం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, లారీ యార్డ్ ఇండియన్ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత రాంగ్ రూట్లో అంధ్రప్రదేశ్ లోని దాచేపల్లి మండలం నారాయణపురంకు చెందిన డెక్క వెంకటేశ్వర్లు (25) తన ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్నవారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా నల్లగొండ సమీపంలో నరసింహారావులు మృతిచెందినట్లు సమాచారం. మృతులలో ధనుంజయరావు భార్య సైదమ్మ, కుమారుడు పూర్ణచందర్, కుమార్తె నాగలక్ష్మి ఉన్నారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అవివాహితుడు కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసి గ్రామీణ సీఐ పి.నాగ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు వాడపల్లి ఎస్సై ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి


బి.రఘు(ఫైల్)

**హైదరాబాద్ జూన్ 9, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా గాంధారి పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. జిల్లాలోని బాన్సువాడకుచెందిన బి.రఘు (42) 2011లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. నిజామాబాద్ జిల్లాకు కేటాయించబడి పలు పోలీసు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం గాంధారి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం తొమ్మిదిగంటలకు ఇంటి నుంచి స్టేషన్‌కు డ్యూటీకి వస్తుండగా మార్గమధ్యలో వున్నట్టుండి వాంతులు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు వెంటనే స్పందించి రఘును స్థానికంగా వున్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించి అక్కడ వైద్యం అందించారు. అయితే గంట తరువాత ఆయన చనిపోయారు. కాగా కానిస్టేబుల్ రఘుకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. ఆయనమృతిపట్ల జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర తీవ్రసంతాపం తెలిపారు. గాంధారి పోలీసుఅధికారులు,సిబ్బంది ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

# బాల్క సుమన్‌ను పరామర్శించిన దాసోజు

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** వివాదాస్పద వ్యాఖ్యల నేపధ్యంలో అరెస్టయి చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను మంగళవారం బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ములాఖత్‌లో కలిసిపరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాల్క సుమన్ ఆరోగ్య వివరాలు, కేసువివరాల గురించి అడిగినట్లుగా తెలుస్తుంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అక్రమాలు, దోపిడిని బయటపెట్టినందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బాల్క సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్టుచేసి జైలుకు పంపారన్నారు. బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో నాయకులు కురువ విజయ్, లీగల్ సెల్ అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ ఉన్నారు.

# జీతాల చెల్లింపులో జాప్యం వద్దు
## అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
## ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లులు ప్రాసెస్, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బడ్జెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ఫైనాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉద్యోగులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి

# అంగన్‌వాడీల కష్టాలు సిఎంకు పట్టవా?
## బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్‌రెడ్డి ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించి మహిళలపై ఆయనకు ఉన్న గౌరవాన్ని నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పేర్కొన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు సిఎంకు కనిపించడం లేదా? అని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్‌వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుందని హెచ్చరించారు. మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయం అని పేర్కొన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కెసిఆర్ వారు వర్కర్లు కాదు, అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించి, వారి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది అని కానీ, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్ని రూ.7,800 లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారని తెలిపారు.

అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని చెప్పారు. మాయ మాటలు చెప్పి, రెండున్నరేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీలేదు, గతీ లేదు అని విమర్శించారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటాం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని ఎద్దేవా చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కశంగా వ్యవహరించిన దుర్మార్గమైన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అని పేర్కొన్నారు.

ఇప్పటికైనా కళ్లు తెరవండి, మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతు న్నారన్న విషయాన్ని గుర్తించండి అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంగన్ వాడీల వేతనాలను చెల్లించాలని, అప్‌గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన చేపప్రసాదం పంపిణి
## రెండు లక్షలమంది పైగా స్వీకరణ



**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 9ప్రభాతవార్త:** ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా మృగశిర మాసాన్ని పురస్కరించుకుని బత్తిని సోదరులు ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సోమవారం రాత్రి ప్రారంభించిన చేప ప్రసాదం మరుసటి రోజు మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, మత్స్య శాఖ చైర్మన్ మెట్టు సాయి కుమార్ రంగంలోకి దిగి నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగే చేపప్రసాదానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పర్యవేక్షణలో అన్ని విభాగాల అధికారులను ఏర్పాట్లలో సమన్వయం చేశారు. ప్రభుత్వ పరంగా లక్ష6వేలపైగా కొర మీనులను విక్రయించినట్లు మత్స్య శాఖ చైర్మన్ మెట్టుసాయి కుమార్ తెలిపారు. దూద్‌బౌలి, కవాడిగూడ ప్రాంతాలల్లో ఈ ప్రసాదానికి మన రాష్ట్రం కంటే ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన అస్తమాగ్రస్తులు చేప ప్రసాదాన్ని తీసుకున్నారు. 34 కౌంటర్లను ఏర్పాటు చేసి ఉబ్బసం వ్యాధిగ్రస్థులకు చేప ప్రసాదాన్ని వేశారు. గత మూడు రోజుల పాటు చేప ప్రసాదం పంపిణీకి ఆయా శాఖలు యుద్ద ప్రాతిపదికన ఏర్పాట్లు చేప ప్రసాదం కోసం వచ్చే ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శభాష్ అనుపిం చుకున్నారు.

కాగా పోలీసులు, బల్దియా, వాటర్ వర్క్స్, ట్రాన్స్ కో, ఆర్టీసి, మత్స్య శాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూశాఖలు అస్తమా వ్యాధిగ్రస్థులు వారిసహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కాగా మంగళవారం కూడా బత్తిని సోదరులు దూద్‌బౌలి, వనస్థలిపురం, కవాడిగూడలో వారి ఇంటి వద్ద చేపప్రసాదం వేసినట్లు వారి లెక్కల ప్రకారం దాదాపు 2లక్షల నుంచి 3లక్షల వరకు చేప ప్రసాదాన్ని వేసినట్లు బత్తిని అమర్‌నాథ్ గౌడ్, శంకర్‌గౌడ్‌లు తెలిపారు. ఎట్టకేలకు చేప ప్రసాదం ప్రశాంతంగా ముగిసింది. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు ఆల్పహారం, మంచినీటి ప్యాకెట్లు రోగి వెంట వచ్చిన వారికి అందచే యడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ట్రాఫిక్ క్రమబద్దీకరిం చారు. లా అండ్ అర్డర్ పోలీసులు బందోబస్తును చేపట్టారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల పర్యవేక్షణలో కొనసాగింది. కాగా సాయంత్రం 4 గంటల సమయంలో అకస్మా త్తుగా భారీ వర్షం కురవడంతో కొంత ఇబ్బంది ఎదుర్కొన్నారు.

# ఈగల్‌కు చిక్కిన ఇద్దరు అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్లు
## బ్యాంకాక్ నుంచి ఓజి గంజాయితో వస్తుండగా శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత



**హైదరాబాద్ జూన్ 9, ప్రభాతవార్త:** బ్యాంకాక్ నుంచి బ్రాండెడ్ హైడ్రోపోనిక్ (ఓజి) గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్జాతీయ ముఠాలో మరో ఇద్దరిని ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ వారిలో టాలీవుడ్‌లో జూనియర్ ఆర్టిస్టుగా వున్న ఓ మహిళతో పాటు కేరళకు చెందిన బడా స్మగ్లర్ వున్నాడు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం మీడియాకు వెల్లడించారు. బ్యాంకాక్ నుం చి భారత్‌లోని అనేక నగరాలకు ఘాటైన మత్తు కలిగిన హైడ్రోపోనిక్ గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను ఈగల్ పోలీసులు వారం రోజుల క్రి తం రట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా స్మగర్లతో పాటు భారీగా హైడ్రోపోనిక్ గంజాయి పట్టుబడడం విదితమే. ఈ ముఠా సభ్యులను విచారించగా మరికొందరి వివరాలు తెలిశాయి. వీరిపై నిఘా వుంచగా ఇద్దరు వ్యక్తులు బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు హైడ్రోపోనిక్ గంజాయితో వస్తున్నట్లు తేలింది. దీంతో ఈ విషయాన్ని ఈగల్ అధికారులు కేంద్ర నార్కోటిక్ బ్యూరో అధికారులకు వెల్లడించి బ్యాంకాక్ నుంచి వస్తున్న ఇద్దరిపై నిఘా వుంచి వారిపై ఎల్ఓసి జారీ చేయించి ఈ విషయాన్ని గోప్యంగా వుంచారు. దక్షిణాది రాష్ట్రాలలోని అన్ని విమానాశ్రయాల వద్ద కాపుకాశారు. ఈ విషయం తెలియని అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్లు బ్యాంకాక్ నుంచి 2.15 కిలోల గంజాయితో బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఈ నెల ఆరవ తేదీ అర్ధరాత్రి సమయంలో వచ్చారు. వీరిపై అంతకు ముందే నిఘా వుండడంతో విమానాశ్రయం నుంచి బ యటకు వెళ్లే గేట్ వద్ద ఈగల్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో టాలీవుడ్‌లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్న దొడ్డి సు రికళ (42). 2.15 కిలోల హైడ్రోపోనిక్ గంజాయితో పట్టుబడింది. ఈమెను విచారించగా తాను కేరళకు చెందిన చల్లిలి పుతాన్ పురయిల్ నఫ్షిద్ అలియాస్ అలెక్స్ (45) ఆదేశాలతో ఈ స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలిపింది. అతను తన వెనకాలే వస్తున్నట్లు చెప్పడంతో ఈగల్ పోలీసులు సమీపంలోనే వున్న అలెక్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా సురికళ ఇంతకు ముందు ఈ ఏడాది మార్చి నెలలో బ్యాంకాక్ నుంచి రెండు కి లోలకు పైగా గంజాయి ప్యాకెట్లను అలెక్స్ ఆదేశాలతో చెన్నయ్ విమానాశ్రయంఓ రాజు బిస్వాస్ అనే వ్యక్తికి ఇచ్చి 20 వేల రూపాయలు తీసుకున్నట్లు తెలిపింది. రెండవసారి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మరోసారి బ్యాంకాక్ నుంచి రెండు కిలోల గంజాయితో శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చి ఇక్కడి స్మగ్లర్‌కు అందజేసి పది వేల రూపాయలు తీసుకుంది. గంజాయి స్మగ్లింగ్‌లో డబ్బులు వస్తుండడంతో సురికళ మరోసారి బ్యాంకాక్ వెళ్లి 2.15 కిలోల గంజాయితో హైదరాబాద్‌కు వచ్చి ఈగల్ పోలీసులకు దొరికిపోయింది. కాగా సురికళతో పాటు ఈ దందాలో వున్న గౌ రి అనే మరో మహిళ చెన్నైలో పట్టుబడింది. భవాని అనే మహిళ ఇంతకు ముందు హైదరాబాద్‌లో పట్టుబడిందని ఈగల్ డైరక్టర్ సందీప్ శాం డిల్యా తెలిపారు. మాదకద్రవ్యాల విషయంలో సర్కారు కఠినంగా వుందని, స్మగర్ల భరతం పడతామని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ సంబం ధించి ఎటువంటి సమాచారంవున్నా 1908 లేదా 8712671111 కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం: మంత్రి అజారుద్దీన్



**హైదరాబాద్, జూన్9, ప్రభాతవార్త:** మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మైనార్టీ సంక్షేమ శాఖ, తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు లక్ష ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. మైనార్టీ యువతను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేసేందుకు మైనార్టీ సంక్షేమ శాఖ, టీజీఎంఎఫ్‌సీ సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు సహా అన్ని మైనార్టీ వర్గాల యువతకు ఎలాంటి వివక్ష లేకుండా అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

జాబ్ మేళా ఉద్దేశం కేవలం ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేయడం మాత్రమే కాదని, ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరి స్థిరపడే వరకు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తు న్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇటువంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. టీజీఎంఎఫ్‌సీ ఆధ్వర్యంలో పరిశ్రమల అవస రాలకు అనుగుణంగా వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందిం చుకోవాలని, ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపుని చ్చారు. టీజీఎంఎఫ్‌సీ, అనుబంధ శిక్షణ సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాలో 50 నుంచి 60 వరకు ప్రముఖ కంపె నీలు పాల్గొన్నాయి. లాజిస్టిక్స్, ఈకామర్స్, రిటైల్, హాస్పిటాలిటీ, మాన్యు ఫాక్చరింగ్, ఆటోమొబైల్, నిర్మాణ రంగం, ఐటీఈఎస్, బీపీఓ, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, కార్పొరేట్ అడ్మి నిస్ట్రేషన్ తదితర రంగాల్లో ఉద్యోగాలు కల్పిం చాయి.

కాగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2 వేల మంది మైనార్టీ యువత ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. ఉద్యోగ అవకాశాలతో పాటు, కెరీర్ కౌన్సె లింగ్, నైపుణ్యాభివృద్ధి కోర్సుల నమోదు సదుపాయాలను కూడా నిర్వాహకులు కల్పించారు. దాదాపు 20 శిక్షణ సంస్థలు కూడా పాల్గొని తమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాయి.

# 'సర్' 25నుంచి ప్రారంభం: ఇఆర్‌ఒల శిక్షణ కార్యక్రమంలో సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఈనెల 25వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, దీనిని ప్రశాంతంగా నిర్వహించేందుకే మంగళవారం ప్రధాన ఎన్నికల కార్యాలయం (బిఆర్ కె భవన్)లో రాష్ట్రంలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్‌వో)శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ లిస్టులో చేర్చాలని, అదేవిధంగా అనర్హులైన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంతో ఎన్నికల అధికారుల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రత్యేకించి ఎస్ఐఆర్‌కు సంబంధించిన బీఎల్ఓ యాప్‌తో కూడిన ఈసీఐనెట్ అప్లికేషన్‌పై వారికి సమగ్ర అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ అమలు సమయంలో ఎదురయ్యే సవాళ్లపై పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సిఇఒ సూచించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి (ఎస్‌టిఎన్‌ఓ) బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పీఎం-ఐటీ డి. చిరంజీవి, ఈసీఐనెట్, బీఎల్ఓ యాప్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ)ఎ.ఎస్. చారిలతోపాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# సింగరేణిలో జూలైలో సమ్మె
## యాజమాన్యానికి నోటీసు ఇచ్చిన కార్మిక సంఘం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణిలోని కార్మిక సంఘం సమ్మె చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యానికి గుర్తింపు కార్మిక సంఘం సమ్మె నోటీసు జారీ చేసింది. ప్రధానంగా సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం, ఇతర సమస్యలను పరిష్కరించడంలో సంస్థ యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ కొత్తగూడెంలో సంస్థ జీఎం (పర్సనల్) కవితా నాయుడికి సమ్మె నోటీసు అందజేసింది. దాదాపు 30 డిమాండ్లను సమ్మె నోటీస్‌లో పేర్కొంది. ఈ నెలాఖరుకల్లా సమస్యలు పరిష్కరించకపోతే జూలైలో సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని అల్టిమేటం ఇచ్చింది. ఇప్పటివరకు ఒక కొత్త గనిని ప్రారంభించకపోవడం, బొగ్గు నాణ్యత లేదనే సాకుతో గనులను మూసివేస్తున్నారని, కారుణ్య నియామకాలు, సింగరేణి లాభాల వాటాపై యాజమాన్యం శ్వేత పత్రం విడుదల చేయాలని, సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.50 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఈ సందర్భంగా గుర్తింపు పొందిన కార్మిక సంఘం డిమాండ్ చేసింది.

# పిఒకెలో కాల్పులు: 30 మంది మృతి
## 200మందికిపైగా గాయాలు



**కరాచి,జూన్ 9:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలుజరిపిన కాల్పుల్లో 30 మంది మృతిచెందగా, మరో 200 మంది గాయపడ్డారు. పాకిస్థాన్ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. రావల్‌కోట్, బింబేర్, ముజాఫరాబాద్‌లో పరిస్థితి దారుణంగా ఉంది. పాక్ దళాలు చాలా క్రూరంగా ఫైరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. టియర్ గ్యాస్‌తోనూ నిరసనకారుల్ని చెదరగొట్టారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) అనే సంస్థ ఇచ్చిన ఆందోళన మేరకు జనం నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓ ఆస్పత్రి మార్చురీ వద్ద భారీ సంఖ్యలో జేఏఏసీ కమిటీ మద్దతుదారులు చేరుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో గ్రూపులోని కొందరు ఆటోమెటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులను వాడారు. వచ్చేనెల 27వ తేదీన జరగనున్న ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థులకు 12 సీట్లు కేటాయించరాదు అని పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో అల్లర్లు చెలరేగాయి. స్థానికులు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ మద్దతుదారులు 30మందికి పైగా మృతిచెందగా సుమారు 200మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఆర్థిక, రాజకీయ సమస్యలపై నిరసనలు చేపడుతున్న జేఏఏసీ సంస్థను పాకిస్థాన్ ప్రభుత్వం గత వారం నిషేధించడంతో భారీ ఉద్రిక్తతలు చెలరేగాయి. ఆదివారం రావల్‌కోట్‌లో నిరసనకారులు, భద్రతా దళాలు మధ్య జరిగిన ఘర్షణల్లో పదులకొద్దీ ఆందోళనకారులు మృత్యువాత పడినట్లు సమాచారం.

# బిహెచ్‌ఇఎల్‌కు 2,400 మెగావాట్ల థర్మల్ కాంట్రాక్ట్
## ఈ పవర్ ప్రాజెక్టు విలువ రూ.21వేల కోట్లు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం పనులకు సంబంధించిన కాంట్రాక్టును భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) దక్కించుకుంది. దీని సామర్థ్యం 2,400 మెగావాట్లు కాగా, అంచనా వ్యయం రూ.21 వేల కోట్లుగా ఉంది. ఈ ఒప్పందం ప్రకారం ప్రాజెక్టు యొక్క ఈపీసీ ప్యాకేజీకి సంబంధించిన డిజైనింగ్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, నిర్మాణం, స్థాపన, పరీక్ష, ప్రాంభ పనులను బిహెచ్ఇఎల్ చేపడుతుంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఉత్తరప్రదేశ్‌లోని 3+800 మెగావాట్ల మేజా సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎస్‌టిపిపి) స్టేజ్-2 యొక్క ఈపీసీ ప్యాకేజీ కోసం మేజా ఊర్జా నిగమ్ (ఎంయుఎన్‌పిఎల్) నుండి రూ.21 వేల కోట్లకు పైగా విలువైన అవార్డు నోటిఫికేషన్‌ను పొందినట్లు వెల్లడించింది. నఅంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఈ టెండర్‌ను దక్కించుకుంది. ఈ అవార్డు నోటిఫికేషన్ తేదీ నుండ 70 నెలల్లోగా దీన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే నైజీరియాకు చెందిన ఒక సంస్థ నుండి రూ.2 వేల కోట్ల నుండి రూ.2,500 కోట్ల మధ్య విలువైన అర్డను కైవసం చేసుకున్నట్లు బిహెచ్ఈఎల్ తెలిపింది. ఇందుకుగాను డాంగోటి పెట్రోలియం రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్‌తో ఈ కాంట్రాక్టుపై ఇటీవల సంతకం చేసినట్లు వెల్లడించింది.

# సైబర్ నేరాల నిర్మూలనకు బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి
## ఆర్‌బిఐ గవర్నర్‌కు సిటీ కొత్వాల్ సజ్జన్నార్ లేఖ

**హైదరాబాద్ జూన్ 9, ప్రభాతవార్త:** దేశంలో అంతకంతకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను సమూలంగా రూపుమాపేందుకు బ్యాంకింగ్ వ్యవ స్థను వెంటనే ప్రక్షాళణ చేయాలని సిటీ కొత్వాల్ సజ్జనర్ తెలిపారు. ఈ విషయమై ఆయన మంగళవారం నాడు ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మ ల్హోత్రాకు ఒక లేఖ రాశారు. అమాయకుల పేర్లతో అనేక బ్యాంకుల్లో వేల సంఖ్యలో వున్న మ్యూల్ ఖాతాలు సైబర్ నేరాలకు కేరాఫ్‌గా మారుతు న్నాయని ఆయన తెలిపారు. సిటీ పోలీసులు చేబట్టిన స్పెషల్ ఆపరేషన్‌లో ఈ విషయం వెలుగు చూసిందని సజ్జనర్ తెలిపారు. బ్యాంకు ఖా తాలను తెరిచే సమయంలో కెవైసి ధృవీకరణలో నిర్లక్ష్యం కనబడుతోందని ఆయన తెలిపారు. ఈ విషయంలో అనేక బ్యాంకుల్లో జవాబుదారిత నం లోపించిందని, ఈ విషయంలో అధికారులకు కఠినమైన ఆదేశాలు జారీచేసి, వాటిని అమలు పరిచేలా చూడాలని కమిషనర్ తన లేఖలో కోరారు. ఆర్‌బిఐ జారీ చేసిన కెవైసి మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో...? లేదో...? తెలుసుకునేందుకు వెంటనే సిస్టమిక్ ఆడి ట్ నిర్వహించాలని ఆయన సూచించారు.

ప్రజల సొమ్ముకు రక్షణగా వుండాల్సిన బ్యాంకు సిబ్బంది నేరగాళ్లతో చేతులు కలుపుతుండడం ఎంత వరకు సరైందని ఆయన ప్రశ్నించారు. అనేకచోట్ల బ్యాంకు సిబ్బంది సహచర సిబ్బంది లాగిన్‌ను అక్రమంగా వాడి, నేరగాళ్లకు సహకరించారని ఆయన ఉదహరించారు. ఇలాంటివి అనేకం వున్నాయని ఆయన తెలిపారు. కొందరు బ్యాంకు సిబ్బంది కేవలం కమీషన్ల కోసం ఇలాంటి నేర పూరిత పనులకు పాల్పడుతూ మ్యూల్ ఖాతాలను తెరిచేందుకు సహకరిస్తున్నారని కమిషనర్ తెలిపారు. ప్రైవేటు బ్యాంకుల్లో ఇలాంటి గోల్‌మాల్ వ్యవహారాలు ఎక్కువగా వున్నాయని ఆయన తెలిపారు. నేరగాళ్లకు సహకరించిన బ్యాంకు సిబ్బందిపై శాశ్వతంగా నిషేధం విధించి వారిని బ్లాక్ లిస్టులో వుంచాలని ఆయన కోరారు. మ్యూల్ ఖాతాలపై ఉక్కుపాదం మోపేందుకు ఆర్‌బిఐ అధికారులు హైదరాబాద్ పోలీసులతో సంయు క్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని కమిషనర్ కోరారు. అనుమానాస్పద లావాదేవీలను నిలిపి వేసేందుకు సాంకేతికతను వాడాలని ఆయన కోరారు.

# మామిడి పండ్లు తిని అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** మామిడి పండ్లు తిని అనుమానస్పదస్థితిలో ఒక బాలిక మృతి చెందగ, మరో ముగ్గురు అమ్మాయిలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి సందీప్ తెలిపిన వివరాల ప్రకారం బీదర్‌కు చెందిన వైజినాథ్, ఇందుమతి దంపతులు జీవనోపాధికోసం హైదరాబాద్‌నగరానికి విచ్చేసి విఠల్‌వాడిలో నివాసం ఉంటున్నారు. కాగా వారి బంధువు రేణుక నారాయణగూడలోని జలమండలి కార్యాలయం సమీపంలో మామిడిపండ్లును ఖరీదుచేసుకుని వారి ఇంటికి వచ్చారు. ఆ మామిడిపండ్లును ఇందుమతితోపాటు నలుగురు కుమార్తెలు ఆదివారం తినడం జరిగింది. దీంతో వారందరికి వాంతులు, విరోచనాలు కావడంతో కాచిగూడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళారు. 3వ కుమార్తె భువనేశ్వరి (17) చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలివారు కూడా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్లు తెలిపారు. భువనేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నారాయణగూడ పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జడప్రాయంగా ఉన్న అమిత జ్ఞానం కన్నా చైతన్య రూపంలో ఉన్న పరిమిత జ్ఞానం మిన్న.

- ఖలీల్ జిబ్రాన్

# ఉసురు తీసిన ఉప'ద్రవ'ం

'ప్రమాదాలు చెప్పిరావు. ప్రాణాలు చెప్పిపోవు' ప్రతి ప్రమాదానికి ఇదే ట్యాగ్‌లైన్. ఎంతో సజావుగా సాగుతోందనుకున్న విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలో సోమవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 9 ప్రాణాలు కొడిగట్టాయి. అదేదో ఊపిరాడక ఉసురుమన్న ప్రాణాలు కావవి. అత్యంత వేడిమితో ఉండే స్టీల్ లిక్విడ్ మీద పడి సజీవ దహనమయ్యారు. అనుకోని ప్రమాదమే అయినా 'లిక్విడ్ స్టీల్' (ద్రవ ఉక్కు) తరలిస్తుండగా ఇలాంటి ప్రమాదాలు తప్పవని ఊహించగలిగిదే. గత 2 నెలలుగా 27 సార్లు ల్యాడిల్ గతి తప్పి స్టీల్ మెల్టింగ్ దుర్ఘటనలు జరిగాయి. ఒకసారి కాకపోయినా మరోసారైనా అలాంటి సందర్భాల్లో తీసుకోదగిన జాగ్రత్తలపై కార్మికులకు, వారిని పర్యవేక్షించే అధికారులకు అవగాహన ఉండే ఉంటుంది. కానీ అవేమీ వారిని చావునుంచి తప్పించలేకపోయాయి. మానవ తప్పిదం కాకపోయినా సాంకేతికత భద్రత విషయంలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరి లేదని చెప్పలేము. లాడెల్ నుంచి పైకెగిసిన ద్రవ ఉక్కు నేలపై విరజిమ్మిన సందర్భాల గురించి గతంలోనూ కార్మికులు ఇబ్బందులెదుర్కొన్నారని కార్మిక సమూహాలు చెప్పుకుంటున్నాయి. 33 ఏళ్లలో ఇలాంటి ప్రమాదాలు జరగలేదని అక్కడ అధికారులు నేతలతో చెప్తున్నారు. కానీ 14 ఏళ్ల క్రితం జూన్ నెలలో ఇదే ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో 19 మంది కార్మికులు మృతిచెందారు. జూన్ 13, 2012న ఆక్సిజన్ రిన్సింగ్ రిడక్షన్ స్టేషన్ దగ్గర ప్రేలుడు సంభవించింది. అది విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ చరిత్రలోనే అత్యంత ఘోరమైన ప్రమాదం. భద్రతా ప్రొటోకాల్స్ సరిగా పాటించలేదని కార్మిక సంఘాలు ఆరోపించాయి. సాధారణంగా ఇలాంటి ప్రమాదాల్లో నిర్లక్ష్యం ఒక కారణం కాగా భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమూ ప్రధాన సమస్యగా ఉంటుంది. వీటన్నిటినీ అజమాయిషీ చేసే మానవ తప్పిదమూ అనేక సందర్భంలో కారణాలుగా బయటికొచ్చాయి. లాడెన్ నుంచి విరజిమ్మిన ద్రవపు ఉక్కు సుమారు 1540 డిగ్రీల సెల్సియస్ వద్ద మరగించినదై వంద టన్నులకు పైగా ఉంటుంది.ఇలాంటి ద్రవం మీద పడితే తప్పించుకునే అవకాశం ఉండదు. ఈ విధంగా 'ద్రవ' రూపంలో ఉన్న ఉక్కు మీద పడి ప్రాణనష్టం జరిగిన దుర్ఘటన మరెక్కడా నమోదవలేదు. బ్లాస్ ఫర్నేస్‌లో అత్యంత అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసిన ముడి ఇనుమును ద్రవ ఇనుముగా మారిన తర్వాత లాడెల్‌లో ఉంచి తర్వాత ప్రక్రియకు తరలిస్తారు. ఆ మంటల్లో కాలి ముద్దయిన మృతదేహాలు ఎవరివో గుర్తించేందుకు ఏ ఆనవాయితీ దొరకలేదు. అది ఎవరిదో గుర్తుపట్టాలంటే ఒక్క డిఎన్ఎ పరీక్షలే శరణ్యం. ఆ రిపోర్టులే ఆ మృతదేహాలను వారి కుటుంబాలకు చేర్చగలవు. ల్యాడెల్ పేలుడు అనేది ఇదే ప్రథమం. కానీ దురదృష్టంలో కూడా అదృష్టమేమిటంటే ప్రమాద సమయంలో కొంత మంది 'టీ' విరామానికి బయటకు వెళ్లడం వలన ప్రాణనష్టం తగ్గింది. ఇలాంటి ప్రమాదాల్లో జరిగిన మరుక్షణాల్లోనే కాలి బూడిదవడమో, ముద్దలుగా మారడమో చూస్తుంటాం. చూడగలిగిన వారికి ఎంతో హృదయ విదారకమైన దృశ్యాలే కానవస్తాయి. నేతలదిగ్భ్రాంతులు, పరామర్శలు, నష్టపరిహారాలు ప్రకటన ఇవన్నీ కాలహరణమే తప్ప మృతి చెందిన వారి కుటుంబాలకు ఊరటనివ్వవు. తాజా ప్రమాదంలో కాలం చెల్లిన యంత్రాలు కాలదోషం పట్టిన ప్రమాదాలు, మానవ తప్పిదాలుగా చెప్పబడే ఏ అంశాలను చర్చించుకోజాలము. ల్యాడెల్‌ను హ్యాండిల్ చేయడంలో నిర్లక్ష్యమేమైనా ఉందా? ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఇంకా ఏదైనా ఆధునిక సాంకేతికత అవసరముందా?అన్న అంశాలపై నిపుణులు సూచనలు తీసుకోవాలి. రెండు నెలల నాడు ల్యాడెల్‌లో ద్రవం ఒలికిపోయి కార్మిక జనం కకావికలైన సందర్భంలోనే యాజమాన్యం ఆధునికత కోసంనిర్ణయం తీసుకుని ఉంటే మళ్లీ మళ్లీ అదే స్థాయి ప్రమాదాలు జరగకుండా ఉండేవేమో! దేశవ్యాప్త పారిశ్రామిక ప్రమా దాల్లో ఒక ఆందోళనకర ధోరణి తాజా ప్రమాదం దృష్టా ప్రతిషిష్ట్‌కు ముందే ల్యాడిల్, క్రేన్, కన్వేయర్, స్లైడ్‌గేట్ వాల్వులు వంటి అధిక ఉష్ణోగ్రత పరికరాలను తనిఖీ చేయాలి. అవి పాతవైయంటే మార్చాలి. ఉత్పత్తి లక్ష్యాల పెంపు లాభార్జన ధ్యేయంతో పాటు కార్మిక భద్రతకూ ప్రాధాన్య తనివ్వాల్సిన ఆవశ్యకత కన్పిస్తోంది. పారిశ్రామిక భద్రతపై ఉన్న ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సిన తరుణం ఆసన్నమైంది. అత్యాధునిక పరికరాల వినియోగం, యంత్రాల నిర్వహణ ప్రమాదాల ముందస్తు హెచ్చరిక వ్యవస్థల పెంపు, ఆధునిక సాంకేతికతపై కార్మిక శిక్షణ, కార్యక్రమాల నిర్వహణ అత్యంత ఆవశ్యకం. దేశంలో పారిశ్రామిక ప్రగతి వేగంగా దూసుకుపోతోందని చెప్పుకోవడమే తప్ప కార్మిక భద్రత విషయంలో పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. పరిశ్రమ పరిశ్రమకు ప్రత్యేక భద్రతా చర్యలుంటాయి.వాటి మీద చర్చించేందుకుఅంతర్గత భద్రతా కమిటీలుండాలి. ఒకప్పుడు విశాఖ ఉక్కు కర్మాగారం పరిశ్రమలకే తలమానికంగా ఉండేది. స్టీల్ ప్లాంట్‌లో ప్రారంభంలో 18వేల మంది ఉద్యోగులుండగా ప్రస్తుతం 8వేల మంది మాత్రమే. అప్పుడున్న కార్మిక భద్రత ఇప్పుడు లేకపోవడమే చెప్పుకోదగినది. భద్రతా ప్రమాణాలు సరిగా ఉండవనే అభిప్రాయం కలిగితే కార్మికులు కూడా దొరికే పరిస్థితి ఉండదు. దేశంలోని ప్రధాన స్టీల్ ప్లాంట్స్ ఏటా జరిగే ప్రమాదాల్లో 50మంది వరకు చనిపోతుంటారని అంచనా. తాజా దుర్ఘటనలు జరిగినప్పుడైనా దేశవ్యాప్త పరిశ్రమల్లో మరో ప్రమాదఘటన లేకుండా తీసుకునే చర్యలకు అంకురార్పణ చేయాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.



సిసిరో

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.



జార్జి ఇలియట్

## ప్రజావాక్కు



### వార్షణీయం

తమిళనాడు ప్రభుత్వంప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగావకాశాల కల్పన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతి వేదికగా రూపుదిద్దుకుంటున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఒక చారిత్రాత్మకఘట్టం. భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గా గుర్తింపు పొందనున్న ఈ కేంద్రం, ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133 క్యూబిట్ల క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్ 2)ను నెలకొల్పడం. ఐబీఎం,టీసీఎస్ వంటి గ్లోబల్ సంస్థల సహకారంతో రూపొందుతున్న ఈప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి.ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. క్వాంటంకంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు క్రిప్టోగ్రఫీ వంటి రంగాలలో యువతకు శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలి

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడుస్తున్న కేంద్ర ఉద్యోగుల ఆరోగ్యపథకం ఇటీవల అనేకషరతులు, నియమాలు,కుదింపులు విడుదలవుతున్నవి.నిధులు జాగ్రత్తగా వినియోగంకావడం మంచిదే.ఏపీలో ఉన్న అన్నికేంద్రాలు ఇతరప్రభుత్వ భవనాలలోనే కొనసాగుతున్నాయి. ఏదైనా కొత్త కేంద్రం మంజూరు ఎంతోకాలం నుండి పెండింగ్ ఉన్నది.ఇతర నిధులతోపాటు ప్రధానమైన స్థలం సేకరణ లేదా తాత్కాలిక భవనం కోసం సత్వర చర్యలు అత్యంత ప్రాధాన్యతతో జరగాలి.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### హాజరు తప్పనిసరి

ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్స్ ప్రతిరోజు తప్పకుండా డ్యూటీలకు హాజరు కావాలి. ఉద్యోగి వర్కర్‌కు బదులుగా ఇంకొకరిని పంపడం పనిచేయించడం చట్ట విరుద్ధం. వర్కర్లు పనిచేయకుండా ఇంటి వద్ద ఉంటూహాస్టల్‌వార్డెన్ సన్నిహితంతో ఉద్యోగి పనిచేయకుండా ఇంకొకరిని పనికి పెట్టి తాను జీతం తీసుకోవడం జరుగుతుంది. ఈవిధానానికి ఈ విద్యాసంవత్సరం స్వస్తి పలకాలి. ఎవరి పనులు వారు చేయాలి. ఏ ఉద్యోగి అయితే ఎవరు ఉద్యోగి అయితే వారే పని చేయాలి. రుచికరమైన వంటలు విద్యార్థులకు వండించాలి.గత కొన్నిసంవత్సరాలుగా సంక్షేమ హాస్టళ్లలో వర్కర్స్ పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారు. నెలకు ఒకసారి వచ్చి సంతకాలు పెట్టి జీతాలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారిని పనుల నుండి తొలగించాలి. ప్రతి జిల్లాలో ఉన్నత అధికారులు ప్రతి వర్కర్‌కు నోటీసులు జారీ చేసి తప్పకుండా హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### ఉచిత మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి

చంద్రబాబు మహిళలకు ఫ్రీ బస్సు అన్నారు...బస్సు దిగి బస్టాండులో మూత్రానికి వెళ్తే ఐదు రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్టాండులో ఉచిత మూత్రశాల అని తాటికాయంత అక్షరాల తోబోర్డులు కనిపిస్తాయి.విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో ఐదు రూపాయలు చెల్లించి అడుగు పెట్టమని గుమ్మడికాయంత అక్షరాలతో దర్శనం ఇస్తూ రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ఇదే పరిస్థితి. ఉచిత బస్సుఅనవాళ్లు ఉచిత మూత్రశాల అనలేరా! విజయవాడ బస్టాండు ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. ఆర్టీసీకి లక్షల్లో ఆదాయం ఉంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పాత హాజరు పద్ధతే మేలు

దేశవ్యాప్తంగా నిరుపేద కూలీలు పస్తులు ఉండకుండా నిరంతరం పని చేసుకుంటూ ఆర్థిక జీవనంతో జీవించాలని ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం...ఇప్పుడెందుకో కనుమరుగయ్యేలా ఉంది.పని ప్రదేశంలో ఉపాధి కూలీల కష్టాలు అంతా ఇంతా కావు. పని చేసేది ఒక ఎత్తయితే అరగంట అయినా హాజరు పడని వైనం యాప్ ల పేరిట అరిగోసలు పెడుతూ అంతం చేస్తున్నారు.పని చేసుకుని బ్రతికేవాడి మీద ఇన్ని కుట్రలా? పాత హాజరు పద్ధతిని ప్రవేశపెట్టాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నేరస్థులు తప్పించుకోలేరు..

**మన పూర్వీకులు యుగాలను గురించి చెప్పుండేవారు. త్రేతా యుగంలో ధర్మం నాలుగు పాదాలా నడిచిందని, ద్వాపర యుగంలో పాదాల సంఖ్య తగ్గిందని, కలియుగంలో ధర్మానికి పాదాలుదాదాపు కరవయ్యాయని పెద్దలు సెలవిస్తుంటే నవ్వొచ్చేది! ఒకేసారి ఈరోజుల్లో విస్తరిస్తున్న నేరమయ చరిత్ర చూస్తుంటే పూర్వీకులు ఇంగిత జ్ఞానంతోముందు జరగబోయే కాలాలను సమీక్షించినట్లుగా చెప్పకనే చెప్పారు! 'ధర్మం కలియుగంలో కరువైపోతుందని!' ఎంత నిజం? ఒక పత్రికలోని ఒక పేజీలోని వార్తలు చదివిన సామాన్య పాఠకుడికి ధర్మం పూర్తిగా ఈ రోజుల్లో దారితప్పిన పరిస్థితి అర్థమై దిగులు గుబులు వదల్లేదు!**



రావులపాటి సీతారాంరావు

మన పూర్వీకులు యుగాలను గురించి చెప్పుండేవారు. త్రేతా యుగంలో ధర్మం నాలుగు పాదాలా నడిచిందని, ద్వాపర యుగంలో పాదాల సంఖ్య తగ్గిందని, కలి యుగంలో ధర్మానికి పాదాలుదాదాపు కరవయ్యాయని పెద్దలు సెలవిస్తుంటే నవ్వొచ్చేది! ఒకేసారి ఈరోజుల్లో విస్తరిస్తున్న నేరమయ చరిత్ర చూస్తుంటే పూర్వీకులు ఇంగిత జ్ఞానంతోముందు జరగబోయే కాలాలను సమీక్షించినట్లుగా చెప్పకనే చెప్పారు! 'ధర్మం కలియుగంలో కరువైపోతుందని!' ఎంత నిజం? ఒక పత్రికలోని ఒక పేజీలోని వార్తలు చదివిన సామాన్య పాఠకుడికి ధర్మం పూర్తిగా ఈ రోజుల్లో దారితప్పిన పరిస్థితి అర్థమై దిగులు గుబులు వదల్లేదు! పేదల పాలిటి పెన్నిధిగా భావించిన ఒక గ్రామంలోని ప్రజలకు ఆ పెన్నిధి ఆస్తిపాస్తులు దొంగిలించిన నేరమయ చరిత్ర కలిగిన ప్రబుద్ధుడిగా పోలీసు దర్యాప్తులో తేలినప్పుడు అవాక్కయి, తర్వాత తేరుకొని ముక్కుమీద వేలు వేసుకోక తప్పలేదు! ఆ గ్రామంలో అవసానదశకు వచ్చిన ఒక వృద్ధుడు మాత్రం అందరిలా ఆశ్చర్యపడకుండా 'కలికాలం గదా!' అని తనలో తను గొణుక్కున్నాడు! ఉత్తరప్రదేశ్లో ఒక గ్రామంలో ధార్మికుడిగా పేరుగాంచిన ఆ వ్యక్తిని తెలంగాణా పోలీసులు మాత్రం కరుడుగట్టిన నేరస్థుడిగా తేల్చటం, పెద్దలు 'కలియుగ ధర్మం'గా భావించటం మామూలుగా మారింది! అపర రాబిన్ హుడ్ లాంటి కథను తెలుసుకుంటే ఎవరైనా విస్తుపోక తప్పదు! వికాస్ సింగ్ ఠాగోర్ అనే ఆ వ్యక్తి యు.పి.లోని ఒక గ్రామంలో చాలా రోజులు దేవుడు యిచ్చిన వరంగా పేదలకు సహాయపడ్డాడు! బడికిపోయే పిల్లలకు స్కూల్ బ్యాగ్లు ప్రేమతో యిచ్చేవాడు. అంతేగాదు అట్టడుగు వర్గాల ఆ గ్రామ ప్రజలను కష్టాల్లో ఆదుకొని ధన సహాయం చేసేవాడు. తోటి స్నేహితులకు తన ఖర్చుతో విలాస యాత్రలు ఏర్పాటు చేసేవాడు. తను ఎప్పుడు ప్రయాణించినా విమానాల్లోనే, పెద్ద పెద్ద హోటళ్ళలోనే నివాసం! అంతటి వ్యక్తి తెలంగాణాలోని వికారాబాద్ మణికంఠ నగర్ కాలనీలో పట్టుబడి రాజు-పేదా డబల్ రోలను పోలీసుల దర్యాప్తు వల్ల వదిలేసి కటకటాలు లెక్క పెట్టాల్సిన పరిస్థితి రావటం అతనికి ఎంత విషాదం? యు.పిలోని గ్రామ పేదలకు, స్నేహితులకూ ఎంత నిరాశ, పోలీసులకు పెద్ద దొంగను పట్టుకున్నందుకు గర్వంతో కూడిన ఆనందం! విధి నాటకాలు ఆడటం అంటే యిదే! విభిన్న కోణాల్లో ఒక వ్యక్తి జీవితం సినిమాలలో ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో చిత్రీకరించటం జరుగుతే థియేటర్ల నుండి సంబరంగా బయటకు వచ్చే ప్రేక్షకులకు నిజ జీవితంలో ఇలాంటి వ్యక్తులు తారసపడుతారు బహుపరాక్ అని పోలీసులు హెచ్చరిస్తే ఎంత భయం కలుగుతుంది! ఇలాంటి నేరమయ చరిత్ర కలిగిన వారు పట్టుబడితే ధర్మం ఇంకా కుంటుకుంటూ నడుస్తూనే వుంది అని పాతకాలం వారికి సంతోషం కలుగుతుంది! తెలంగాణాలో అతను వేసిన వేషం 'కూలీ వేషం! రోజువారీ పనిచేసే కూలీగా తిరుగుతూ కాలనీలలో ఏయే ఇళ్ళకు తాళాలు వేసివున్నాయో గమనిస్తూ, రాత్రిళ్ళు ఎన్నో దోపిడీలు అలాంటి తాళం వేసిన ఇండ్లల్లో చేస్తూ దోచుకున్న సొమ్ముతో యుపిలోని తన గ్రామంలో తన స్నేహితులకూ, పేదవారికీ, పిల్లలకు ఆర్థిక సహాయం అడగకుండానే చేస్తూ, విలాసవంతమైన జీవితం గడుపుతూ ఒక వెలుగు వెలిగిన వికాస్ సింగ్ ఠాకూర్, పోలీసులకు దొరికిపోవటంతో వికాసాన్ని కోల్పో య్యాడు!



దాదాపు 1.57 కె.జీల బంగారం, 2.56 కె.జీల వెండి, 8 కోట్ల 22లక్షల నగదు, దొంగిలించానని పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. 16వ సంవత్సరం నుంచే దొంగత నాలు మొదలుపెట్టి 34కేసులు పోలీసు రికార్డులో నమోదు కాబడిన ఘన చరిత్ర కలిగిన వ్యక్తి ఈ ఘనమైన దొంగ వికాస్! ప్రస్తుతం వికారాబాద్ పోలీసుల దర్యాప్తులో తేలిన కేసులు కట్టితే అతని దొంగతనాలసంఖ్య 61 కి చేరింది! సుల్తానాపూర్ జిల్లాలో నలుగురు బంగారం వ్యాపారస్థులు అతనికి అండదండలు కల్పించి,దొంగిలించిన నగలు తాము తీసుకొని, వికాస్కు కొంత ప్రతిఫలం ఇస్తూ అవసరమైనప్పుడు డబ్బు సహాయం గూడా చేసేవారట! తల్లిద్వారా బంగారాన్ని వాళ్ళకు చేర వేసేవాడట! తోటకూర దొంగిలించినప్పుడు మందలించని తల్లి చరిత్ర కన్నందుకు తల్లి అనుభవించక తప్పదు! ధర్మ దేవత పడుతూ లేస్తూ నడుస్తున్నట్లు ఈ సంఘటనతో భావించక తప్పదేమో! వికారాబాద్ పోలీసులూ ఉన్నతాధికారులూ,వికాస్ ఠాకూర్ చరిత్ర ఒకకొలిక్కి తెచ్చినందుకు అభినందించక తప్పదు! మరో నేరమయ చరిత్ర అదే పేజీలో ఉంది. గంజాయి (మారిజునా) పంటను విస్తృత స్థాయిలో థాయి లాండ్ వరకు విస్తరింప చేసిన తెల్ల చొక్కాల నేరస్థులను కొత్తగా ఏర్పడిన 'ఈగల్ ఫోర్స్' (పోలీసులలో ఒక భాగం) పట్టుకొని చరిత్రలో కొత్త పేజీలను సమకూర్చింది! 300 వాహనాలు, 405 సార్లు ఫ్లైట్ బుకింగ్స్, (కేవలం విమా నాల్లో ప్రయాణించినందుకే కోటి రూపాయలు ఖర్చుపెట్టిన వైనం, నీటితో ఏర్పాటు చేయబడ్డ భూములు థాయిలాండ్లో ఏర్పరుచుకొని దాదాపు 30కోట్లు ఖర్చుచేసి 'పట్టాయా స్టైల్ నైట్ క్లబ్ను హైద్రాబాద్లోని కోకాపేట్ ప్రాంతంలో ఏర్పాటుచేసుకొనే ప్రయత్నంలో వున్నప్పుడు వీరిని వలపన్ని పోలీసులు పట్టుకోవటం జరిగింది! 40మంది ఈనెట్వర్క్ వున్నారు. చాలామంది అరెస్టు కూడా అయ్యారు! హేమంగ్ ప్రమోద్ కెల్సుకర్, సుధాంశ్ ప్రమోద్ కెల్సుకర్ (బొంబాయికి చెందినవారు) ఈ ముఠాను నడుపుతున్నారు.దాదాపు 2023నుంచి తెలంగాణా, మహారాష్ట్ర, గుజరాత్,యు.పి., మరికొన్ని రాష్ట్రాలలో గూడా లింక్స్ ఏర్పరుచుకొని పకడ్బందీగా నడుపుతున్న ఈడ్రగ్స్‌కు సంబంధించిన వ్యవహారం పోలీసుల నిఘా వల్ల బయటపడింది! ఇంత పెద్ద నేరస్థులను పట్టుకున్న ఈగల్ ఫోర్స్ ఉన్నతాధికారులు గూడా కష్టంతో గూడిన పనిని విజయవంతంగా చేసినందుకు ప్రజలు ఎంతో ఆనందిస్తున్నారు! ఒరిస్సాకు సంబంధించిన అంతరాష్ట్రీయ గంజా స్మగ్లర్ను దిల్‌సుఖ్ నగర్ పోలీసులు గంజాను అమ్ముతుండగా పట్టుకున్నారు. రమేష్ బండాం, నిర్మల్ ఛత్రియా (ఒరిస్సా వాసులు) పట్టుబడ్డవార్త గూడా అదే పేజీలోవుంది! ఇవేమో బాహాటంగానో, దొంగచాటుగానో చేసే దొంగతనాలు!మోసం చేసి అధికారుల కళ్లుకప్పి తెలివిగా చేయటానికి వేసిన నేర ప్రయోగం కూడా ఇదే పేజీలో చోటుచేసుకోవటం విశేషం! సైబరాబాద్ పోలీసులు ఇలాంటి నేరస్థులతో జాగ్రత్తగా వుండండి అని హెచ్చరిం చటంతో వీరి పనితనం బయటకు వచ్చింది. మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ వారిచే నియమించబడ్డ ఉద్యోగస్థులమని, వాట్స్ ఆప్, మెసేజీలను కొన్ని ప్రాంతాలలో నివసించే పౌరు లకు పోస్టుచేసి మీరు కట్టాల్సిన వాటర్ బిల్లుఇంకా చెల్లించలేదు మేము కనెక్షన్ తీయక తప్పదు అని డబ్బులువసూలు చేయటానికి ప్రయత్నించిన వారి వ్యూహం బయటపడింది.అయితే వారి వివరాలు వార్తల్లోకి ఎక్కలేదు కాని ఈ హెచ్చరికతో హైద్రాబాద్లో నివాసం చేసేవారు జాగ్రత్తగా వుండక తప్పదు!ఒక్క పేజీలోనేవైవిధ్య భరితమైన ఈ నేర చరిత్ర లు చదివిన ఏ పాఠకుడైనా 'అయ్యబాబోయ్' అని అనుకోకతప్పదు. కానీ పై పోలీసులు తగు రీతిలో పట్టుకొని నేరాలను అదుపుచేసే ప్రయత్నంలో వున్నారని తెలిసిన తర్వాత ఆ వివరాలు తెల్పాలనే ఈ ప్రయత్నం! ఎప్పుడూ పోలీసుల వైఫల్యాలే బయటకు వస్తాయి కానీ వారి విజయవంతమైన పనితీరు ఎప్పుడోగాని పత్రికల్లోకి ఎక్కదు!ధర్మం ఈకాలంలో కూడా కొద్దోగొప్పో తప్పకుండానే ఉందని పెద్దలు అనుకుంటూ వున్నారు!. ●

# ప్రపంచ సుగంధ ద్రవ్యాల చిరునామాగా భారతదేశం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

మన వంట గది నుంచి మసాలా వాసనను బట్టి ఏ వంటకాలు చేస్తున్నారో, ఎంత రుచిగా ఉండబోతోందో తెలుస్తుంది. మన వంటలకు రుచులను ఆహార పదార్థాల్లో మూలికలు, సుగంధ ద్రవ్యాల (మసాలా దినుసుల) పాత్ర వెలకట్టలేనిది. వంటలకు రుచితోపాటు పలు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తున్న మసాలా దినుసుల ఉత్పత్తి, వినియోగం భారత్‌లో అధికంగా ఉండడం గమనిస్తున్నాం. మన వంటల్లో వాడుకునే అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఒరిగానో, గసగసాలు, పచ్చి మిరపకాయలు, ఉల్లి కాడలు, సాంబ్రాణి, కొత్తిమీర, పుదీనా, జాజికాయ, స్టార్ అనైస్, వనిల్లా,చింతపండు,జాపత్రి, మెంతులు, ఆవాలు,ఇంగువ, పసుపు, ధనియాలు, నల్ల/తెల్ల మిరియాలు, లవంగాలు, యాలకులు, సోంఫ్, మిరపకాయలు,దాల్చినచెక్క, బగారా ఆకు లాంటి అనేక మసాలా దినుసులు తాజాగా లేదా ఎండిన (పండ్లు/ఆకులు/బోర్డు/వేర్లు/పూలు) మూలికలు, సుగంధ ద్రవ్యాలు మన ఆరోగ్యకర జీవితాలతో విడదీయరాని బంధాలను పెనవేసుకున్నాయి. మనం నిత్యం వంటల్లో వాడుకునే మసాలాదినుసుల ప్రాధాన్యం, ప్రయోజనాలను అవగాహన పరచడానికి ప్రతి ఏటా 10 జూన్ రోజు జాతీయ మూలికలు, సుగంధ ద్రవ్యాల దినోత్సవం (నేషనల్ హెర్బ్స్ అండ్ స్పైసెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి,వినియోగం, ఎగుమతుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. కేరళను ప్రపంచ సుగంధ ద్రవ్యాల తోట(గార్డెన్ ఆఫ్ స్పైసెస్)అని పిలుస్తారు. కేరళలో యాలకులు, నల్ల మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, జాజికాయ, జాపత్రి,పసుపు, అల్లం లాంటి సుగంధ ద్రవ్యాలు విస్తారంగా పండుతాయి. మన దేశంలో లభించే దాల్చినచెక్క, పసుపు, తులసీ వంటి పదార్థాలు మన ఆరోగ్యాలకుఎంతో మేలును చేస్తున్నాయి. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి,వాడకం, ఎగుమతుల్లో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉండడం హర్షదాయకం. చైనా, వియత్నాం లాంటిదేశాలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. దాదాపు 41కి పైగామసాలా దినుసుల నిధిగా భారతం వర్ధిల్లుతున్నది. గింజలు,తరిగిన పొడులు, పొడులు,వేయించిన, నూనెలో వేయించిన, పైన చల్లుకునే మసాలా దినుసులు మన నిత్యజీవితాలతో అవిభాజ్య సంబంధాలను పెనవేసుకున్నాయి. కరోనా విపత్తు సమయంలో భారతీయుల ప్రాణాలను కాపాడడంలో వారిలో దాగిన రోగనిరోధకశక్తి మాత్రమేఅని, ఇది మనం తినే మసాలా వంటల వల్ల కూడా పెరుగుతుంది. ●

# పాలనలో నెహ్రూను దాటిన మోడీ

బెర్జిస్ దేశాయ్

జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి ప్రధానమంత్రిగా 1952 మే 13న పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆనాటి నుంచి 1964 మే 27న కన్నుమూసే దాకా 4,397 రోజులపాటు అవిచ్ఛిన్నంగా ఆ పదవిలో కొనసాగారు. ఆయన 1947 ఆగస్టు 15 నుంచే ప్రధానమంత్రిగా ఉన్నప్పటికీ, తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరించిన రాజ్యాంగ సభకు బాధ్యత వహించే మధ్యంతర ప్రభుత్వ అధిపతిగా మాత్రమే ఉన్నారనే వాస్తవం రాజ్యాంగ చరిత్రను నిశితంగా అధ్యయనం చేసేవారికి అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 4,398 రోజులు ఆ బాధ్యతలలో కొనసాగడం ద్వారా నేడు నెహ్రూ పదవీకాలాన్ని అధిగమించారు. మన దేశానికి సుదీర్ఘకాలం ప్రధానమంత్రులుగా పనిచేసిన మోడీ, నెహ్రూల పాలన శైలి పూర్తిగా భిన్నం. బాల్యం నుంచీ పెంపకం, ఆలోచన విధానం, విశ్వాసాలు,స్వభావం, పనితీరు శైలి, విలువల పంథా సహా రాజకీయ సిద్ధాంతాల రీత్యా ఇద్దరి ప్రస్థానం పరస్పర విరుద్ధం. నెహ్రూ ఒక సంపన్న బారిస్టర్ కుమారుడు, బ్రిటిష్ రాచబిడ్డలు చదివే హారో, కేంబ్రిడ్జిలోని ట్రినిటీ కళాశాలల్లో చదివారు. అయితే, బాల నరేంద్రుడికి అలాంటి విలాస జీవితం కలలోమాటే... రైల్వే స్టేషన్‌లో ఓ చిన్న టీ కొట్టు నడిపే తండ్రి నీడన, ఐదుగురు తోబుట్టువులతో కలిసి మోడీ పెరిగారు. కనీసం కరెంటు సౌకర్యం కూడా లేని, చీకటి రాజ్యం చేసే చిన్న ఇంట్లో, తిండికి కూడా తిప్పలు పడాల్సిన దుస్థితిలో వారి జీవనం సాగేది. ఆ పరిస్థితుల నడుమ మాతృభాషలోనే.. నాణ్యత మాటెరుగని సాధారణ విద్యను అభ్యసించారు. ఆ రోజుల్లో వారికి రేడియో లేదా వార్తాపత్రికలు అందుబాటులో లేవు. మోడీ కుటుంబానికి టూత్ పేస్టుబ్రష్షు, స్నానపు గదిషవర్ వంటి సౌకర్యాల మాట అటుంచి,కనీసం మరుగుదొడ్డి, కొళాయి నీటి సరఫరా సౌకర్యం కూడా ఉండేవికావు. అలాంటి జీవితం గడిపిన ఆయన, తన 17వ ఏట వ్యక్తిగత ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టి, ఇల్లు వదిలివెళ్లారేగానీ, మళ్లీ రానే లేదు! తన తల్లి గాజు పెంకులు కలిపిన బూడిదతో ఇతరుల ఇళ్లలో పాత్రలు కడుగుతుండగా ఆమె వేళ్ల రక్తం చిందడాన్ని చెమ్మగిల్లిన కళ్లతో బాల నరేంద్రుడు చూస్తూండి పోయేవాడు. నెహ్రూ విలక్షణ ఇంగ్లీష్ ఉచ్చారణ శైలి చూసి చేరువైన ఉన్నత వర్గాలవారు ఆయనను తమలో ఒకడుగా పరిగణించేవారు. స్వీయ అంతర్జాతీయ ప్రతిష్ఠపై అత్యంత శ్రద్ధ చూపే నెహ్రూ,మాతృభూమిని తన అస్పష్ట ఫేబియన్ ప్రబోధిత సామ్యవాద విశ్వాస కోణంలో చూడటం వల్ల భారత దేశం భారీమూల్యం చెల్లించాల్సి వచ్చింది. భారత్‌లో కశ్మీర్ విలీనం ప్రక్రియను ఆయన అమితాలస్యం చేశారు. పైగా అక్కడ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని కూడా హామీ ఇచ్చారు. అటుపైన సమస్యనుఐక్యరాజ్య సమితి స్థాయికి తీసుకువెళ్లారు.ఇది చాలదన్నట్లు పాక్ దురాక్రమణతో ఆక్రమిత కశ్మీర్‌గా మారిన ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న భారత సైన్యానికి అనుమతి నిరాకరించారు. చైనీయులపై అమాయకత్వంతో కూడిన ఆయన నమ్మకం వ్యూహాత్మక అక్సాయ్‌చిన్ ప్రాంతం కోల్పోవడానికి దారితీసింది. మరోవైపు అదొక బంజరు నేల అంటూ నిర్లక్ష్యంగా కొట్టి పారేశారు. అత్యంత ఏకపక్ష సింధు జలాల ఒప్పందంపై సంతకంతో ఆ నదీజలాల్లో 80 శాతాన్ని పాకిస్థాన్ పరం చేయడమేగాక, కొన్ని బకెట్ల నీటి కోసం ఇంత రాద్ధాంతం ఎందుకో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.ఈ పరిణామాల నేపథ్యంలో 72 ఏళ్ల తర్వాతభారత పాలనాధికార పగ్గాలు చేపట్టిన మోడీ కశ్మీర్ ప్రత్యేకహోదా రద్దు ద్వారాఅసాధ్యమని భావించిన ఒక రాజ్యాంగ అద్భుతాన్ని సుసాధ్యం చేసి చూపారు. అప్పటి వరకూ పాకిస్థాన్ ఈ అంశాన్నొక ఉపకరణంగా మార్చుకుని అంతర్జాతీయ వేదికలపై రభస చేస్తూండేది.



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

ఇదే తరహాలో ఒక సాహసోపేత నిర్ణయంతో సింధునదీ జలాల ఒప్పందాన్ని స్తంభింపజేసి, శత్రుదేశాన్ని ఆయన చావు దెబ్బకొట్టారు. ముందుచూపుతో కూడిన, ఆచితూచి స్పందించే సైనిక వ్యూహంతో దేశ సరిహద్దులను సురక్షితం చేశారు. వరుస తరాల అధికార యంత్రాంగం అభిప్రాయం ప్రకారం ఏవిషయాన్నైనా మోడీ అద్భుతమైన వేగంతో ఆకళింపు చేసుకుంటారు. ఆయన జిజ్ఞాస అపారం. అందుకే, ఏది చెప్పినా చెవియొగ్గి వింటారు. అత్యంత సూక్ష్మస్థాయిలో వివరాలను విశ్లేషిస్తారు. నిరంతర పర్యవేక్షణ మదింపు తర్వాత స్థిరమైన నిర్ణయం తీసుకోవడం ఆయన నైజం. సరైన సన్నద్ధత లేని, ఉదాసీన ధోరణి గలవారికి ఆయన దగ్గరఅస్సలు చోటుండదు. అయితే, తన సమక్షంలో వివరాలు ఏకరవు పెట్టడం నెహ్రూకు విసుగు తెప్పించేది. చంచల స్వభావి కావడంతో భావోద్వేగంతో నిర్ణయాలు తీసుకోవడం ఆయన అలవాటుగా ఉండేది. ఒక అభిప్రాయానికి వస్తే, మొండిగా దాన్ని సమర్థించుకునే ఓ సాధారణ పరిపాలకుడు.ఆయనను అమితంగా ఆరాధించే జేఆర్‌డీ టాటా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్థిక శాస్త్రంపై చర్చ మీద నెహ్రూకు ఎంతమాత్రం ఆసక్తి ఉండేది కాదన్నారు. అలాంటి సందర్భాల్లో ఆయన కిటికీలో నుంచి తోటలో గంతులేస్తున్న జెయింట్ పాండా (ఎలుగుబంటి లాంటి జంతువు) ను చూస్తూండే వారని చెప్పారు. అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయికి చేర్చే నిబద్ధతకు బదులు సోవియట్ యూనియన్ తరహా పంచవర్ష ప్రణాళిక విధానాన్ని అనుసరిస్తూ భూసంస్కరణలు,జలాశయాల నిర్మాణం,భారీ పరిశ్రమల ఏర్పాటుకు నెహ్రూ ప్రాధాన్యమిచ్చారు. అయితే, పేదరిక నిర్మూలన దిశగాశాస్త్రీయ దృక్పథంతో మతాతీత,సమర్థ సంక్షేమ పాలన విధానాలను అనుసరించిన మోడీ, దేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వీటన్నిటికీ వివరిస్తే దళారుల బెడద తప్పించి నిరుపేదలకు నేరుగా నగదు బదిలీ, వంటగ్యాస్ సిలిండర్ల సరఫరా,ఇంటింటికీ తాగునీటికొళాయి, పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రత్యక్ష సాయం, పేదలకు ఆరోగ్య బీమా, జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలద్వారా ఆర్థిక సార్వజనీత, మాతృత్వ సంక్షేమం లక్ష్యంగా నగదుసహాయం,పారిశుధ్యం ఇలా ఈ జాబి తాకు అంతూదరీ ఉండదు. ఇక కోవిడ్19 సంక్షోభ సమయాన ఏకోన్ముఖ ప్రభుత్వంపద్ధతిని నిక్కచ్చిగా అనుసరిస్తూ అత్యంత నిర్దిష్టసమయానికి సంపూర్ణదిగ్బంధం (లాక్‌డౌన్) విధించడం ద్వారా అస్తిత్వ సంక్షోభం నుంచి దేశాన్ని ఒంటిచేత్తో రక్షించారు.ఒక్కమాటలో చెబితే నెహ్రూ ఒక అస్పష్ట తార్కిక సిద్ధాంతకర్త కాగా, మోడీ ఒక అద్భుత పాలనాదక్షుడు నాస్తికుడినని స్వయంగా చాటుకున్ననెహ్రూ, పునర్నిర్మిత సోమనాథ్ ఆలయ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ హాజరుకాకుండా శాయశక్తులా ప్రయత్నించారు.అంతేకాకుండా ఆ సందర్భంలో రాష్ట్రపతి ప్రసంగ ప్రసారాన్ని ఆపేయాల్సిందిగా ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో)ని ఆదేశించారు. తద్విరుద్ధంగా మోడీ అసంఖ్యాక సాంస్కృతిక పథకాల ద్వారా నాగరికత పునరుజ్జీవనాన్ని చురుగ్గా ప్రోత్సహించారు. రోజుకు కనీసం 16గంటల పని లోనే విశ్రాంతి వెతుక్కునే నైజం మోడీది. అంతకుముందు మూడు దశాబ్దాల పాటుపూర్తికాల సంఘ్ ప్రచారక్‌గా,బీజేపీ కార్యకర్తగా మొత్తం మీద 55ఏళ్లుగా ప్రజా సేవలోనే మునిగితేలుతున్నారు. అయితే, మోడీలో కించిత్ అలసట గానీ, కాస్తంత ఉపశమన ధోరణిగానీ కానరావు. దేశంలోని 15 ప్రాదేశిక కమిటీలలో 12సర్దార్ పటేల్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమించేందుకు మొగ్గుచూపగా, మూడు తటస్థంగా ఉండిపోయాయి. అయితే, గాంధీజీ 12 కమిటీల అభీష్టాన్ని తోసిపుచ్చుతూ నెహ్రూకు ఓటువేయడం ద్వారా ప్రధాన మంత్రి అభ్యర్థిత్వానికి పటేల్‌ను దూరం చేశారు. ఆవిధంగా దేశంలో ఘనత వహించిన వంశపారపర్య రాజకీయ నేతగా నెహ్రూకు,ఆయన వారసత్వం ఇందిరాగాంధీకి బదిలీ అయ్యేలా అత్యంత శ్రద్ధతో పావులుకదిపారు. లక్ష్యమంటే అధికారం కోసం ఆరాటం కాదన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. అలాగే, గాంధీజీ తరహాలో సేవ,త్యాగం అనేవి ఒట్టి మాటలు కావన్నది మోడీ విశ్వసించే వాస్తవం. రాబోయే కొద్ది దశాబ్దాలలో నరేంద్ర మోడీ ఒక ఆదర్శప్రాయ దిగ్గజంగా నిలుస్తారు. ఎందుకంటే ఇకపై ప్రతి ఒక్కరి పనితీరుకూ నరేంద్ర మోదీ నిర్దేశిత ప్రమాణాలే కొలబద్ద. ●

**(ఈ వ్యాసకర్త మోదీస్ మిషన్ పుస్తక రచయిత)**

# అప్పీలు విచారణకు 43యేళ్లా?

## - అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్ 9:** అలహాబాద్ హైకోర్టు ఒక హత్య కేసు పరిష్కారంలో అసాధారణంగా 43యేళ్ల ఆలస్యం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది భారతదేశంలో నిరంతరంగా పేరుకుపోతున్న న్యాయపరమైన కేసుల సమస్యను ఎత్తి చూపుతోంది. నాలుగు దశాబ్దాలుగా నేరారోపణ నీడలో ఉన్న విజయ్ సింగ్ దాఖలు చేసిన అప్పీలు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవర పాటుకు గురిచేస్తున్నాయని, పేరుకు పోతున్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తన సొంత సోదరుడిని హత్య చేసినందుకు కాన్పూర్ సెషన్స్ కోర్టుచే దోషిగా నిర్ధారించబడిన విజయ్ సింగ్, తన శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీలుపై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు దాదాపు 43 ఏళ్లు తీసు కోవడంతో, నాలుగు దశాబ్దాలకు పైగా బెయిల్‌పైనే ఉన్నాడు. 1983 నవంబర్‌లో తన సోదరుడిని కాల్చి చంపినప్పుడు 28 ఏళ్ల యువకుడైన విజయ్, నత్తనడకన సాగే న్యాయ పంపిణీ వ్యవస్థ కారణంగా ఇప్పుడు డెబ్బై ఏళ్ల వృద్ధుడిగా ఉన్నాడు. అతని క్రిమినల్ అప్పీల్‌ను పరిష్కరించడంలో జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని "ఆందోళనకరమైన పరిస్థితి"గా అభివర్ణిస్తూ, అలహాబాద్ హైకోర్టులో న్యాయ పంపిణీ వ్యవస్థను అడ్డుకుంటున్న పెండింగ్ కేసులను పరిష్కరించడానికి ఎలాంటి వినూత్న చర్యలు తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు ఆశ్చర్య పోయింది. విజయ్ తన అప్పీల్ ఫలితం కోసం ఎదురుచూస్తూ, కేవలం మూడు నెలలు మాత్రమే కస్టడీలో గడిపి, దాదాపు 43 ఏళ్లపాటు బెయిల్‌పైనే ఉన్నారని ధర్మాసనం పేర్కొంది. దోషిగా నిర్ధారించబడటానికి వ్యతిరేకంగా చేసిన అప్పీల్‌ను హైకోర్టు ఫిబ్రవరి 9న కొట్టివేసిన తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం బెయిల్‌పైనే కొనసాగేందుకు అనుమతించాలని ధర్మాసనం నిర్ణయించింది. అలహాబాద్ హైకోర్టులో త్వరిత గతిన విచారణ జరపాలని ఆదేశాలు కోరుతూ వ్యాజ్యదారులు తరచుగా సుప్రీంకోర్టును ఆశ్రయి స్తుంటారని ఎత్తి చూపుతూ, పాత కేసుల పరిష్కా రాన్ని వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్, న్యాయవాది జోహెబ్ హుస్సేన్‌ల నుండి సూచనలు కోరింది. మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న ప్రాసిక్యూషన్ అప్పీళ్లను కొట్టివేయడం ద్వారా పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించవచ్చని దేవ్ సూచించగా, కేవలం కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో వాటిని కొట్టివేయడానికి తీర్పు ప్రక్రియ ప్రాథమిక సూత్రాలు అనుమతించవని ధర్మాసనం పేర్కొంది. అటువంటి విధానం ప్రజా ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని, అలాగే తమ వాదనలు వినిపించే అవకాశాన్ని కక్షి దారు లకు దూరం చేస్తుందని హెచ్చరించింది. సుదీర్ఘ జాప్యాన్ని ఎత్తి చూపుతూ, విజయ్ సుప్రీం కోర్టులో తన అప్పీలులో, తనకు ఇప్పుడు 72 ఏళ్లు వచ్చాయని, తన జీవితంలో ఎక్కువ భాగం ఒక నేరారోపణ నీడలోనే గడిపానని సమర్పిం చారు. "నాలుగు దశాబ్దాలకు పైగా, యవ్వనంలో, మధ్య వయస్సులో, ఇప్పుడు వృద్ధాప్యంలో కూడా, ఆయన ఆ నేరారోపణ నీడలోనే జీవిం చారు," అని పిటిషన్‌లో పేర్కొన్నారు. క్రిమినల్ అప్పీలు హైకోర్టులో 40 ఏళ్లపాటు పెండింగ్‌లో ఉండి,




# కాక్రోచ్ పార్టీకి పోటీగా ఇష్క్ కరో పార్టీ

## - ప్రకటించిన సుప్రీం మాజీ జడ్జి కట్జూ - పేదరికం, నిరుద్యోగంపై పోరాడుతాం - టిఎంసి ఎంపి మహువా మొయిత్రాను ఆహ్వానించిన జస్టిస్ మార్కండేయ

**న్యూఢిల్లీ, జూన్ 9:** గత కొన్ని వారాలుగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వార్తల్లో నిలిచిన తర్వాత, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ 'ఇష్క్ కరో పార్టీ (ఐకెపి) అనే ఒక కొత్త పార్టీని స్థాపించారు. "దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చేపట్టే ఒక ప్రయత్నం" అని కట్జూ పేర్కొన్నారు. తన కొత్త పార్టీలో చేరాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాకు కట్జూ ఆహ్వానం పంపారు. మరోవైపు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన నీట్ వంటి పోటీ పరీక్షలలో లోపాల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడిని 'మూర్ఖుడు' అని పేర్కొంటూ కట్జూ తన 'ఎక్స్' ఖాతాలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని కేవలం ఒక జోక్ గానో లేదా "అబ్బాయిలు, అమ్మాయిల మధ్య ప్రేమను ప్రోత్సహించే వాలెంటైన్స్ డే లాంటిది"గానో ప్రజలు పొరబడే అవకాశం ఉందని జస్టిస్ కట్జూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "కానీ అది పూర్తిగా అపోహ మాత్రమే" అని ఆయన అన్నారు. ప్రజల మధ్య 'ఐక్యత' ద్వారా భారతదేశంలోని పేదరికం, పిల్లలలో పోషకాహార లోపం, నిరుద్యోగం, ఇతర సమస్యలను నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు. "కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి. అప్పుడే ఆధునిక దృక్పథం కలిగిన నాయకుల నేతృత్వంలో, ప్రజల దయనీయ పరిస్థితుల నుండి విముక్తి కోసం మనం ఒక బలమైన ప్రజా పోరాటాన్ని (జన్ సంఘర్ష్) నిర్వహించగలము" అని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు. రాజకీయ నాయకులు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నారని, ప్రజల పట్ల వారికి "నిజమైన శ్రద్ధ" లేదని ఆయన ఆరోపించారు. "ఈ దుస్థితిని ఎదుర్కోవడం, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం ఐకెపి లక్ష్యం. కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి" అని ఆయన అన్నారు.

దీప్కేపై కట్జు విమర్శలు: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న బొద్దింకల జనతా పార్టీ తన మొదటి నిరసనను చేపట్టిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో ఎలాంటి మార్పు రాదని చెబుతూ, ఆ పార్టీ సిద్ధాంతాన్ని, దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై కట్జు విమర్శలు గుప్పించారు. "భారత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది అభిజిత్ దీప్కే ప్రధాన డిమాండ్లలో ఒకటి కావడమే అతను ఒక మూర్ఖుడని చెప్పడానికి స్పష్టమైన నిదర్శనం. కానీ ఆయన రాజీనామా చేస్తే, ఆయన స్థానంలో మరో మంత్రిని నియమిస్తారు.



## మహాయుతిలో శివసేన షిండేకు అవమానం!

**ముంబయి,జూన్ 9:** మహారాష్ట్ర అధికార మహాయుతి కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి రోడ్డున పడ్డాయి. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఒక హైప్రొఫైల్ కార్యక్రమ ఆహ్వాన పత్రిక వివాదం కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మహారాష్ట్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన 20 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండేను ఆహ్వానించకపోవడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ విమానాశ్రయ ప్రాజెక్టును పర్యవేక్షించే సీఐడీసీవో సంస్థ నేరుగా షిండే మంత్రిత్వ శాఖ పరిధిలోనే పని చేస్తుండటం గమనార్హం. అదానీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సీఐడీసీవో సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గణేశ్ నాయక్, అదితి తత్కరేలు పాల్గొన్నప్పటికీ డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్‌లను కనీసం సంప్రదించకుండా, ఆహ్వాన జాబితా నుంచి పూర్తిగా పక్కన పెట్టడం కలకలం సృష్టించింది. దీనిపై షిండే నేతృత్వంలోని శివసేన వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనిచేస్తున్నారని, ప్రాజెక్టు క్రెడిట్ షిండేకు దక్కకుండా చేసేందుకే ఈ కుట్ర పన్నారని రాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సాత్ బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. మరోవైపు ఈ వివాదం ప్రతిపక్షాలకు మంచి అస్త్రంగా మారింది. శివసేన నేత అంబాదాస్ దాన్వే అధికార కూటమిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# అఫ్ఘానిస్థాన్‌పై పాక్ దాడి

## ఆ దేశ సార్వభౌమాధికారంపై పోరాటం

### ఐక్యరాజ్యసమితిలో భారత్‌ప్రతినిధి హారీష్ పర్వతనేని ధ్వజం

**న్యూయార్కు, జూన్ 9:** ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన స్పష్టమైన దాడి అని, ఇది ఆ దేశంతో పాటు యావత్ ప్రాంతీయ శాంతికి పెను ముప్పు అని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి, అంబాసిడర్ హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ పాకిస్థాన్ దాడుల్లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ (యూఎన్ఏఎంఏ) నివేదికలను ఆయన ఉటంకించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 372 మంది పౌరులు మరణించారని, మరో 397 మంది గాయపడ్డారని తెలిపారు. వీరిలో అత్యధికులు పవిత్ర రంజాన్ మాసంలోనే లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో మరణించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమావేశంలో ఐక్యరాజ్యసమితి నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. బహుళ పక్షవాదం, ఐక్యరాజ్యసమితి పట్ల మద్దతు అనేది ఎవరి ఇష్టానుసారం వారు ఎంచుకునే మెనూ కాదు. మీకు నచ్చినప్పుడు దాన్ని స్వీకరించి, నచ్చనప్పుడు తిరస్కరించడం కుదరదని పర్వతనేని పాకిస్థాన్‌కు తీవ్ర స్థాయిలో హితవుపలికారు. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం కోసం యూఎన్ఏఎంఏ చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలను, ముఖ్యంగా అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని, పౌరుల రక్షణను నిర్ధారించాలని ఐరాస సెక్రటరీ జనరల్ చేసిన పిలుపును భారత్ సమర్థిస్తోందని పర్వతనేని తెలిపారు. ఈ దాడులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని యూఎన్ఏఎంఏ చేసిన డిమాండ్‌కు భారత్ మద్దతు తెలుపుతోందని ఆయన వివరించారు. ఇటువంటి దారుణమైన హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది.

# హెచ్1బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు!




**బోస్టన్,జూన్ 9:** అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న భారతీయ టెక్ నిపుణులతో పాటు ఇతర విదేశీ నిపుణులకు భారీ ఊరట లభించింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ వీసాలపై విధించిన లక్ష డాలర్లు సుమారు రూ. 95.8 లక్షలు భారీ ఫీజును అమెరికా ఫెడరల్ కోర్టు రద్దు చేసింది. ఈ ఫీజు పెంపు చట్టవిరుద్ధమైన పన్ను కిందకు వస్తుందని, కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు ఇలాంటి పన్ను విధించలేరని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. ట్రంప్ సర్కారుగత ఏడాది ప్రకటించిన ఈ ఫీజును సవాలు చేస్తూ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టులో దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరోకిన్ తీర్పు ఇచ్చారు. "చట్టం ద్వారా కాంగ్రెస్ అధికారం ఇస్తే తప్ప, పన్ను విధించే అధికారం అధ్యక్షుడికి లేదు. హెచ్1బీ పిటిషన్లపై విధించిన ఈ ఫీజు కాంగ్రెస్ అనుమతి లేని పన్ను అని కోర్టు నిర్ధారించింది. అందువల్ల ఈ విధానాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ, పూర్తిగా రద్దు చేస్తున్నాం" అని తీర్పులో వెల్లడించారు. ఈ ఫీజు పెంపు వల్ల హెచ్1బీ వీసా దరఖాస్తులు భారీగా పడిపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో 3,43,981గా ఉన్న హెచ్1బీ రిజిస్ట్రేషన్లు, 2027 ఆర్థిక సంవత్సరానికి 2,11,600కి పడిపోయాయి. దాదాపు 38.5 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి కేవలం 85 మంది మాత్రమే లక్ష డాలర్ల ఫీజు చెల్లించినట్లు ప్రభుత్వం మార్చిలో కోర్టుకు తెలిపింది. సాధారణంగా హెచ్1బీ వీసా కోసం కంపెనీలు 2,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఫీజు చెల్లిస్తాయి. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ విధానం వల్ల దేశ ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను మెరుగుపరిచే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని రూబియో వివరించారు. దేశంలో వలసల సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై నిరంతర దాడులు చేస్తే ఇజ్రాయెల్ ఒంటరికాక తప్పదు!

### నెతన్యాహుకు ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూన్ 9:** ఇరాన్‌పై నిరంతరం దాడులు చేస్తూ ఉద్రిక్తతలు పెంచితే అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జరిపిన ఫోన్ సంభాషణల్లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి వాషింగ్టన్ ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడులు అమెరికా వ్యూహాలకు అడ్డంకిగా మారడమే ఈ హెచ్చరికకు ప్రధాన కారణం. వారాంతంలో లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాదాపు 30 బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. దీనికి బదులుగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, పెట్రోకెమికల్ కేంద్రాలపై దాడులు చేసింది. ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు ప్రస్తుతానికి దాడులను నిలిపివేశాయి. ఇరాన్‌పై మరింత పెద్ద ఎత్తున దాడులు చేయాలన్న నెతన్యాహు ప్రణాళికను ట్రంప్ జోక్యం చేసుకుని విరమింపజేశారు. బీబీ (నెతన్యాహు), నువ్వు జాగ్రత్తగా ఉండాలి లేకపోతే త్వరలోనే నువ్వు ఒంటరిగా పోరాడాల్సి వస్తుందని తాను హెచ్చరించినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఇరుపక్షాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నందున ఇక యుద్ధాన్ని ఆపాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు నెతన్యాహు మాత్రం తమ సరిహద్దు రక్షణ కోసం, ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి ఈ దాడులు తప్పనిసరని సమర్థించుకున్నారు. అమెరికా రక్షణ దళాలు ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో సహాయపడినప్పటికీ, ఇజ్రాయెల్ చేస్తున్న ఎదురు దాడుల్లో మాత్రం నేరుగా పాల్గొనలేదు.

## జైపూర్‌లోని బాణసంచా గిడ్డంగిలో అగ్నిప్రమాదం

### చిన్నారి సహా ఏడుగురు మృతి - మరో నలుగురి పరిస్థితి విషమం

**జైపూర్, జూన్ 9:** జైపూర్‌లోని ఖోహ్ నాగోరియన్ ప్రాంతంలో మంగళ వారం ఒక అక్రమ బాణసంచా గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి,



ఒక చిన్నారితో సహా ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఖోహ్ నాగోరియన్‌లోని ఐటీఐ కళాశాల సమీపంలో ఉన్న అయేషా నగర్ తలై ప్రాంతంలోని ఒక గిడ్డంగిలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని బర్న్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఆర్.కె. జైన్ మాట్లాడుతూ, నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, కాలిన గాయాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. జైపూర్ పోలీస్ కమిషనర్ సచిన్ మిట్టల్ మాట్లాడుతూ, ఆ గిడ్డంగిని బాణసంచా నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారని, అసలు ఫ్యాక్టరీ కొద్ది దూరంలోనే ఉందని ధ్రువీకరించారు. నివాస ప్రాంతంలో గిడ్డంగిని అక్రమంగా నడుపుతున్నారని, యజమాని, ఇంటి యజమాని, బాధ్యులుగా తేలిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## అణు క్షిపణులను మోహరించిన భారత్!



**న్యూఢిల్లీ,జూన్ 9:** భారతదేశ రక్షణ, అణు ఆయుధ విధానంలో చరిత్రాత్మక మార్పు చోటుచేసుకున్నది. రక్షణ రంగ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భారత్ ప్రయోగించేందుకు సిద్ధంగా ఉండేలా 12 అణు బాంబులను మోహరించినట్లు అంతర్జాతీయ ఆయుధాల పర్యవేక్షణ సంస్థ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రీ తన నివేదికలో వెల్లడించింది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణుబాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది.

## రెబెల్ ఎమ్మెల్యేలు,ఎంపిలపై టిఎంసినేత కల్యాణ్‌బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జూన్ 9:** పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశనికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది.

# సంక్షిప్తంగా..

## కేరళ మాజీ సిఎం విజయన్ కుమార్తె వీణకు ఇడి సమన్లు

**కొచ్చిన్, జూన్ 9:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణకు ఈడీ సమన్లు జారీచేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కొచ్చి కార్యాలయం ముందు హాజరవ్వాలని ఈడీ ఆదేశించింది. వీణతోపాటు సిఎంఆర్ఎల్‌కు సంబంధించిన మరో తొమ్మిది మందికి సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈడీతో కీలక పత్రాలను పంచుకోవడానికి నిరాకరిస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను కార్పొరేట్ నేరాలను విచారించే ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది.

ఈ క్రమంలోనే ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది.

ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలు డాక్యుమెంటరీ, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించినట్లు అధికారులు వెల్లడించారు.



## సన్నీలియోన్‌కు సిఐడి నోటీసులు

**ముంబయి,జూన్ 9:** బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఒక భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. కర్ణాటకకు చెందిన శివమ్ అసోసియేట్స్ అనే సంస్థ దాదాపు రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా, ఈ అక్రమ సొమ్ము వ్యవహారంలో సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. శివమ్ అసోసియేట్స్ అధినేత 2023లో ఛాంపియన్ అనే సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఒక ఐటెం సాంగ్ చేసినందుకు సన్నీ లియోన్‌కు ఏకంగా రూ.1 కోటి పారితోషికం ఇచ్చినట్లు బ్యాంక్ రికార్డుల ద్వారా అధికారులు గుర్తించారు.

## హార్ముజ్ జలసంధిలో కుప్పకూలిన హెలికాప్టర్


**టెహ్రాన్, జూన్ 9:** అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హార్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, "పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హార్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం.

## అన్నామలై 'వియ్ ది లీడర్స్' ఉద్యమానికి అనూహ్య స్పందన

**చెన్నై,జూన్ 9:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై ప్రారంభించిన వి ది లీడర్స్ ఉద్యమానికి ప్రజాక్షేత్రంలో అనూహ్య స్పందన లభిస్తోంది. ఈనెల 5న ప్రారంభమైన ఈ ఉద్యమంలో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే సుమారు 17 లక్షల మంది సభ్యులుగా చేరారని అన్నామలై ప్రకటించారు. ఈ భారీ సభ్యత్వ నమోదు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమిళనాడులో సమూల రాజకీయ మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు అన్నామలై తన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి వారు మార్పును ఎంత బలంగా ఆకాంక్షిస్తున్నారో స్పష్టమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఇజ్రాయెల్ గడ్డపై ఛత్రపతి శివాజీ విగ్రహం

**టెల్ అవీవ్,జూన్ 9:** మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ కీర్తిప్రతిష్టలు మరోసారి ప్రపంచవ్యాప్తం కానున్నాయి. ఇజ్రాయెల్‌లో శివాజీ మహారాజ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముంబైలోని ఆ దేశ కాన్సులేట్ జనరల్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యూదులు శతాబ్దాలుగా హింసను ఎదుర్కొన్నప్పటికీ భారత్‌లో మాత్రం వారు ఎలాంటి వివక్ష లేకుండా సురక్షితంగా జీవించారనే చారిత్రక బంధానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కొంకణ్ తీర ప్రాంతంలో



నివసించే బెనె ఇజ్రాయెల్ అనే యూదు సమాజానికి, మరాఠా సామ్రాజ్యానికి మధ్య 17వ శతాబ్దం నుంచే బలమైన సైనిక బంధం ఉంది. యూదుల యుద్ధ నైపుణ్యాలను, వారి పట్టుదలను గుర్తించిన శివాజీ మహారాజ్ వారిని తన సైన్యంలో, నౌకాదళంలో కీలక పదవుల్లో నియమించారు.

# 12 మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటు

## రాష్ట్రస్థాయిలో రెండు, ఉమ్మడి జిల్లాలలో ఒకటి

### చొప్పున 10: ఆదేశాలు జారీ చేసిన రవాణా శాఖ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 9:** తెలంగాణ రవాణా శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 12 మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్టు రవాణా శాఖ ప్రకటించింది.ఉమ్మడి జిల్లాలలో ఒకటి చొప్పున 10ఏర్పాటు చేయగా రాష్ట్రస్థాయిలో రెండు తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతీ తనిఖీ బృందంలో నలుగురు వాహన తనిఖీ అధికారులు ఉంటారని తెలిపింది. ఉమ్మడి జిల్లా మొబైల్ స్క్వాడ్లు,ఆయా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించనుండగా రాష్ట్ర స్థాయి మొబైల్ స్క్వాడ్లు రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తారని రవాణాశాఖ తెలిపింది. తనిఖీ బృందాలు ఈనెల8(సోమవారం) నుండి తనిఖీ బృందాలు నిర్వహిస్తున్నాయని ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించిన 211 వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్లు రవాణా శాఖతెలిపింది. వాటిల్లో త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలు, ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలు ఉన్నాయని రవాణా శాఖ తెలిపింది. తనిఖీలు కొనసాగుతాయని త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన దారులు త్రైమాసిక పన్నులు చెల్లించాలని సూచించింది.

# అధికారం కోల్పోయాక కెటిఆర్‌కు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గుర్తుకొచ్చాయి

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ బహిరంగ లేఖ

**హైదరాబాద్,జూన్ 9,ప్రభాతవార్త:**అధికారం కోల్పోయక కెటిఆర్‌కు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పోరాటాలు గుర్తుకొచ్చాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బహిరంగలేఖలో విమర్శించారు. రాహుల్‌గాంధీకి కెటిఆర్ రాసిన లేఖపై అడ్లూరి లక్ష్మణ్ ఇచ్చిన ప్రత్యుత్తర ఆయన మాటల్లోనే.. కెటిఆర్ మీరు ఎండల నుంచి సేదతీరడం కోసం కుటుంబ సమేతంగా మలేసియా వెళ్లినప్పటికి చాలా తీరక చేసుకుని తెలంగాణ గురించి ఆలోచిస్తు లేఖలు రాస్తున్నందుకు మీకు ధన్యవాదాలు. మలేసియా పర్యటనలో మీరు అపరిమిత ఆనందాన్ని పొందుతున్నారని ఆశిస్తున్నాం. మా ప్రియతమ నేత రాహుల్ గాంధీ కి మీరు రాసిన లేఖను ఎక్స్ లో చూశాం. మీ లేఖలో రాజ్యాంగం,నిరంకుశం, ఫాసిస్టు లాంటి పదాలు చూసి చాలా సంతోషపడ్డాం. అధికారం పోయాక మీకు భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గుర్తుకు రావడం ముదావహం. తెలంగాణ ప్రజలు మీ నిరంకుశ పాలనను అంతం చేసి మిమ్మల్ని ఫామ్ హౌస్ కు, గెస్ట్ హౌస్ లకు పరిమితం చేశాక తమరికి ఫాసిస్టు అన్న పదానికి అర్థం తెలిసినట్లుంది. తల్లి సోనియమ్మ ఇచ్చిన తెలంగాణను కల్వకుంట్ల మహల్‌గా మార్చిన విషయం మీరు మరిచిపోలేదనుకుంటున్నాం. అమరుల బలిదానాల పునాదులపైన ప్రగతి భవన్ అనే గడీని నిర్మించుకుని ఇనుప కంచెల మధ్య తెలంగాణ తల్లి ని బంధించి తమరు పొందిన వికృతానందం మీ మొహంలో నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. అహంకారానికి పర్యాయ పదం, ద్వేషానికి నిలువెత్తు నిదర్శనం, మోసానికి అసలు స్వరూపమైన మీ నాన్నను పక్కన నిలబడి మా రాహుల్ గాంధీ ని ప్రశ్నించే ధైర్యం చేసినందుకు మిమ్మల్ని అభినందించకతప్పదు. పదేళ్ళ అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలంగాణ ప్రజల రక్తం,చెమటను జుర్రుకుని తాగిన ఆ బలుపుతో పార్టీ పేరు మార్చుకున్న తమరు మా పార్టీ పేరు మార్చమని సలహాలు ఇస్తున్నారు. మీ ప్రియతమ తండ్రి నేను హిట్లర్ కాదు హిట్లర్ తాతను అని ఢంకా భజాయించి ,బల్లగుద్ది బలంగా ,ఖరాఖండిగా చెప్పిన విషయాలు మీ కర్ణభేరి కి తాకలేదా కెటిఆర్ ? నేను హిట్లర్ అని చెప్పుకోవడానికి సిగ్గుపడని నీకు వచ్చిన, నచ్చిన ఇంగ్లిష్ లో వివరించి చెప్పిన ఆడియో, వీడియో టేపులు కావాలంటే మీ విల్లాలోనైనా, ఫామ్ హౌస్ లోనైనా అందజేస్తాం. మీరు మాట్లాడితే అది క్షణానందం, మేం మాట్లాడితే కర్ణకఠోరమా..? మా ముఖ్యమంత్రి మాటలకు నీ మస్తిష్కాన్ని



జోడించి కోడిగుడ్డుపైన ఈకలు పీకే రాజ్యాంగ గరకపకడి అవతారమెత్తిన కెటిఆర్ గురివింద గింజ తన కింద ఉన్న నలుపును ఎరుగదనే ఒక సామెత ను ఎప్పుడైనా విన్నారా..? మీకు తెలంగాణ ప్రజలు ఇప్పుడు విశ్రాంతి ఇచ్చారు. ఒక్క సారి పదేళ్ల మీ పాలన ను పునరావలోకనం చేసుకోండి. ఆత్మ అంటు ఉంటే ఆత్మపరిశీలన చేసుకోండి. అప్పుడు తెలంగాణ హిట్లర్ ఎవరో తెలంగాణ హితుడు ఎవరో తేలిపోతుంది.

# సిఎం హిట్లర్ స్ఫూర్తి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

## ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సరికాదు:

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 9:** ప్రజాస్వామ్య వ్యవస్థలో హిట్లర్ స్ఫూర్తి ఏమిటనీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యను ఖండిస్తున్నామని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న హైడ్రా గురించి మాట్లాడుతున్న క్రమంలో, జర్మనీ నియంత హిట్లర్‌తో పోల్చుతూ మాట్లాడడాన్ని తమ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజా వ్యతిరేకి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసిన నియంతను స్ఫూర్తిగా తీసుకుని వ్యవహరిస్తానంటే... గతంలో హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలోనే హిట్లర్ అత్యంత హీనమైన, దుర్మార్గపు చరిత్ర కలిగిన వ్యక్తన్నారు. లక్షలాది మందిని మానవత్వం లేకుండా, క్రూర మృగం కంటే దారుణంగా హత్యాకాండకు గురిచేసిన నరహంతకుడని, సుమారు 5 కోట్ల మంది ప్రజల ప్రాణాలను బలిగొని, కోట్లాది మంది జీవితాల్లో తీవ్ర విధ్వంసాన్ని నింపి రెండవ ప్రపంచ యుద్ధానికి మూల కారకుడు హిట్లరేనని గుర్తు చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను, ఇక్కడి హైడ్రా కూల్చివేతలను పోల్చి మాట్లాడటం ముఖ్యమంత్రికి అంతర్జాతీయ విషయాలపై అవగాహన లోపాన్ని సూచిస్తోందన్నారు. ప్రజల హక్కులను కాలరాస్తూ, అహంకారంతో వ్యవహరించిన ప్రభుత్వాలకు, వ్యక్తులకు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో ప్రపంచ చరిత్రతో పాటు, మన దేశ, రాష్ట్ర చరిత్రలు కూడా నిరూపించాయన్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్య మంత్రి, హిట్లర్ పేరు ప్రస్తావిస్తూ, హైడ్రా పేరునే హిట్లర్ స్ఫూర్తితో తీసుకున్నానని అనడం అత్యంత విచారకరం, సిగ్గుచేటన్నారు. ముఖ్య మంత్రి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని, తన బాధ్యతా రహితమైన వ్యాఖ్యలకు సీఎం రాష్ట్ర ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇలాంటి వైఖరిని కొనసాగిస్తే ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# నిరుద్యోగ యువకులారా అడ్డదారులు వద్దు

## నకిలీ ఆఫర్లతో నట్టేట మునగొద్దు: ఆర్‌టీసీ ఎండీ నాగిరెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్9:** నిరుద్యోగ యువకులరా జాగ్రత్తగా ఉండాలని, అడ్డదారులు వద్దని కష్టపడి కొలువులు సాధించాలని ఆర్‌టీసీ ఎండి వై నాగిరెడ్డి హెచ్చరించార. నకిలీ ఆఫర్లతో నట్టేట మునగొదనదని నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్‌టీసీ ఉద్యోగాల పేరిట మోసగాళ్ల చేతిలో చిక్కి మోసపోవదనదని టీజీఎస్ ఆర్‌టీసీలో ఉద్యోగ నియమకాలన్నీ పూర్తి పారదర్శకంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మాత్రమే జరుగుతాయని స్పష్టం చేశారు. ఆర్‌టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే మధ్యవర్తులను, దళా రులను అస్సలు నమ్మవద్దని సూచించారు. అడ్డ దారులు తొక్కి జీవితాలను పాడుచేసుకోవ ద్దన్నారు.

కష్టపడి చదివి, మీ ప్రతిభతోనే ఆర్‌టీ సీలో కొలువులు సాధించండని పిలుపునిచ్చారు. కొలువుల పేరుతో అమాయక నిరుద్యోగులను మోసం చేసే వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఆర్‌టీసీ ఎండి వై.నాగిరెడ్డి హెచ్చరించారు.

# అనురూప్‌రెడ్డికి ఎక్స్ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి నివాళి

## కుటుంబ సభ్యులకు లేఖ, ఆర్థిక సాయం అందజేతకు నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** అమెరికాలోని లూసియానాలో ఇటీవల మృతి చెందిన తెలంగాణ యువకుడు కె.అనురూప్ రెడ్డికి ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తన స్నేహితులను కాపాడే ప్రయత్నంలో యువకుడు అకాలమరణం చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందని రేవంత్ పేర్కొన్నారు. తోటివారి ప్రాణాలు కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యువకుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనురూప్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ భరోసా ఇచ్చారు. కాగా, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ కవాడిపల్లికి చెందిన అనురూప్ రెడ్డి(23) అమెరికాలోని లూసియానాలో ఉంటున్నారు. సరదాగా గడిపేందుకు తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఈ ఏడాది మే 29న టోరో బేయు పార్కుకి వెళ్లారు. అయితే, స్నేహితులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోతుండగా ఏమాత్రం సంకోచించకుండా వారిని కాపాడారు అనురూప్ రెడ్డి.


ఈ క్రమంలో తన ప్రాణాలను కోల్పోయారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం స్వగ్రామానికి చేర్చింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆదేశాలతో కవాడి పల్లికి చేరుకున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మందుల సామేలు, అనురూప్ రెడ్డికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన లేఖను వారికి అందజేశారు. ముగ్గురు యువకులను కాపాడినం దుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవార్డు, ఆర్థికసాయం అందించనున్నట్లు వారికి నేతలు తెలిపారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే సంస్థల లక్ష్యం

## కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** వినియోగదారుల సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తోందని కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ (సీజీఆర్ఎఫ్) స్పష్టం చేసింది. ఇదే సమయంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడం కూడా ప్రధాన బాధ్యతగా నిర్వర్తిస్తోందని గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్ చైర్మన్ చవాన్ జయవంతరావు అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఫోరమ్ వినియోగదారుల సమస్యలను గూర్చి తెలుసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా దోమకొండ సబ్ డివిజన్ పరిధిలోని బీబీపేట, దోమకొండ, బిక్నూర్ నార్త్, బిక్నూర్ సౌత్, రాజంపేట్ మండలాలకు సంబంధించి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రాజంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ చవాన్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిష్కార వేదికలో పలువురు తమ తమ సమస్యలను గూర్చి ఫోరమ్‌కు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యల పై నిర్వహించిన ఈ పరిష్కార వేదికలో వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యల పై అర్జీలు అందించారని వివరించారు. అత్యధిక మంది వినియోగదారులు అధిక విద్యుత్ బిల్లుల పై ఫిర్యాదులు చేశారన్నారు. విద్యుత్ సిబ్బందికి బిల్లులు చెల్లించేందుకు నేరుగా డబ్బులు ఎవరూ ఇవ్వవద్దని, ఆన్లైన్ ద్వారా బిల్లులు చెల్లించాలని సూచించారు. కాగా 2003, విద్యుత్ చట్టంలోని సెక్షన్ 42(5) కింద విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కామ్‌ల)చే సీజీఆర్ఎఫ్ స్థాపించబడిన చట్టబద్ధమైన సంస్థ. బిల్లింగ్ లోపాలు, మీటరింగ్ సమస్యలు లేదా నాసిరకం సేవా నాణ్యత వంటి విద్యుత్ సేవలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి వినియోగదారులకు ప్రత్యేకమైన, అందుబాటులో ఉండే వేదికను అందించడం దీని ప్రాథమిక ఉద్దేశ్యం. లైసెన్సుదారు యొక్క అంతర్గత వ్యవస్థ ఫిర్యాదులను పరిష్కరించడంలో విఫలమైనప్పుడు, వాటిని విచారించి, తీర్పు చెప్పే వినియోగదారుల వివాద పరిష్కార అధికార సంస్థగా ఇది పనిచేస్తుంది. ఫోరమ్ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది, సాధారణంగా ఫిర్యాదు అందిన 30 నుండి 45 రోజులలోపు ఉత్తర్వు జారీ చేస్తుందని ఫోరం వెల్లడించింది.

# దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి వాసి మృతి



**మెట్‌పల్లి,ప్రభాతవార్త:** షార్జా కేంద్రంగా ఉన్న ఓ అల్యూమినియం గ్లాసుల పరిశ్రమలో పని చేస్తున్న మెటుపల్లి పట్టణంలోని గాజులపేటకు చెందిన అబ్దుల్ రఫీక్ (37)అనే వ్యక్తి మంగళవారం దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. రఫీక్ గత 11నెలల క్రితం దుబాయ్ వెళ్లగా.. విధులు ముగించుకుని మినీ బస్ లో రూమ్ కు చేరుకునే క్రమంలో ఆగి ఉన్న ట్రక్కును వీరు ప్రయాణిస్తున్న బస్ దీకొనడంతో రఫీక్ మృతి చెం దాడు. మృతునికి భార్య రజి యాబేగం, కూతురు రిడాఉండగా మృత దేహాన్ని స్వదేశానికి తరలించడానికి కాన్సులేట్ అధి కారు లు మృతుని కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

# ఉపాధ్యాయులు సంఘ సేవకు పునరంకితమవ్వాలి

## ఎస్‌టియూ టిఎస్ 80వ ఆవిర్భావ వేడుకల్లో చాడా వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 9:** పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు సంఘ సేవకు పునరంకితమవ్వాలి సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సంఘం 80వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో చాడ అతిథిగా పాల్గొన్నారు. సంఘ పతాకావిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. గత ఎనిమిది దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణే ధ్యేయంగా స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) నిరంతరం పనిచే స్తోందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయ సమస్యల తోపాటు, విద్యాభివృద్ధి కోసం కూడా పాటుపడాలని సూచించారు. ఎస్‌టియు స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘమని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల ప్రయోజనాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా సంఘం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు పొందుతున్న అనేక హక్కులు, సౌకర్యాలు ఎస్‌టియు పోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. నాటి రాష్ట్ర బాధ్యులు రాఘవాచారి, శ్యాంసుందరరావు వంటి నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఎన్నికై ఆ పదవులకు గౌరవాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎటువంటి పైరవీలు, వ్యక్తిగత ప్రయోజనాలకు తావులేకుండా నిబద్ధ తతో ఉపాధ్యాయుల కోసం పనిచేస్తున్న సంఘం ఎస్టీయూ అని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలు చేయడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పెం డింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, అలాగే 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. సంఘాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికిముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్వీస్ రూల్స్ సాధించి, ఉపాధ్యాయులకు ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించడమే ఎస్‌టియు ధ్యేయమని వారు స్పష్టం చేశారు.

# మైనింగ్ అనుమతులు రద్దు

## నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

### భూగర్భ, గనుల శాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** లక్ష్మీ నృసింహ స్వామి వెలిసిన వానకొండయ్య గుట్టపై మైనింగ్‌కు అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈనెల 7న లీజు రద్దు కోసం గనులశాఖకు కలెక్టర్ సిఫారసు చేశారు. దీంతో వాటిని పరిశీలించిన రాష్ట్ర భూగర్భ, గనుల శాఖ మైనింగ్ లీజు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని జనగామ జిల్లా ధర్మాపురం రెవెన్యూ పరిధిలోని వానకొండయ్య గుట్టపై 12 ఎకరాల ప్రభుత్వ స్థలం (సర్వే నంబర్37)లో రోహిత్‌పాల్ మినరల్స్ 2018లో మైనింగ్ కోసం అనుమతులు తెచ్చుకున్నది. అప్పటి నుంచి మైనింగ్ పనులు నిర్వహిస్తూ వస్తున్నది.

అయితే గత ప్రభుత్వం వాటికి సంబంధించిన మైనింగ్ అనుమతులు రద్దు చేసింది. ఆ తర్వాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కాంట్రాక్టర్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చాయి. లకావత్‌తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ జాటోత్ ఆనంద్ క్వారీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో క్వారీ నిర్వహణపై విచారణ చేపట్టిన కలెక్టర్ ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా పాటించకపోవడంతో పాటు, పలు ఉల్లంఘనలకు పాల్పడినట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇటీవల క్వారీ కాంట్రాక్టర్ తదితరులను కలెక్టర్ విచారణ చేశారు. ఈ విచారణలో మైనింగ్ రద్దుకు కలెక్టర్ ప్రతిపాదించారు. దీంతో క్వారీ క్వారీ లీజు రద్దు చేస్తున్నట్టు గనుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవునిగుట్ట కావడం, పర్యావరణకు విఘాతం కలిగించడంతో పాటు, సదరు మినరల్స్ సంస్థ పంచాయతీ అనుమతి తీసుకోలేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంతేకాకుండా తహసీల్దార్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోకపోవడం, లీజు కు సంబంధించిన రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో లేకపోవడం, లీజు బకాయిలు ఉండటం తదితర కారణాలతో అనుమతులు రద్దు చేసినట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# రాంచందర్‌రావు.. డొంకతిరుగుడొద్దు

## పంజాబ్, హర్యానా తరహాలో తెలంగాణలో ధాన్యం సేకరణ చేపట్టండి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, జూన్9,ప్రభాతవార్త:**పంజాబ్ ,హర్యానాల్లో సేకరించినట్లుగానే తెలంగాణలో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్‌కు సమాధానం చెప్పకుండా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు డొంక తిరుగుడు సమాధానాలు చెబుతున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. మంగళవారం సిఎల్పీ మీడియా సెంటర్ ఆయన మాట్లాడుతూ బిజెపి రైతు వ్యతిరేకతో రైతు వ్యతిరేక చట్టాలు తేవడంతోపాటు, రైతులను చంపిందనీ ఆరోపించారు. తెలంగాణ రైతాంగానికి శనిలా బిజెపి విధానాలున్నాయనీ, తెలంగాణ కేంద్ర మంత్రులు కేంద్రాన్ని నిలదీసి మొత్తం ధాన్యం కొనుగోలు చేపిస్తారని ఆశించామనీ కాని కేంద్ర మంత్రులు ,బిజెపి ఎంపీలు పట్టించుకోలేదనీ విమర్శించారు. బిజెపి ఆఫీసు ముందు ధాన్యం ఎలా పోస్తారో చూస్తామని అని రామచంద్ర రావు సవాల్ చేయడం తగదని రైతుల కడుపు మండితే వాళ్లను ఆపగలుగుతారా అని ఆయన ప్రశ్నించారు. రామచంద్రరావు కొత్తగా బిజెపి అధ్యక్షుడు అయ్యాడనీ ఆయనకు అవగహన లేదనీ ఎద్దేవా చేశారు.. రైతుల బరి తెగిస్తే ఆపే శక్తి మీకు ఉందా..? రైతుల ముందు ప్రధాని మోదీ మోకరిల్లి క్షమాపణ చెప్పి నల్లచట్టాలను వెనక్కి తీసుకున్న విషయం మరిచిపోయారు..? రైతు లు తిరగబడితే తెలంగాణలో కూకటివేళ్లతో మీ పార్టీని పీకేస్తారనీ హెచ్చరించారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ , మీరు పార్టీ నాయకులంతా మాట్లాడుకుని 15 లోపు ప్రతి గింజ కేంద్రంతో కొనపిస్తామని ప్రకటిస్తే మంచిది. ప్రకటించకపోతే 15 తర్వాత తెలంగాణ రైతుల తెగింపు ముందు మీ ఆఫీసులు, మీ ఎమ్మెల్యేల ఇళ్లు ధాన్యంతో నిండిపోతాయి జాగ్రత్త అని హెచ్చరించారు. తుమ్మిడిహట్టి పైన మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ కోసం మా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖలు రాశారనీ కాని బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు లేఖ రాయలేదని చెపుతున్నారనీ ఆవేదన చెందారు.. మా ముఖ్యమంత్రి రాసిన లేఖ ను చూపిస్తున్నాం చూడు రామచంద్ర రావు అని లేఖ ప్రతులు చూపారు.

గత రెండున్నర యేళ్లు గా చివర గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నది మా ప్రభుత్వం ధాన్యం కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామనీ తెలిపారు.

# ప్రభుత్వవైఫల్యాలకు మూల్యం చెల్లించుకొంటున్న దేశ ప్రజలు

> గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై మహా నిరసన ర్యాలీ
>
> తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్,జూన్9,ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాల వైఫల్యంకు దేశ ప్రజలు మూల్యం చెల్లించుకొంటున్నారని నిత్యావసరాల ధరలు డీజిల్ పెట్రోల్ ధరలపెంపుతో మరింతగా పెరిగి జీవనోపాధులు కోల్పోయి ప్రజలు మూడు పూటలా తిండి తినలేని పరిస్థితికి తీసుకొస్తున్నారనీ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గాంధి భవన్ నుండి గన్ పార్క్ వరకు నిరసన ర్యాలి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను ఏకంగా 4 సార్లు పెంచడాన్ని ఖండించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంతరం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై విధించిన అధిక ఎక్సైజ్ డ్యూటీ వల్లనే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు చమురు సంస్థలపై ఒత్తిడి తీసుకురావడం లేదని ఆమె ప్రశ్నించారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, బడా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించకపోతే మహిళల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పోరాటాలు ఉధృతం చేస్తాం. మహిళా శక్తి ఏంటో కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కార్యవర్గ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్,సంస్థాగత పటిష్టతపై ఖర్గేతో సంపత్,కుసుమ కుమార్ సమాలోచనలు

**హైదరాబాద్,జూన్9,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల సవరణలో పారదర్శకత లోపించిందని ప్రజలను చైతన్య పరిచి ఓటుహక్కు కోల్పోకుండా అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖర్జునఖర్గే అన్నారు. ఎఐసిసి అధ్యక్షులు అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తో తెలంగాణ ఎఐసిసి కార్యదర్శులు సంపత్ కుమార్, కుసుమ కుమార్ లు సమావేశమై సమాలోచనలు చేశారు.ఢిల్లీలోని ఎఐసిసి కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్ లో అరగంట కు పైగా ఖర్గే తో సమావేశంలో సంస్థాగత పటిష్టత, సర్‌పై బిఎల్ఎలను కాంగ్రెస్ కార్యకర్తలను క్షేత్రస్థాయిలో చురుకుగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలను వారు చర్చించారు. ఎఐసిసి కార్యదర్శులు సంపత్ కుమార్, కుసుమ కుమార్ ఇటీవల రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలు, ఇక్కడ పాలన రెండేళ్ల ప్రగతి, కాంగ్రెస్ పార్టీ లోని సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.



# బకాయిల కోసం పాడి రైతుల రాస్తారోకో

## త్వరలో చెల్లిస్తామని మదర్ డైరీ హామీ

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** తమకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మదర్ డెయిరీ పరిధిలోని పాడి రైతులు ఆందోళనకు దిగారు. పెండింగ్‌లో పాల బిల్లులను తక్షణమే చెల్లించాలని రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లాలోని కోదాడ-హుజూర్నగర్ ప్రధాన రహదారిపై మంగళవారం పాడి రైతులు భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో కారణంగా కోదాడ-హుజూర్నగర్ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మదర్ డైరీ పరిధిలో పనిచేస్తున్న ఏడు పాల సేకరణ సంఘాలకు సంబంధించిన సుమారు రూ.17 లక్షల బకాయిలు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉండంతో తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళన సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నెలల తరబడి తమకు రావాల్సిన పాల బిల్లులు చెల్లించకుండా మదర్ డైరీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడం అన్యాయమని విమర్శించారు. పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ యాజమాన్యం సమస్యను పట్టించుకోలేదని ఆరోపించారు. బకాయిల చెల్లింపుతో పాటు పశువుల మేత, దాణా కొనుగోళ్ల కోసం ముందస్తు ఖర్చులను కూడా విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో మదర్ డెయిరీ అధికారులు అక్కడకు వచ్చి రైతులతో చర్చలు జరిపారు. అనంతరం ఢిల్లీ నేషనల్ డైరీ సీఈఓ లింగారెడ్డి ఆందోళన చేస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రూ.17 లక్షల బకాయిలను రెండు వారాల్లో పూర్తిగా చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే రైతులకు సంబంధించిన ఇతర ఆర్థిక అంశాలను కూడా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దీంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

# పాలీసెట్ ట్యూషన్ ఫీజు చెల్లించడానికి 11 వరకు అవకాశం

## కాలేజీల్లో రిపోర్ట్ చేయడానికి గడువు పెంపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్9:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి ట్యూషన్ ఫీజు చెల్లించడానికి గడువును పెంచారు. సీట్ల కేటాయింపు చేసిన సమయంలో ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 9వరకు గడువు ఉండగా.. దానిని కాస్త ఈ నెల 11 వరకు పొడిగించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటించారు. ట్యూషన్ ఫీజు చెల్లించి కాలేజీల్లో చేరడానికి ఈ నెల 11 వరకు అవకాశం కల్పించినట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2026 మొదటి విడతలో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 25,137 సీట్లను కేటాయించారు. 112 ప్రభుత్వ, పాలిటెక్నిక్ కాలేజీల్లో 32,813 సీట్లు 2026-27 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్నాయి. 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,284 సీట్లు ఉండగా వాటిలో మొదటి విడతలో 16,777 సీట్లను కేటాయించారు. 53 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,529 సీట్లు ఉండగా వాటిలో 8360 సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 9లోపు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో నేరుగా చేరాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి గడువును ఈ నెల 11 వరకు పొడిగించారు.

# మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దేశ్‌ముఖిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రవేశాలకు గాను దరఖాస్తులను కోరుతోంది. ప్రస్తుత 2026-27 విద్యా సంవత్సరానికి గాను రెండో విడత దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత మం గళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 11న ఉదయం 6 గంటలకు కళాశాలకు చేరుకోవాలని సూచించారు.

# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు

స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం, పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు కాదు.. రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు..

## 'ఎఫ్‌టీసీసీఐ ఎక్స్‌లెన్స్ అవార్డ్ 2026' ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని ఓ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్‌టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్‌టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్‌ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక ఎంఎస్‌ఎంఈ పాలసీని తీసుకొచ్చామన్నారు. పారిశ్రామిక వేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించామన్నారు. పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే చూడటం లేదని రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టునుంచి వచ్చే యేడాది కార్గోసేవలు

## వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్,జూన్9,ప్రభాతవార్త:** విమానాశ్రయాల అభివృద్ధి పనులు, త్రిపులార్ రోడ్ పనులు వేగంగా జరిపించడానికి రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోందని వరంగల్ ఎయిర్ పోర్టునుంచి వచ్చే ఏడాది కార్గోసేవలు ప్రారంభం చేస్తామని, అదే విధంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. వాగులు వంకలు పొర్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను, బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలనీ, అందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, లో కాజ్ వేలు వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వానకాలం సీజన్ లో క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉన్నట్లే, ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, జిల్లాల వారీగా రోజు వారి పరిస్థితులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆర్ అండ్ బి డివిజన్ ల వారిగా క్షేత్ర స్థాయి రిపోర్ట్ రోజు తనకు తెలపాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు సి.ఇ, ఎస్.ఇ, ఇఇ, డి.ఇ, ఎఇలు ఖచ్చితంగా ప్రతి రోజు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి, ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రాష్ట్రంలో రోడ్ నెట్వర్క్ అభివృద్ధి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఈ సందర్భంగా అధికారులతో పేర్కొన్నారు. హ్యామ్ పనులకు అతి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుందని మంత్రి అన్నారు. 2047 రైసింగ్ తెలంగాణ నినాదంతో 3ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గ్లోబల్ సమ్మిట్ వేదికగా రాష్ట్ర రోడ్ సెక్టార్ పాలసీ తీసుకువచ్చామని గుర్తు చేశారు. గ్రామీణ స్థాయి నుండి రహదారులు అభివృద్ధి చేయడం వల్ల పరిశ్రమలు వచ్చి, పల్లెల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం భూసేకరణలో రాష్ట్ర వాటా కింద 626.87 కోట్లు ఇప్పటికే నేషనల్ హైవే అథారిటి ఖాతాలో జమచేసినట్లు వెల్లడించారు. న్యామ్ రోడ్డులో మిర్యాలగూడ నియోజకవర్గంలోని నందిపాడ్ వద్ద తరచూ యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని, వెంటనే అక్కడ వెహికిల్ అండర్ పాస్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిపాలన అనుమతులు మంజూరు చేసి, పనులు అతి త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సెక్రెటరీ ప్రావిణ్య, సి.ఈ లు బి.వి రావు, ధర్మారెడ్డి, వనజ పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు. వరంగల్ ఎయిర్పోర్ట్, ఆదిలాబాద్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని రూరల్ ఎకానమీ గ్రోత్ కి ఎంతో ఉపయుక్తం కానున్నాయని మంత్రి అభిప్రాయ పడ్డారు. వరంగల్ ఎయిర్పోర్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని వచ్చే ఏడాది నాటికి కార్గో సేవలు అందుబాటులోకి వచ్చేలా పనులు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆహారపంటల సేకరణ బాధ్యత నుంచి కేంద్రప్రభుత్వం తప్పుకోవడం తగదు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతారాహిత్యంతో మూల్యం చెల్లించుకొంటున్న రైతులు

### బిజెపి నేతలు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** వరి, ఆహారపంటల సేకరణ బాధ్యత నుంచి తప్పుకోవడం కేంద్ర ప్రభుత్వంకు తగదని, కేంద్రం నిర్ధేశించిన సగటు నాణ్యత ప్రమాణాలు కలిగిన ధాన్యం కనీస మద్దతు ధరకు సేకరించిన తెలంగాణ నుంచి వ్యవసాయోత్పత్తులు సేకరణకు అనేక సాకులు చూపుతున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సహచర మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, లోక్‌సభ సభ్యులు రఘువీరారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం నుంచి ఖరీఫ్‌రబీసీజన్‌లు కలిపి ఈ యేడాది 52లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తీసుకొంటామని మొండికేస్తుందని దీనితో ధాన్యం సేకరణ భారం రాష్ట్రప్రభుత్వం భరించాల్సి వస్తోందని ఆవేదన చెందారు. తెలంగాణలో 147లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ యేడు ఇప్పటి వరకు రెండు సీజన్లలో సేకరణ చేశామని మిగితా 75లక్షల మెట్రిక్ టన్నుల కు చెందిన ఆరున్నవేల కోట్ల ఆర్థిక భారం రాష్ట్రప్రభుత్వంపై పడుతోందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రానికి కేటాయించే ధాన్యం సేకరణ లక్ష్యాలను క్రమంగా తగ్గిస్తూ రైతులకు అన్యాయం చేస్తోందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బిజెపి నాయకులు కొనుగోలు కేంద్రాల యాత్రల పేరుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారనీ తెలంగాణ ప్రభుత్వం సేకరణచేసినంత పరిమాణంలో ఏ బిజెపి పాలిత రాష్ట్రాలలో సేకరణ చేయడంలేదని వివరించారు. కేంద్ర ఆహారమంత్రి ప్రహల్లాద్ జోషిని అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి, నేను కలిసి ధాన్యం సేకరణకోట దిగుబడికి అనుగుణంగా పెంచాలని కోరామని వారు మాత్రం పెంచడంలేదని అన్నారు. తెలంగాణలో 2025-26 ఖరీఫ్ రబీసీజన్‌లో 295లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా దిగుబడికాగా 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు రూ.35,077 కోట్ల కనీస మద్దతు ధర చెల్లించామని చెప్పారు. రబీ సీజన్‌లోనే రాష్ట్రప్రభుత్వం రూ.17,917 కోట్ల మద్దతు ధర కింద రైతులకు నేరుగా చెల్లించామని తెలిపారు. ప్రభుత్వంను గన్నీ బ్యాగులు లేవని అప్రతిష్టపాలు చేయడానికి బిఆర్‌ఎస్ బిజెపిలు కుట్రలు చేశాయని కొనుగోళ్ల కోసం మొత్తం 20.86 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచితే వాటిలో 18.75 కోట్ల సంచులను వినియోగించారనీ ప్రస్తుతం ఇంకా 2.11 కోట్ల సంచులు నిల్వలో ఉన్నాయని తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన 12,557 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రత్యేక చర్యల ద్వారా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులను ఆదుకున్నామని మంత్రి తెలిపారు. ఆ ధాన్యానికి 12 గంటల వ్యవధిలోనే మద్దతు ధర చెల్లించి రైతులను నష్టాల నుంచి కాపాడామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషించాయని మంత్రి కొనియాడారు. ఐకెపి, పిఎసిఎస్ తదితర సంస్థలు ధాన్యం సేకరణ చేసి రూ.470.40 కోట్ల కమిషన్ కూడా పొందారని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ ఆరోపణలు చేయడం మాను కుని కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. 18 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించింద న్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్య తగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిష్యత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హామాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీ ఎస్‌ఏ) చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టు కుపోతాయని ఎన్‌డిఎస్ఏ స్పష్టం చేసిందన్నారు.

# ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య మౌలిక వసతులు కల్పించాలి

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా




**సంగారెడ్డి బ్యూరో , జూన్ 9, ప్రభాతవార్త :** జిల్లా సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర కార్మిక, ఎంప్లాయిమెంట్ శాఖ మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, రవాణా, ఆర్ అండ్ బి, పిసిబి, పి ఆర్, విద్యుత్, డి ఆర్ డి ఏ, సంక్షేమ శాఖలు, ఆర్టీసీ, షుగర్ కేన్, పరిశ్రమలు, తదితర రంగాల పురోగతిపై మంగళవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా మరింత పురోగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రైతులను క్రాప్ డైవర్షన్ వైపు ప్రోత్సహిస్తూ, లాభదాయక పంట అయిన ఆయిల్ పామ్ సాగుపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని, రైతులకు యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించి ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, గూడు లేని పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో గతంలో నిర్మించి కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాల మేరకు నీటి నిల్వలను నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన మౌలిక వసతులపై నివేదిక సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారి-65 పరిధిలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ కార్మికుల నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. హాస్పిటళ్లు, హోటళ్లు తదితర సంస్థల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రత్యక్షంగా చేరడం ముఖ్యమని అన్నారు. తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అవసరమైన బోర్‌వెల్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని డయాగ్నస్టిక్ పరికరాలు, డ్రగ్స్, అవసరమైన ఇక్విప్‌మెంట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సేవలకు అవసరమైన చోట అదనపు పడకల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నర్సింగ్ కళాశాలను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎంపీలు , ఎమ్మెల్సీ, శాసనసభ్యులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ సురేష్ శేఖర్ రైతు సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రైతులకు న్యాయం చేయాలన్నారు. ఎంపీ రఘునందన్ రావు ప్రజలు మోసపోకుండా ఏ సర్వే నంబర్లు ఏ భూమి ఉందో తెలిసేలా వెబ్సైట్లో పెట్టాలన్నారు.

# తెలంగాణ రిసార్ట్స్‌కు జార్ఖండ్, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** జార్ఖండ్ 2, మధ్యప్రదేశ్‌లో 3 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు ఉండటంతో కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను తెలంగాణ రిసార్టులకు తరలించేందుకు సన్నద్ధమైనట్లు సమాచారం. మధ్యప్రదేశ్‌లో బిజెపికి 164 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రెండు సీట్లే వచ్చేలా ఉన్నా బిజెపి 3వ అభ్యర్థిని బరిలోకి దింపింది. అటు జార్ఖండ్‌లో ఇండి కూటమికి 56, బిజెపికి 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. గెలుపునకు 28 ఓట్లు అవసరం. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ సత్వానీకి బిజెపి మద్దతు ఇస్తోంది. ఈ రాష్ట్రాల్లో క్రాస్ ఓటింగ్ భయంతో కాంగ్రెస్ అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గీత దాట ఉండేందుకు క్యాంప్‌లు నిర్వహిస్తోంది. మధ్యప్రదేశ్ నుంచి ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మినాక్షి నాటరాజన్ కాంగ్రెస్ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.



# రాష్ట్రంలో గల్ఫ్ అవగాహనపై ఐక్యరాజ్యసమితి చైతన్య రథం ప్రారంభించిన చిన్నారెడ్డి

**బేగంపేట, జూన్ 9,ప్రభాతవార్త:** గల్ఫ్‌వలసలపై అవగాహన ,చైతన్యం కల్పించడానికి ఏర్పాటు చేసిన మొబైల్ వలస సహాయ కేంద్రం ప్రచార రథాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ ,సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగాలైన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్(ఎఫ్ఓఏ) ,ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం)లు మైగ్రేషన్ మల్టీ పార్ట్నర్ ట్రస్ట్‌ఫండ్ (ఎంఎంపీటీఎఫ్) మద్దతుతో ఈ ప్రచార రథం ఏర్పాటు చేసారు. తొలివిడతలో నిజామాబాద్, నారాయణపేట్ జిల్లాల్లో ఈ యాత్ర ద్వారా ప్రచారాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐఓఎం ప్రతినిధి అంకిత సురభి, రాష్ట్ర వెలమ కార్పోరేషన్ ఛైర్మన్ జువ్వాడి నర్సింగరావు, ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ డా.బిఎం వినోద్‌కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీఎం ప్రజావాణీలో 775దరఖాస్తులు:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 229వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 775దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కు సంబంధించి 390దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకోసం 254, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, ప్రవాసీ ప్రజావాణికి 01దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి, దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## దుబాయ్ రోడ్డు ప్రమాదంలో

# తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు. గాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న భారత కాన్సులేట్ అధికారులు బాధితులను పరామర్శించారు.

# వీధి రౌడీలా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. దోచుకోవడంలో మంత్రుల పోటా పోటీ

## తెలంగాణ ప్రాజెక్టులకు అడ్డుపడుతున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

### ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని, పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారు,. రేవంత్ రెడ్డి వంటి సీఎంలను ఎంతో మందిని చూశానని, వారిని ఇళ్ల ముందే ఘెరావ్ చేశానని, ఉద్యమాలు చేస్తూ ఢిల్లీ వరకు వచ్చానని ధ్వజమెత్తారు.

# ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్9:** ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సిడిఏ) నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై వారికి దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

# అయోధ్య రామమందిరానికి తాజా విరాళాలు రూ.500 కోట్లు



### ఇప్పటివరకూ రాబడులు రూ.5500 కోట్లు

**అయోధ్య, జూన్ 9:** అయోధ్య రామమందిరానికి ఇటీవల వచ్చిన విరాళాలు రూ.500 కోట్లు దాటాయి.ప్రతిరోజు యాత్రికులు అందజేసే విరాళాలు, విరివిగా ద్వారా కూడా ఈ మొత్తం చేకూరినట్టు టెంపుల్‌ట్రస్ట్ చెప్పారు. ఇప్పటివరకూ మొత్తం రూ.3వేల కోట్లు విరాళాలు రూపంలో అందాయి. అయితే ఒకే మొత్తంగా రూ.500 కోట్లు విరాళం అందించడానికి ఎక్కడా ఆధారాలు లేవు. ఒక ప్రముఖ తెలుగు వ్యక్తి లేదా నటుడు విరాళం ఇచ్చారని కొందరు, పారిశ్రామిక వేత్త అంబాని విరాళం ఇచ్చారని మరికొందరు ఇలా చెపుతూ వచ్చారు. అయితే ఇందుకు ఆధారాలు మాత్రం స్పష్టంగాలేవు. దేశవ్యాప్తంగా వచ్చిన భక్తులనుంచి ఇప్పటివరకూ రూ.3వేల కోట్లు అందినట్లు దేవాలయ ట్రస్టుపేర్కొంది. రోజువారి వచ్చే యాత్రికులు సగటున ప్రతిరోజు 8 లక్షలు విరాళం అందిస్తున్నారు. హుండీల్లోనే వీటిని జమచేయడం జరుగుతోంది. ఇక ప్రధాన ఆలయ నిర్మాణ ఖర్చు రూ.1500 కోట్లుకాగా మొత్తం రూ.1800 కోట్లకు చేరింది. తెలుగు నటుడు ప్రభాస్ రూ.50 కోట్లు ఇచ్చారన్న సోషల్‌మీడియా ప్రచారాన్ని ఇటీవలే నటుడు ఖండించారు. పవన్‌కళ్యాణ్ వంటి నటులు వ్యక్తిగతంగా రూ.30 లక్షల వరకు అన్లైన్‌లోమాత్రమే విరాళాలు ఇచ్చారు. మొత్తం అన్నిరకాలుగాను అందిన విరాళాలు 5500 కోట్లుగా ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో రూ.11కోట్ల విదేశీ విరాళాలతోపాటుమూడేళ్లలో రామ మందిరానికి వచ్చే బంగారం వెండితోసహా రూ.2వేలకోట్లకుపైగా వచ్చాయి.

# ఆర్టీసి బస్, యాష్ ట్యాంకర్ ఢీ

- త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం
- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు
- ప్రయాణికులు సురక్షితం

**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూన్ 9:**మండల పరిధిలోని మాచినేనిపేట తండా గ్రామ పంచాయతీ జేత్యాతండా సమీపంలో తల్లాడ, కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్, యాష్ ట్యాంకర్ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు కాగా, త్రుటిలో ఘోర ప్రమాదం తప్పినట్లయింది, ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులు అందరూ సురక్షి తంగా బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్ హైదరాబాదు వెళ్లి తిరిగి భద్రాచలం వైపు వెళ్తుంది. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన యాష్ ట్యాంకర్ లారీ పాల్వంచలోని ఓ ఫ్యాక్టరీలో సిమెంట్లో ఉపయోగించే యాష్(బూడిద) ను ట్యాంకర్లో లోడ్ చేసుకుని దిగుమతి చేసేందుకు కొత్తగూడెం వైపు నుంచి జగ్గయ్యపేట వెళ్తుంది. మండల పరిధిలోని జేత్యాతండా గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్, యాష్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇల్లందుకు చెందిన బస్ డ్రైవర్ సాంబశివరావు, జగ్గయ్యపేట మండలం దిమ్మాలపాడు గ్రామానికి చెందిన యాష్ ట్యాంకర్ డ్రైవర్ కోటయ్య.

# కేరళలో ఉధృతం అవుతున్న 'వెస్ట్‌నైల్ ఫీవర్'

**తిరువనంతపురం, జూన్ 9:** కేరళలో దోమకాటు ద్వారా వ్యాపిస్తున్న వింత వ్యాధి వెస్ట్‌నైల్‌ఫీవర్ జోరుగా విస్తరిస్తోంది. దోమకాటుతో ఈ వ్యాధి విస్తృతంగా సోకుతున్నట్లు తెలుస్తోంది. ఎర్నాకుళం మరికొన్ని జిల్లాల్లోనే దోమల వ్యాప్తి జోరుగా ఉండటంతో ఈ కొత్త వైరస్ ఎక్కువ ఎగబాకుతున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ వైరస్ నివారణకు కొత్త ఔషధం కానీ వ్యాక్సిన్‌కానీ ఇంజెక్షన్లుకానీ ఏమీ రాలేదు. దోమకాటు నివారణ ఒక్కటే మార్గమని అధికారులు చెపుతున్నారు. క్యూలెక్స్ దోమల వ్యాప్తిని అరికట్టాలని, వీటి వ్యాప్తివల్లనే మనుషులను కాటువేయడంతో పరిసరాలకు సైతం సోకుతుందని అధికారులు చెపుతున్నారు. ఈ వైరస్ ముందు పక్షుల్లో ఎక్కువ ఉంటుందని, దోమలు పక్షులసాయంతో సంచరిస్తూ మనుషులకు సైతం ఈ దోమకాటును వ్యాపింపచేస్తున్నాయి. వ్యక్తులనుంచి వ్యక్తులకు సోకే వైరస్ కాదని, కేవలం దోమలు కుట్టడంవల్లనే వస్తుందని చెపుతున్నారు. సుమారు 80శాతానికిపైగా ఈ వైరస్ సోకినవారికి ఎలాంటి లక్షణాలు కనిపించలేదు. కేవలం 20 శాం మంది మాత్రమే అస్వస్థతకు లోనయ్యారు. జ్వరం,తలనొప్పి, వొళ్లనొప్పులు, వాంతులు, చర్మంపై దద్దుర్లు వంటివి ఉంటాయని వైద్యులు చెప్పారు. అరుదైన కేసుల్లో వైరస్ మెదడుకు సైతం సోకుతుందని, దీనివల్ల మెదనొప్పి, కొన్ని సందర్భాల్లో పక్షవాతం కూడా రావచ్చని హెచ్చరించారు. వైద్య అధికారులు ఎర్నాకుళం, కోజికోడ్, మాలప్పురం, త్రిశూరు జిల్లాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. కేరళలో తరచూ సంభవించే వరదలు వర్షాలకారణంగా నీటి గుంతలు ఎక్కువ ఉంటుండటంతో దోమల వ్యాప్తికి కేంద్రాలుగా మారుతున్న సంగతి తెలిసిందే.

# కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై బిజెవైఎం రాష్ట్రశాఖ ధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్9:** విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మాసాబ్ ట్యాంక్ సమీపంలో ఉన్న తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, విద్యారంగంలో పెరుగుతున్న ఫీజుల భారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్దేశిత నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం టిఏఎఫ్‌ఆర్‌సి అధికారులకు వినతిపత్రం సమర్పించి, ఫీజుల నియంత్రణ విషయంలో కఠిన చర్యలు చేపట్టి విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. విద్య హక్కుగా అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

# బిసిల డిమాండ్లపై మంత్రి పొన్నంతో భేటీ

### 120 కాలేజీ హాస్టళ్లు, 150 గురుకులాలు మంజూరు చేయాలి

### రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి: బిసి సంఘం నేతల డిమాండ్



మంత్రి పొన్నం ప్రభాకర్ తో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆర్ .కృష్ణయ్య

**హైదరాబాద్ జూన్ 9 ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలో బీసీ విద్యార్థుల విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు వెంటనే 120 కొత్త కాలేజీ హాస్టళ్లు, 150 బీసీ గురుకులాలను మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘం ప్రతినిధులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమై బీసీల సమస్యలపై గంటసేపు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. హాస్టళ్లలో సీట్లు దొరకక అనేకమంది బీసీ విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 20, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 చొప్పున, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో 15 చొప్పున కొత్త హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ గురుకులాల్లో వస్తున్న అద్భుతమైన విద్యా ఫలితాల (10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత, స్టేట్ ర్యాంకులు) దృష్ట్యా డిమాండ్‌కు తగ్గట్లుగా మరిన్ని కొత్త గురుకులాలు అవసరమని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 350 కాలేజీ హాస్టళ్లు, 330 గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడం దారుణమని, వెంటనే భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని కోరారు. జీవో నెంబర్ 7ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలి, పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్న రోస్టర్ విధానం బీసీలకు వ్యతిరేకంగా ఉందని, దీనిని సవరించాలి. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి రూ.20 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి. విదేశీ విద్యా ఫిస్టే ఫండ్‌ఖీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ చర్చల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణకుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ సంఘం నేతలు రాజేందర్, పృథ్వీ గౌడ్, పగిళ్ళ సతీష్, బలరాం, సింహాచలం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ ఉద్యోగాల పేరిట భారీ మోసం

- 31 మంది నుంచి రూ. 39 లక్షల వసూలు - డబ్బులు తిరిగి ఇమ్మని అడిగినందుకు బెదరింపులు - దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ఎల్.బి.నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురుని మోసం చేశారు. డాక్యుమెంటేషన్ ఇతర ఖర్చుల నిమిత్తం 31 మంది నుంచి రూ 39 లక్షలు వసూలు చేశారు. ఉద్యోగాలు ఇప్పించకపోగా డబ్బులు అడిగినందుకు వారిని బెదిరిస్తున్నారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలో నివాసం ఉండే ఎన్.సుజాత వద్దకు విదేశీ ఉద్యోగ అవకాశం, వీసా ప్రక్రియ సేవల కోసం సరస్వతి హారీష్ రాజు, నాగేందర్, నరేందర్ అనే ముగ్గురు వ్యక్తులు ఆమెను పరిచయం చేసుకొని విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని 2025 ఆగస్టు 23న నమ్మ బలికారు. క్వెస్ట్ బిజినెస్ టెక్ (క్యూబిటి) పేరిట కార్యాలయం ఏర్పాటు చేసుకుని గ్రీన్‌హిల్స్ కాలనీలోని సుజాత చెందిన సెకండ్ మినిట్ ఓవర్సీస్ వీసా ప్రాసెసింగ్ కార్యాలయానికి వచ్చి ఒప్పందం కుదుర్చుకొని అదే రోజు సుజాత అకౌంట్ నుంచి వారి కంపెనీ అకౌంటులోకి డాక్యుమెంటేషన్ ఇతర ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు వసూలు చేశారు. రెండు మూడు నెలల్లోనే వీసాలు వర్క్ పర్మిట్లను ఇప్పిస్తామని సుజాతతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రిపబ్లిక్, జర్మనీ దేశాలకు పంపించేందుకు క్యూబిటి నిర్వహకులను నమ్మి సుజాత క్యూబిటి అకౌంట్‌కు పలు ఇన్కమ్ టాక్స్ కారణాలవల్ల వారి వ్యక్తిగత ఖాతాలకు రూ.39 లక్షలు పంపించింది. డబ్బులు చెల్లించిన వారి దరఖాస్తులన్నీ తిరస్కరించబడ్డాయి. అయితే క్యూబిటి నిర్వాహకుల సమర్పించిన వర్క్ పర్మిట్లు ఎంబసీకి సంబంధించిన పత్రాలు పూర్తిగా మోసపూరితమైనవి కావడం వల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. కంపెనీ నిర్వాహకులు మోసం చేశారని గమనించిన సుజాత డబ్బులు తిరిగి ఇవ్వమని వారిని అడగగా వారు నిరాకరించడంతోపాటు బుకాయించే ప్రయత్నంతోపాటు బెదిరింపులకు పాల్పడినట్లు బాధితురాలు సుజాత చైతన్యపురి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. క్యూబిటి వారు చేసిన మోసం వల్ల సుజాతకు ఆర్థిక, పరువు నష్టంతో పాటు మానసిక వేధింపులు వాటిల్లినట్లు పోలీసులు తెలిపారు. సుజాత ఫిర్యాదు మేరకు క్యూబిటి నిర్వాహకులపై చైతన్యపురి పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే చైతన్యపురి పోలీస్‌స్టేషన్లో ఇరు పార్టీలకు సంబంధించి ఒక ఏకాభిప్రాయం కుదరచడంలో భాగంగా లావాదేవీలు జరిగినట్లు కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి లావాదేవీలు జరగలేదని ఇన్స్పెక్టర్ తెలిపారు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

# 101కి చేరిన కాంగో ఎబోలా మృతుల సంఖ్య

### 550 మందికి పాజిటివ్ నిర్ధారణ



**కిన్‌సాసా,జూన్ 9:** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ బారిన పడిన మృతుల సంఖ్య 101కి చేరింది. దేశంలోని ఇటురి ప్రావిన్సులో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తోంది. అక్కడ ఉన్న సాయుధ గ్రూపుల వల్ల వైరస్ నియంత్రణ కష్టసాధ్యంగా మారుతోంది. తాజాగా ప్రభుత్వం కొత్త నివేదికను రిలీజ్ చేసింది. 550 పాజిటివ్ కేసుల్లో మృతుల సంఖ్య వందకు చేరినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా 10 మంది మృతిచెందగా, 35 కొత్త కేసులు నమోదు అయినట్లు ప్రభుత్వం చెప్పింది. ఎబోలాలోని బుందిబుగ్యో స్ట్రెయిన్ మహమ్మారిలా మారినట్లు మే 15వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఆరంభంలో ఎబోలా కేసులను గుర్తించడంలో ఆలస్యం కావడం వల్ల ఇప్పుడు పరిస్థితిని అదుపులోకి తేవడం కష్టంగా మారింది. ఇటురి, నార్త్ కివు, సౌత్ కివు ప్రావిన్సుల్లో ఎక్కువగా ఎబోలా కేసులు నమోదు అవుతున్నాయి. జుగు, ఇరుము, మాంబసా ప్రాంతాల్లో సాయుధ గ్రూపులు ఉండడం వల్ల అక్కడ వైరస్‌ను అదుపు చేయడం అసాధ్యమవుతోంది. మూడు కీలకమైన ప్రావిన్సుల్లో సుమారు 120 సాయుధ దళాలు ఉన్నాయని, వర్గ పోరు, రాజకీయ ప్రత్యర్థులు, అవినీతి వల్ల అక్కడ హింస పెరుగోతంది. దీంతో ఎబోలా కేసులను గుర్తించి, నియంత్రించడం పెను సవాల్‌గా మారింది. కాంగోలో సుమారు 10 కోట్ల జనాభా ఉంటుంది. అక్కడ ఈ వైరస్ వ్యాపించడం ఇది 17వ సారి. 1976లో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించారు. ప్రస్తుతం బుందిబుగయో స్ట్రెయిన్ ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు తెలుస్తోంది. పొరుగు దేశం ఉగాండా నుంచి ఆ వైరస్ స్ట్రెయిన్ వ్యాప్తి జరిగినట్లు భావిస్తున్నారు.

# ముగ్గురి ప్రాణాలు కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి

- శోకసంద్రంలో కవాడిపల్లి గ్రామం - యువకుడి త్యాగాన్ని గుర్తిస్తూ సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసాపత్రం
- ఎంపి, ఎమ్మెల్యేల ఘన నివాళి



అనురూప్ రెడ్డి పార్థవదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 9,ప్రభాతవార్త :** ప్రాణాలకు తెగించి ముగ్గురు స్నేహితుల ప్రాణాలను కాపాడి, తాను అమరుడైన కవాడిపల్లి యువకుడు అనురూప్ రెడ్డి కథ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. మానవత్వం, స్నేహం, త్యాగం అనే విలువలకు ప్రతీకగా నిలిచిన అనురూప్ రెడ్డి మరణం తెలంగాణ ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అతని ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి, సేవాభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి ఉన్నత విద్య కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడ యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి, ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా, విధి అతని జీవితాన్ని విషాదాంతం చేసింది.గత నెల 30న స్నేహితులతో కలిసి అమెరికాలోని లూసియానా రాష్ట్రంలోని టోరోడో పార్క్ సమీపంలోని సెబాన్ నది వద్దకు వెళ్లిన అనురూప్, ప్రమాదంలో చిక్కుకున్న ముగ్గురు స్నేహితులను కాపాడేందుకు ప్రాణాలకు తెగించాడు. లోతైన నీటిలో మునిగిపోతున్న వారిని ఒక్కొక్కరిని సురక్షి తంగా ఒడ్డుకు చేర్చాడు. అయితే వారిని రక్షి ంచి తిరిగి ఒడ్డుకు వస్తున్న సమయంలో నదిలో ఏర్పాటు చేసిన వల అతని కాళ్లకు చిక్కుకోవడంతో బయటపడలేక నీటిలోనే మునిగి ప్రాణాలు కోల్పోయాడు.ముగ్గురు ప్రాణాలను రక్షి ంచిన హీరోగా నిలిచిన అనురూప్ మరణవార్త కుటుంబ సభ్యులను, బంధువులను, గ్రామస్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దాదాపు పది రోజుల తర్వాత అమెరికా నుంచి ఆయన మృతదేహం స్వగ్రామం కవాడిపల్లికి చేరుకోగా గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. అనురూప్ చివరి చూపు కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కన్నీటి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ గ్రామానికి చేరుకుని అనురూప్ భౌతికకాయానికి పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.యువకుడి అసాధారణ త్యాగాన్ని గుర్తిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన ప్రశంసాపత్రాన్ని ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనురూప్ చేసిన సాహసం సాధారణ విషయం కాదని, తన ప్రాణాలను పణంగా పెట్టి ముగ్గురి ప్రాణాలను కాపాడడం గొప్ప మానవతా విలువలకు నిదర్శనమని కొనియాడారు.అనురూప్ లాంటి యువకులు సమాజానికి ఆదర్శమని, ఆయన త్యాగం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.కవాడిపల్లి గ్రామ ప్రజలు కూడా అనురూప్‌ను నిజమైన హీరోగా అభివర్ణిస్తున్నారు. తన ప్రాణాల కంటే ఇతరుల ప్రాణాలను ముఖ్యంగా భావించిన ఆయన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని, మానవత్వానికి నిలువెత్తు ప్రతిరూపంగా అనురూప్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని గ్రామస్తులు భావోద్వేగంతో పేర్కొన్నారు.అనురూప్ రెడ్డి మరణం ఒక కుటుంబానికే కాకుండా మొత్తం ప్రాంతానికి తీరని లోటుగా మారినా, ఆయన చూపిన ధైర్యం, సేవాభావం, త్యాగం

# కౌలు రైతుల డిమాండ్లను అమలు చేయాలి :సిఎంను కోరిన జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో ప్రొఫెసర్ జి.హరగోపాల్ తదితరులు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ పథకాలన్నింటిని నేరుగా అందించాలని పలువురు వక్తలు కోరారు. కౌలు రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందుకు తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ కృషి చేయాలని వక్తలు కోరారు. తెలంగాణ కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ కౌలు రైతుల సర్వే నివేదిక విడుదల మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి క్షేత్ర స్థాయి సర్వేలో వెల్లడైన కౌలు రైతుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని నసూచించారు. గతంలో పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కౌలు రైతులను గురి ంచేందుకు ఉద్దేశించిన 2011 భూ కౌలుదారు చట్టం ఎంతో ప్రగతిశీలమైనదని, ఈ ప్రభుత్వం వెంటనే దీనిని అమలు చేయాలని కోరారు. అలాగే కౌలు రైతుల సమస్యలపై సిఎం, వ్యవసాయ, రెవిన్యూ శాఖల మంత్రులతో అత్యవసరంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోందండరెడ్డిని కోరారు. ఈ సమావేశంలో వచ్చిన అన్ని అంశాలపై తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కారించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఇక్కడ జరిగిన చర్చల అనంతరం పలు అంశాలను పరిగణంలోకి తీసుకుని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో తీసుకువచ్చిన చట్టాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో వచ్చిన అన్ని అంశాలను రైతు కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని, కౌలు రైతులను గుర్తించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతానని ఆయన హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ జి.హర గోపాల్ మాట్లాడుతూ కౌలు రైతుల డిమాండ్లు న్యాయమైనవని, వెంటనే అమలు చేయాలని కోరారు. రైతు స్వరాజ్య వేదిక ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో 2026 ఏప్రిల్‌లో ఈ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీకి ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన నివేదికను విడుదల చేశారు. ఈ సమావేశంలో విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, జస్టిస్ బి.చంద్ర కుమార్, వేదిక ప్రతినిధి కన్నెగంటి రవి, బి.కొండల్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీహర్షపి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలి

### బాగ్ లింగంపలిలో ధర్నా నిర్వహించిన ఐద్వా కార్యకర్తలు




బాగ్ లింగంపల్లి పౌరసరఫరాల శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి జూన్ 9 ( ప్రభాతవార్త ) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్షి ్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం బాగ్ లింగంపల్లి పౌరసరఫరాల శాఖ కార్యాలయం ముందు ఐద్వా రాష్ట్ర అధ్యక్షు రాలు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్షి ్మ మాట్లాడుతూ, 2014 ఎన్నికల సమయంలో ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ, అధికారంలోకి వచ్చాక ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మరియు స్కూల్ ఫీజుల పెంపుతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని ఆమె పేర్కొన్నారు. ఐద్వా ప్రధాన డిమాండ్లు:ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి, రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలి. రాష్ట్రంలో ఉన్న 1,05,42,188 బిపిఎల్ కార్డుదారుల కోసం బియ్యంతో పాటు పప్పులు, నూనెలు, కారం, పసుపు, జీలకర్ర, ఆవాలు, జొన్నలు, సబ్బులు తదితర 14 రకాల సరుకులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరల భారం వల్ల మహిళలు పోషకాహారం తీసుకోలేక 50 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, పిల్లలకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని ఆమె వివరించారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్య దర్శులు కె.ఎన్. ఆశలత, కె. నాగలక్షి ్మ, పి. శశికళ, వై. వరలక్షి ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధ,

# 750 డాలర్లు అదనపు చెల్లింపుతో వీసా ప్రాసెస్ ప్రీమియం సేవలు!

**వాషింగ్టన్,జూన్ 9:** అమెరికాకు వ్యాపార లేదా పర్యాటక వీసాలపై రావాలనుకునే విదేశీయుల కోసం అమెరికా విదేశాంగ శాఖ ప్రత్యేక ప్రీమియం'వేగవంతమైన సేవను అందించనుంది. ఈ సేవ కోసం దరఖాస్తుదారులు ఇప్పటికే ఉన్న 185 డాలర్ల వీసా ఫీజుకు అదనంగా 750 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ వారంలో ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించనున్న ప్రకటన ప్రకారం, ఎంపిక చేసిన అమెరికా రాయబార కార్యాలయాలు మరియు కాన్సులేట్లలో వీసా దరఖాస్తుదారులు 750 డాలర్లు చెల్లించి, 10 రోజుల్లోపు ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ పొందే అవకాశం కల్పించే పైలట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు.పేరు వెల్లడించేందుకు ఇష్టపడని ఒక అమెరికా విదేశాంగశాఖ అధికారి సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రోగ్రామ్ జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుంది. అమెరికాలో ప్రవేశాన్ని కఠినతరం చేయాలనే ట్రంప్ పరిపాలన చర్యల కారణంగా ఏర్పడిన పరిస్థితులను కొంతవరకు సులభతరం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. విదేశీయుల వలసలపై కఠిన చర్యలు చేపట్టిన ప్రభుత్వం, ముఖ్యంగా కొన్ని ఆఫ్రికా దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ కోసం 15,000 డాలర్ల వరకు బాండ్ చెల్లించాలని కోరుతోంది. సోషల్ మీడియా ఖాతాలు సహా అనేక సంవత్సరాల వ్యక్తిగత వివరాలను పరిశీలనకు సమర్పించాలని నిబంధనలు విధించింది.ఈ కొత్త నిబంధనల వల్ల ప్రపంచవ్యాప్తంగా వీసా ప్రాసెసింగ్‌లో ఆలస్యాలు చోటుచేసుకోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వీసా మినహాయింపు కార్యక్రమంలో లేని దేశాల పౌరులకు వీసా ఇంటర్వ్యూ కోసం వేచి ఉండే కాలం కొన్ని నెలలు లేదా అంతకంటే ఎక్కువగా ఉండొచ్చు. అయితే, ఈ ఐచ్ఛిక ప్రీమియం అదనపు సేవ కోసం ఫీజు చెల్లించినంత మాత్రాన వీసా మంజూరు అవుతుందని హామీ లేదు.వేగవంతమైన ఈ సేవ అందుబాటులో ఉండే రాయబార కార్యాలయాలు, కాన్సులేట్ల జాబితాను జూలై 1కు ముందు ప్రకటించనున్నారు.

ఈ పైలట్ ప్రోగ్రామ్ ఈ ఏడాది చివరి వరకు కొనసాగనుండగా, డిమాండ్‌ను బట్టి దీన్ని మరింత కాలం పొడిగించే అవకాశముంది.

# గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అనుమతి

**న్యూఢిల్లీ,జూన్ 9:** గ్రేటర్ నికోబార్‌ప్రాజెక్టులో భాగంగా కేంద్రం రూ.13 వేలకోట్లతో గ్రీన్‌ఫీల్డ్ సివిల్ మిలిటరీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు జారీచేసింది. ఐఎన్ఎస్‌బాజ్ పేరిట ఉన్న ప్రస్తుత నేవల్ ఎయిర్‌ఫీల్డ్‌ను మరింతగా విస్తరించి గ్రేట్ నికోబార్ ప్రాజెక్టులో అంతర్భాగంగా ఈ ఎయిర్‌పోర్టును నిర్మిస్తోంది. అయితే రాజకీయంగా వివాదాలనడుమ కొనసాగుతున్నా కేంద్రం మాత్రం ఎయిర్‌పోర్టునిర్మాణానికి అనుమతించింది. రూ.81 వేల కోట్లతో ప్రతిపాదించిన గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై పర్యావరణ సంబంధిత సమస్యలున్నాయని పలు సంస్థలు,రాజకీయ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తంచేసాయి. గ్రేట్ నికోబార్ ఆగ్నేయ తీరంలోని గాలాథీబేకు సమీపంలోని చింగెన్‌వద్దనిర్మిస్తుంది. అటు పౌరవిమానయాన సర్వీసులు,మిలిటరీ ఏవియేషన్ అవసరాలకు రెండింటికీ ఈ ఎయిర్‌పోర్టు ఉపయోగిస్తారు. మలాక్కా జలసంధికి పశ్చిమప్రాంతానికి సులువుగా చేరుకునేందుకు కూడా వెసులుబాటు కల్పిస్తుంది. మలక్కా జలసంధి అంటేనేప్రపంచంలోని అత్యంత బిజీ మారిటైమ్ చోక్‌పాయింట్‌గా నిలిచింది. హిందూ మహాసముద్రం, దక్షిణ చైనా సముద్ర భాగాలను కలిపేప్రాంతంలో కీలకంగా ఉంది. గ్లోబల్ కంటైనర్‌ట్రాఫిక్ ఈ జలసంధి మీదుగానే వెళుతుంది. హిందూమహాసముద్రం తూర్పుప్రాంతంలో కార్యకలాపాలకు ఇపుడు రానున్న ఎయిర్‌పోర్టు కీలకం అవుతుంది. ఈ కీలక వాణిజ్యమార్గంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించేందుకు ఎయిర్‌పోర్టు దోహదంచేస్తుందని నేవల్ అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం క్యాంప్‌బెల్ బేలో ఉన్న ఐఎన్ఎస్ బాజ్ రన్‌వేను విస్తరించాలని ఎప్పటినుంచో ప్రతిపాదనలున్నాయి. 4500 అడుగులనుంచి పదివేల అడుగులకు పెంచాలనినిర్ణయించారు.

ఐదేళ్లలోనే ఈ ఎయిర్‌పోర్టును పూర్తిచేయాలని, మిగిలిన నావికాదళ కార్యకలాపాలు దశలవారీగా పూర్తవుతాయని చెప్పారు. పర్యావరణ నిపుణులతోపాటు విపక్షనేత రాహుల్‌గాంధీ కూడా ఈ ప్రాజెక్టునిర్మాణం ఒక పెద్దకుంభకోణం అని విమర్శించారు.

## గోధుమ నిగారింపు



ముఖాన్ని మెరిసేలా చేయగలిగే యాంటీ ఆక్సిడెంట్లు మరెన్నో పోషకాలు గోధుమ పిండిలో మెండుగా ఉంటాయి. మరి దీన్ని సౌందర్య సాధనంగా ఎలా ఉపయోగించాలో చూద్దామా... చర్మం మెరుపు తగ్గినప్పుడు లేదా మృదుత్వం దూరమైనప్పుడు గోధుమ పిండికి మరొక పదార్థాన్ని కలిపిన మిశ్రమంతో సమస్యను తరిమేయొచ్చు. రెండు టేబుల్ స్పూన్ల మెత్తని గోధుమపిండి, టేబుల్‌స్పూన్ తాజా మిల్క్ క్రీమ్ తీసుకోవాలి. దానికి తగినంత గులాబీ నీటిని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూత వేసి పావుగంట ఆరనివ్వాలి. ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రంచేస్తే చాలు. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మెనోపాజ్ దగ్గరపడుతున్న సమయంలో ఎదురయ్యే పిగ్మెంటేషన్ సమస్య, అలాగే ఎండవల్ల ఏర్పడే మచ్చలకు నివారణ దొరుకుతుంది. వర్ణ పిగ్మెంటేషన్ స్థాయి అను సమస్యనయం చేసి స్కిన్‌టోన్‌ను మెరుగుపరుస్తుంది. మృతకణాలను తొలగించడమే కాదు, మాయిశ్చరైజర్ పనిచేసి పొడిబారడాన్ని దూరం చేస్తుంది.

**మచ్చలు దూరం...** రెండు టేబుల్ స్పూన్ల చొప్పున గోధుమపిండి, పెరుగు తీసుకుని టేబుల్‌స్పూన్ తేనె, తగినన్ని నీళ్లు కలపాలి. ముఖాన్ని శుభ్రంగా ఈ మిశ్రమాన్ని రాసి పదినిమిషాలపాటు ఆరనివ్వాలి. ఆపై కడిగేస్తే సరి. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. ముఖంపై గీతలను తగ్గిస్తుంది. అలాగే రెండు టేబుల్ స్పూన్ల గోధుమ పిండికి చిటికెడు పసుపు, అయిదారుచుక్కల నిమ్మరసాన్ని కలిపి ముఖానికి అప్లై చేయాలి. పావుగంట తర్వాత కడగాలి. ఎండవల్ల లేదా వయసురీత్యావచ్చే మచ్చలు, పిగ్మెంటేషన్ మార్క్స్ దూరమవుతాయి. ముఖం మెరుస్తుంది.

## ఆత్మ విశ్వాసంతో ముందుకు !



కొంత మంది అమ్మాయిలు ఆఫీసులో బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తారు. ప్రాజెక్టు పనులన్నీ సమయానికి పూర్తి చేస్తారు. అయినా తను సరిగ్గా పనిచేయలేదని బాధపడుతారు. సామర్థ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నా అనుకుంటూ కుంగుబాటుకు గురవుతారు. ఇంపోస్టర్ సింద్రోమ్‌గా పిలిచే ఈ సమస్య నుంచి బయట పడటానికి నిపుణులేం చెబుతు న్నారంటే.. మనలోనే ఎక్కువ.. ఆఫీసు పనుల్లో తాము చెప్పినంత గొప్పగా ఫలితాలను చూపించలేక పోతు న్నామనే ఆలోచన, వేదన మగవారికన్నా మహిళల్లోనే ఎక్కువగా ఉంటుందట. ఈ సింద్రోమ్ ఉన్నా వారు సరిగ్గా పనిచేయక పోయినా ఎందుకు తమను ఉద్యోగం నుంచి తీయడం లేదు అని ఆలోచిస్తుంటా రట. అయితే ఇదేమీ మానసిక అనారోగ్యం కాదని, అందరిలోనూ అప్పుడప్పుడూ కనిపించే సమస్యే అంటున్నారు నిపుణులు. ఇటు వంటి ఆలోచనల నుంచి స్వీయ ప్రయత్నంతో తేలిగ్గానే బయట పడొచ్చంటున్నారు.

**గుర్తించలేక..** ఈ సమస్య ఉన్నవారు తమలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించ లేరు. ఇతరుల అంచనాలకు తగ్గట్లు జీవించలేకపోతున్నామనే వేదన కూడా వీరిని వెంటాడుతుంది. ఇందుకు ఆ మహిళలు పెరిగిన వాతావరణం, బాల్యంలో ఎదుర్కొన్న అనుభవాలు కూడా కారణం కావొచ్చు అంటున్నారు మానసిక నిపుణులు. అలాగే పని చేసే చోట లింగవివక్ష, ఆడవాళ్లు ఎక్కువ పనిచేయలేరంటూ తక్కువ బాధ్యతలు అప్పజెప్పడం వంటివీ వారిలో ఇంపోస్టర్ సింద్రోమ్‌కు దారి తీస్తాయట.

**బయట పడొచ్చు....** మనల్ని ప్రభావితం చేస్తున్న భావోద్వేగాలను ముందుగా గుర్తించాలి. గతంలో సాధించిన విజయాలను వరసగా పుస్తకంగా రాయడం ద్వారా అది మన 'పరఫార్మెన్స్ ట్రీ'గా మారుతుంది. అప్పుడప్పుడు దాన్ని పునఃపరిశీలన చేస్తుంటే ఆ విజయాలన్నీ మన ప్రత్యేకతను గుర్తుచేస్తుంటాయి. స్వీయ ప్రశంస నేర్చుకుంటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు. అలాగే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ధ్యానం యోగా వంటివి చేస్తే క్రమంగా ఈ సమస్యను దూరంగా ఉండొచ్చు.

## జీవన సూత్రాలు పాటిస్తే..



యవ్వనంలోలా ఉండాలని ఏ మహిళకు ఉండదు చెప్పండి. కానీ కొంతమంది ఏళ్లు గడిచినా చిన్న వాళ్లలా కనిపిస్తే.. కొందరినేమో త్వరగా వృద్ధాప్యం పలకరి స్తుంది. ఇది వారి వంశ పారంపర్యమేమో అను కుంటాం. కానీ కొన్ని జీవన సూత్రాలు పాటిస్తే ఎవరైనా వయసును తగ్గించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

**చన్నీటి స్నానం :** సీజన్ ఏదైనాచల్లటి నీళ్లతో స్నానం చేస్తే వచ్చే లాభాలు అనేకం. ఇది మెటబాలిజాన్ని పెంచటమే కాదు. రక్త ప్రసర ణనూ వృద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

**ఉపవాసం..** కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉపవాసం ఉంటూనే ఉంటాం. వారంలో ఒక రోజు తప్పనిసరి చేసుకోండి. జీర్ణవ్యవస్థకు ఇలా అప్పుడప్పుడే విశ్రాంతినిస్తే.. చర్మంలో కొత్త కణాల వృద్ధి జరుగుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలూ త్వరగా ఏర్పడవు. అలానే మైండ్‌ఫుల్ ఈటింగ్.. అంటే తినే ప్రతి ముద్దనీ ఆస్వాదిస్తూ తినాలి. ఇదీ మనల్ని నిత్యయవ్వనంగా ఉంచుతుంది.

**కళలతో..** మీకు డ్యాన్స్ చేసే అలవాటు ఉందా లేదా సంగీత వాద్యా లేమైనా వాయించ గలరా? లేదంటే నేర్చుకోండి. ఎందుకంటే క్రమం తప్పకుండా నాట్యం చేసేవాళ్లు శారీరకంగానే కాదు.. మానసికంగానూ ఫిట్‌గా తయారవు తారు. ఇక సంగీతంలో ప్రవేశం ఉంటే.. కాగ్నిటివ్ సామర్థ్యం పెరిగి, కొత్త ఆలోచనలకీ ఆస్కారం ఉంటుంది.

**కృతజ్ఞతలు చెప్పండి..** ఈ తీరు ఆశావహ దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఉత్సాహంగా ఉరకలు వేసే మనసు యవ్వనానికి ప్రతీకే కదా! పోనీ ఒత్తిడి లేకపోయినా ఆ ప్రభావం శరీరం మీద సానుకూల ప్రభావం చూపుతుంది. ఇదీ మేలు చేసేదే! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. కొత్త పరిచయాలు ఏర్పరచుకోండి. నలుగురితోనూ మంచి బంధాలు వారి ఆయుష్షు పెరగటమే కాదు. వృద్ధాప్యమూ త్వరగా దరిచేరదట.

## తాజాగా పల్లీ పౌడర్



ఇడ్లీ, వడ, దోశ ఇలా ఏ టిఫిన్ చేసినా.. అందులోకి పల్లీ పచ్చడి ఉండాల్సిందే. అప్పటికప్పుడు చట్నీ చేయాల్సిన పని లేకుండా రెడీమేడ్గా ఉందనుకోండి. సగం పని తగ్గినట్లే అందుకోసం ముందుగానే పౌడర్ చేసిపెట్టుకోవచ్చు. ఈ ఇన్‌స్టంట్ పల్లీ చట్నీ కోసం.. పల్లీలు అర కప్పు, పుట్నాలపప్పు ముప్పావు కప్పు, ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర చెంచా చొప్పున, కారం ముప్పావు చెంచా, ఉప్పు రుచికి తగినంత నూనె, ఎండుమిర్చి 8, వెల్లుల్లి తరుగు చెంచా, కరివేపాకు రెండు రెబ్బలు, రెండు రెబ్బలు, చింతపండు కడాయిలో పల్లీలను వేయించి పళ్లెంలోకి తీయాలి. తర్వాత పుట్నాలపప్పు, వెల్లుల్లి, ఆరు ఎండుమిర్చిలను వేయించాలి. అందులో చింతపండు వేసి.. తేమ పోయేదాకా వేయించి తీయాలి. అన్నీ చల్లారాక మిక్సీజార్లో వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి.. ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, మిగిలిన ఎండుమిర్చి, కరివేపాకు లను ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక, గ్రైండ్ చేసిన పొడి జతచేసి కలియ తిప్పుతూ ఒక నిమిషం వేయించాలి. చల్లారిన తర్వాత తడిలేని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. అవసర మైన ప్పుడు తగినంత పొడిని కాసిని వేడినీళ్లలో కలిపామంటే.. రోజూ చేయాల్సిన శ్రమ తప్పుతుంది. తాజా పల్లీ చట్నీ తిన్నట్టే ఉంటుంది.

## అడుగేద్దాము !





వేసవి సెలవుల్లో పిల్లలకు ఆడింది ఆట, పాడింది పాట. ఎండరా... బయటికి వెళ్లొద్దన్నా వినకుండా ఆటలంటూ పరుగెడతారు. ఇంట్లోనే ఉంచా లంటే ఈ ఆటను ప్రయత్నిం చండి. మూడు వరుసల్లో పాదాలు, చేతి గుర్తులు మార్చి మార్చి ఉంటాయి. వాటి ఆధారంగా పిల్లలు ముందుకు సాగాలి. ఒక పాదం ఉండాల్సిన చోట రెండు పాదాలు పెట్టినా... కుడిచేతి స్థానంలో ఎడమ చేతిని ఉంచినా... ఇలా ఎక్కడ తప్పుచేసినా ఆట ఆగిపోతుంది. మళ్లీ మొదటినుంచి రావాలి. ఒక్కరు లేదా ఎందరున్నా దీన్ని ఆడొచ్చు. పొరపాటు చేయకుండా ఎవరు ముగిస్తే వాళ్లే విజేత చార్ట్స్, కాగితాలతో సొంతంగా ప్రయత్నించొచ్చు. అంత ఓపిక లేదంటే ఆన్‌లైన్‌లో వెతికేయండి... హ్యాండ్ అండ్ ఫీట్ మ్యాట్లు, కటింగ్స్ రెడీగా దొరికే స్తున్నాయి. వాటినైనా తెప్పించుకోవచ్చు. టైంపాస్ గానే భావించకండి. ఇదో మంచి వ్యాయామం కూడా: బ్యాలెన్సింగ్, మోటా ర్స్కిల్స్, కళ్లు శరీరం సమన్వ యం, ఫోకస్ పెరగడం వంటి ఎన్నో ప్రయోజనాలూ ఉన్నాయి. ఈ సెలవుల్లో ప్రయత్నించి చూడండి.

## ఆత్మశుద్ధికి ప్రతీక

గణపతికి గుంజీలు తీయడం అనేది కేవలం ఒక సంప్రదాయం కాదు; అది మన అహంకారాన్ని తగ్గించి, భక్తిని పెంచే ఆధ్యాత్మిక సాధన. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని స్మరిస్తూ, వినయంతో గుంజీలు తీసినప్పుడు మన జీవితంలో జ్ఞానం, విజయం, శాంతి, శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. గుంజీలు అనగా రెండు చేతులను క్రాస్‌గా ఉంచి చెవులను పట్టుకుని కూర్చొని లేవడం. దీనిని కొన్నిచోట్ల 'తొప్పుకరణం' అని కూడా పిలుస్తారు. గణపతి ఆలయాలలో భక్తులు ఈ విధంగా గుంజీలు తీసి స్వామివారికి నమస్కరిస్తారు. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు; భక్తి, వినయం, పశ్చాత్తాపం మరియు ఆత్మశుద్ధికి ప్రతీకగా భావించబడుతుంది. గుంజీలు తీయడం ద్వారా భక్తుడు తన అహంకారాన్ని విడిచిపెట్టి భగవంతుని ముందు వినయంతో నిలుస్తాడు. 'తెలిసో తెలియకో చేసిన తప్పులను క్షమించండి' అనే భావనతో గణపతిని ప్రార్థిస్తాడు. ఈ ఆచారం మనలోని దుర్గుణాలను తొలగించి, సద్గుణాలను పెంపొందించాలనే సంకల్పాన్ని సూచిస్తుంది. నిజమైన పశ్చాత్తాపం, వినయం, శరణాగతి ఉన్నప్పుడు గణనాథుడు తన భక్తుల కోరికలను అనుగ్రహిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. ఒక పురాణ కథనం ప్రకారం, శ్రీ మహావిష్ణువు గణపతిని సరదాగా ఆటపట్టించడానికి ప్రయత్నించగా, గణపతి ఆయన సుదర్శన చక్రాన్ని మింగాడని చెబుతారు. దానిని తిరిగి పొందడానికి విష్ణువు తన రెండు చేతులను చెవుల వద్ద ఉంచి విచిత్రమైన హావభావాలు చేశాడు. వాటిని చూసి గణపతి నవ్వగా చక్రం బయటకు వచ్చింది. అప్పటి నుండి గణపతిని ప్రసన్నం చేయడానికి గుంజీలు తీయడం ఒక ఆచారంగా మారిందని విశ్వసిస్తారు. ఆధునిక పరిశోధనల ప్రకారం కూడా గుంజీలు తీయడం వల్ల శరీరానికి, మెదడుకు కొంత మేలు కలుగుతుందని భావిస్తారు. చెవులను పట్టుకుని కూర్చొని లేవడం వల్ల ఏకాగ్రత పెరగడం, రక్త ప్రసరణ మెరుగుపడటం, శారీరక చురుకుదనం పెరగడం వంటి ప్రయోజనాలు ఉండవచ్చని చెబుతారు. అందుకే దీనిని కొందరు "సూపర్ బ్రెయిన్ యోగా" అని కూడా పిలుస్తారు.

## తెర

## టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026' జ్యూరీ చైర్ పర్సన్‌గా ఇంద్రజ



మొదటి 5 మంది విజేతలకు బహుమతులు

మొదటి విజేతకు రూ.10 వేలు, రెండో విజేతకు రూ.7500, మూడో విజేతకు రూ.5 వేలు జూన్ 13వ తేదీ వరకు ఉచితంగా ఎంట్రీలను పంపే అవకాశం జూన్ 21న హైదరాబాద్ లో అవార్డ్స్ ప్రధానోత్సవంచిత్ర పరిశ్రమలో న్యూ యంగ్ టాలెంట్ ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఫెస్టివల్ కు భారీగా ఎంట్రీలు వస్తున్నట్లు ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ అవార్డుల కమిటీ జ్యూరీకి ఛైర్ పర్సన్ గా నటి ఇంద్రజను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. దాదాపు 30 కేటగిరీల్లో మొదటి ఐదుగురు విజేతలకు అవార్డ్స్ ఇసామని, మొదటి ముగ్గురు విజేతలకు అవార్డ్స్ తో పాటు నగదు బహుమతి కూడా అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు. కర్ణాటక, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలుగు వాళ్లు తమ షార్ట్ ఫిలింస్ పంపవచ్చని ఆయన అన్నారు. ఈ రోజు జరిగిన ప్రెస్ మీట్ లోటీఎఫ్ సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఇండస్ట్రీ మీద ఎన్నో ఆశలతో రోజూ కొత్త వారు వస్తున్నారు. వారికి తమ కంటెంట్ ను ఎలా ప్రదర్శించాలి, టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 జ్యూరీ ఛైర్ పర్సన్ నటి ఇంద్రజ మాట్లాడుతూ టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 నిర్వహణ ద్వారా కొత్త వాళ్లను ప్రోత్సహించేందుకు రామకృష్ణ గౌడ్ గొప్ప పని చేస్తున్నారు.

## 'ఓజీ టూర్' కాన్సర్ట్ మ్యాజికల్ అనుభూతిని అందించబోతోంది..



ప్రేక్షకులు అద్భుతమైన మ్యూవీ జిక్, డ్యాన్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన గ్రాండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఆస్వాదించబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్, ఏసీటీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓజీ టూర్ ఇండియా మెగా మ్యూజికల్ ఈవెంట్ జూన్ 13న హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్‌లో గ్రాండ్ గా జరగనుంది. సంగీత ప్రియులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించనున్న ఈ మ్యూజికల్ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ నిర్వాహకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో ఎస్.ఎస్. తమన్ మాట్లాడుతూ... ఓజీ సినిమా అప్రిషియేషన్ సెల బ్రేషన్‌ను కొనసాగిస్తూ 'ఓజీ టూర్ ఇండియా'ను నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌లో తొలిసారిగా ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉంది. అనిరుధ్ 'హుకుం టూర్' ఎంతటి ప్రభావాన్ని చూపిందో, మనకు 'ఓజీ టూర్' కూడా అంతటి బలాన్ని ఇచ్చింది. ఎక్కడ చూసినా 'ఓజీ' మ్యూజిక్ వినిపిస్తోంది. ఆ సెలబ్రేషన్‌ను ఒక ఐకాన్‌గా తీసుకుని ఈ కాన్సర్ట్‌ను రూపొందించాం. ఏసీటీసీ ఈవెంట్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సినిమా వేడుకల్లో మీ అందరినీ కలుస్తూనే ఉంటాను. కానీ తొలిసారి ఇలా వ్యక్తిగతంగా 'ఓజీ టూర్ ఇండియా' ద్వారా కలవడం చాలా ఆనందంగా ఉంది. జూన్ 13న హైదరాబాద్‌లో, జూలై 11న బెంగళూరులో, ఆగస్టు 15న చెన్నైలో, సెప్టెంబర్ 25న వైజాగ్‌లో ఈవెంట్లు నిర్వహిస్తున్నాం. నేను చేసే ప్రతి షో ద్వారా వచ్చే రెమ్యునరేషన్‌ను ఎప్పుడూ చారిటీకి అందిస్తుంటాను. ఈ షోకు సంబంధించిన వివరాలను కూడా కార్యక్రమం పూర్తైన తర్వాత వెల్లడిస్తాను. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నేను చేసిన సూపర్ హిట్ పాటలను ఎంపిక చేసి, అద్భుతమైన కొరియోగ్రఫీతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఈ ఈవెంట్‌లో అందరి హీరోల పాటలు ఉంటాయి. ఇలాంటి లైవ్ షోలు చేయడం వల్ల ప్రేక్షకులతో ప్రత్యక్ష అనుబంధం పెరుగుతుంది. ఏ పాటలకు ఎలా స్పందిస్తు న్నారో తెలుసుకోవడం భవిష్యత్ ప్రాజెక్టులకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కాన్సర్ట్ పూర్తిగా మ్యాజికల్‌గా ఉండబోతోంది. మా ప్లేలిస్ట్ చూస్తుంటే మాకే ఎనర్జీ వస్తోంది. ఫైర్‌వర్క్స్, ఎల్ఈడీ స్క్రీన్స్, 3డీ ఎఫెక్ట్స్, డాన్స్ పెర్ఫార్మెన్స్‌లు అన్నీ అద్భుతంగా ఉంటాయి.

## 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' టీజర్, ట్రైలర్ లాంచ్



తెలుగు సిల్వర్ స్క్రీన్‌పైకి బ్యూటీఫుల్ యూత్ ఫుల్ లవ్ స్టోరీ రాబోతోంది. మోహన్ సిద్ధి, మహాన్, శృతి శంకర్ హీరోహీరోయిన్లుగా, రమేష్ చెరుకూరు దర్శకత్వంలో, సావిత్రమ్మ నిర్మాణంలో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ వి. సాంబశివరావు మరియు వేణు గోపాల చారి సారథ్యం లో తెరకెక్కుతున్న చిత్రం 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాతలు, నటుల సమక్షంలో 'సిద్ధుగాడి లవ్ స్టోరీ చిత్ర టీజర్, ట్రైలర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ప్రసాద్ ల్యాబ్‌లోజరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు ఎ. కోదండరామిరెడ్డి, బి. గోపాల్, దామోదర ప్రసాద్, తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, దర్శకులు వి. సముద్ర, రామ్ ప్రసాద్, నటుడునిర్మాత అశోక్ కుమార్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, రాజేందర్ ప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ డైలాగ్‌లో వచ్చిన సిద్ధు.. సిద్ధార్థ్ రాయ్ ఎంతగా ప్రేక్షకులకు కనెక్ట్ అయిందో, అదే విధంగా ఈ సినిమా కూడా ప్రేక్షకులకు బాగా చేరువ అవుతుందని నమ్ముతున్నాను తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన సినీ పెద్దలందరికీ ధన్యవాదాలు. ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఎంతో మంది ఎన్ఆర్ఐలు సినీ పరిశ్రమలోకి వస్తున్నారు. అలాంటి వారిలో రమేష్ గారు కూడా ఒకరు. దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ, ఇలాంటి మంచి ప్రయత్నాలు తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొందాలి. నిర్మాత ఇంకా ఎన్నో సినిమాలు నిర్మించాలని కోరుకుంటున్నాను

## 'స్లమ్ డాగ్' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విజయ్ సేతుపతి



'స్లమ్ డాగ్' లో పవర్ ఫుల్, యూనిక్ విజయ్ సేతుపతిని చూస్తారు. జెన్జీ యూత్ ఈ సినిమాని ఫ్యామిలీతో కలసి చూడాలని కోరుతున్నాను. డైరెక్టర్ పూరి జగన్నాథ్‌విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా 'స్లమ్ డాగ్' పవర్‌ఫుల్ టీజర్ లాంచ్‌డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రకటించినప్పటి నుంచే ఈ చిత్రం మంచి బజ్ నెలకొంది. ఖిఖిఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నేనెందుకు వదులుతానుఖి అనే పవర్ ఫుల్ డైలాగ్ తో మొదలైన టీజర్ అదిరిపోయింది. విభిన్నమైన పాత్రలు, తనదైన శైలిలో కథలను ఆవిష్కరించడంలో పేరుగాంచిన పూరి జగన్నాథ్, ఈసారి కూడా విజయ్ సేతుపతి కోసం ఒక ప్రత్యేకమైన పాత్రను సృష్టించారు. విజయ్ సేతుపతి దృష్టి లోపం ఉన్న బిచ్చగాడి పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. అదే సమయంలో ఆ పాత్రలోని హీరోయిజాన్ని కూడా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. సాంకేతికంగా కూడా టీజర్ ఆకట్టుకుం టుంది. సినిమాటోగ్రాఫర్ సామ్ కె. నాయుడు చిత్రానికి రా, గ్రిటీ విజువల్ టెక్స్చర్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌ను అందించారు. 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్డ్ టీజర్ సినిమా వరల్డ్ ని, ఆసక్తికరమైన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా, కథలోని ప్రధాన మిస్టరీని తెలుసుకోవాలనే ఉత్కంఠను ప్రేక్షకుల్లో పెంచడంలో విజయవంతమైంది.

## 'పెద్ది' థ్యాంక్ యూ మీట్‌లో చిత్ర బృందం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది' బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... ప్రేక్షకులు, అభిమానులు, మీడియా మిత్రులు అందరికీ మనస్ఫూర్తిగా థ్యాంక్యూ చెప్పడానికి ఇక్కడికి వచ్చాను. ఇష్టపడి, ప్రేమిస్తూ ఒక పని చేస్తూ ఇంకా చెప్పాలంటే నాకు తెలిసిన పని చేస్తూ ఇంత ప్రేమను పొందడం సర్ప్రైజింగ్‌గా వుంది. ఇది ఎవరో పుష్ చేస్తే చేసిన సినిమా కాదు. బుచ్చిబాబు చెప్పిన కథను నమ్మి ఈ సినిమా చేసినందుకు నాకు ఎంతో సంతృప్తిగా ఉంది. జగపతిబాబు మాట్లాడుతూ... పెద్ది ఆడాడు... పోరాడాడు... గెలిచాడు. రిలీజ్ అయిన తర్వాత కూడా మళ్లీ పోరాడాల్సి వచ్చింది. మళ్లీ గెలిచాడు. 300 కోట్లు, 400 కోట్లు అనేది పక్కన పెడితే, ఈ సినిమా ఎంత పెద్ద విజయం అనేది 300 రూపాయల టికెట్ కొన్న ప్రేక్ష కుడే దాన్ని నిర్ణయిస్తాడు. ప్రేక్షకుల చేతిలో అంత పవర్ ఉంది. డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ... ఈ సినిమాను ఇంత ఘన విజయం చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఒక మంచి కథను చెప్పాలనే ఉద్దేశంతో నేను, చరణ్ మీ ముందుకు వచ్చాం. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ... రామ్‌చరణ్‌కి, సతీష్‌కి, అందరికీ పేరుపేరునా నమస్కారం. ప్రసాద్ మల్టీప్లెక్స్‌లోపెద్ది రెండోసారి చూసినప్పుడు మొదటిసారి కలిగిన భావోద్వేగాలే మళ్లీ కలిగాయి.

## 'ఒక కోర్టు కేస్' జూలై 17న విడుదల



'ఒక కోర్టు కేస్' జూలై 17న విడుదల ప్రేమ, విరహం, మోసం వంటి అంశాల చుట్టూ ఇప్పటికే టాలీవుడ్‌లో ఎన్నో సినిమాలు వచ్చినప్పటికీ, ప్రేమలో మోసపోయిన ఓ యువకుడు తనకు జరిగిన అన్యాయానికి న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించడం అనే వినూత్న కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'ఒక కోర్టు కేస్'.ఓపెన్ ఐస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగేష్ పూడి, ముకేష్ పూడి సమర్పణలో, అండమాన్‌కు చెందిన యువ దర్శకుడు గణేష్ పూడి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ స్వయంగా దర్శకత్వం వహించి నిర్మించిన ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ హీరో శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం యువతకు దగ్గరగా ఉండే అంశాన్ని దర్శకుడు కొత్త కోణంలో చూపించే ప్రయత్నం చేశారు. ప్రేమలో జరిగే సంఘటనలను లీగల్ డ్రామాగా మలచడం ఆసక్తికరంగా అనిపించింది. టీజర్‌లో ప్రతి షాట్ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఉంది. గణేష్ పూడి, చిత్ర యూనిట్‌కు నా అభినందనలు. సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటు న్నాను" అని అన్నారు. దర్శకుడు, నిర్మాత గణేష్ పూడి మాట్లాడుతూ.. మా సినిమా టీజర్‌ను శ్రీకాంత్ గారు విడుదల చేసి, చిత్ర బృందాన్ని అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి ప్రేమికుడికి తన ప్రేమ కోసం పోరాడే హక్కు ఉంది అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన టీజర్‌కు ఇప్పటికే అద్భుతమైన స్పందన లభిస్తోంది.

# ముక్కోణపు సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం



తిలక్, రుతురాజ్ సూపర్

**దంబుల్లా:** శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం చేసింది. ఉత్కంఠ భరిత పోరులో ఆతిథ్య శ్రీలంక-ఎపై 8 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది. 49వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌లో శ్రీలంకను కట్టడి చేశాడు. రెండు వికెట్లతో పాటు ఓ రనౌట్‌తో గెలుపును భారత్ వైపు మరల్చాడు. ఒత్తిడిలోనూ అద్భుత లైన్ లండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్ కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చాడు.

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ ఆరంభంలో తడబడింది. స్టార్టింగ్‌లో వరుసగా బౌండరీలు బాదుతూ ఊపుమీద కనిపించిన వైభవ్.. కేవలం 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(2) కూడా నిరాశపరచడంతో భారత్-ఎ 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ప్రియాన్స్ ఆర్య(32 బంతుల్లో 32) క్రీజ్‌లో ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. బంతికో పరుగు చొప్పు 32 రన్స్ చేశాడు. కానీ దురదృష్టవశాత్తూ 13వ ఓవర్ వద్ద రనౌట్ కావడంతో భారత్ 69 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

**కెప్టెన్ తిలక్, రుతురాజ్ క్లాస్**

ఈ దశలో రుతురాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 101; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కెప్టెన్ తిలక్ వర్మ(97 బంతుల్లో 60; 2 ఫోర్లు, ఓ సిక్స్) జతకూడిన తర్వాత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నారు. పిచ్ కండిషన్స్ అర్థం చేసుకుంటూ మొదట్లో కాస్త నెమ్మదిగా బ్యాటింగ్ స్టార్ట్ చేసిన రుతురాజ్.. ఆ తర్వాత కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను బిల్డ్ చేశాడు. స్కోరును చూస్తుండగానే 100, 150, 200 దాటించారు. శ్రీలంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ రుతురాజ్ సెంచరీ పూర్తి చేశాడు. నాలుగో వికెట్‌కు 150 పరుగుల భారీ భాగస్వామ్యం అందించి అవుటయ్యాడు. కాసేపటికే అద్భుతమైన హాఫ్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కూడా మొహమ్మద్ షిరాజ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయి వెనుదిరిగాడు.

**స్లాగ్ ఓవర్లలో సూర్యాంశ్, బదోనీ మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో ఆయూష్ బదోనీ(18 బంతుల్లో 24), సూర్యాంశ్ షెడ్జ్(14 బంతుల్లో 26) లంక బౌలర్లపై బ్యాట్ ఝులిపించారు. ఈ ఇద్దరూ వేగంగా ఆడుతూ స్కోరు బోర్డును పరిగెత్తించారు. దీంతో భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్లు కోల్పోయి 277 పరుగులు చేసింది.

**ఆరంభంలో లంకేయుల అదుర్స్**

278పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన శ్రీలంక-ఏ48.5ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(45), ఫస్ట్ డౌన్ సదీర సమరవిక్రమ(46) రాణించారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగే(72 బంతుల్లో 74) ధాటిగా ఆడుతూ లంకకు గెలుపు ఆశలు కలిగించారు. ఈ దశలో కంబోజ్ అద్భుత బంతితో సహన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి చేయడంతో లంక మిడిలార్డర్ పూర్తిగా చేతులెత్తేసింది. వనుజా సహన్ మెరుపులతో లంక విజయానికి చేరువయింది.

చివరి రెండు ఓవర్లలో పది పరుగులు చేయాల్సిన దశలో అర్షద్ ఖాన్ మ్యాచ్ స్వరూపాన్నే పూర్తిగా మార్చేశాడు. ఒత్తిడిలోనూ అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్.. ఆ ఓవర్లో కేవలం ఒక్కటంటే ఒక్క పరుగు మాత్రమే ఇచ్చి.. 2 కీలక వికెట్లు పడగొట్టడంతో పాటు ఒక రనౌట్ చేసి లంక పతనాన్ని శాసించాడు. దీంతో భారత్-ఎ జట్టు 8 పరుగుల తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది.

# 24 యేళ్ల నిరీక్షణకు తెరపడేనా?

**హాట్ ఫేవరెట్లలో ఒకటిగా బ్రెజిల్ *గ్రూప్-సిలో గట్టి పోటీ *ప్రమాదకర జట్టుగా మొరాకో**

*ప్రపంచం మొత్తం ఎదురుచూస్తున్న మెగా ఈవెంట్ రానే వచ్చింది. రేపటి నుంచి సాకర్ ప్రపంచకప్ ఆరంభం కానుంది. ఆడుతున్నది 48 జట్లే అయినా... మిలియన్ల మంది చూపంతా దీనిపైనే. జూలై 19 వరకు ఈ సాకర్ సంబరం ఫుట్‌బాల్ అభిమానులను ఉర్రూతలూగించనుంది. ఫిఫా ప్రపంచకప్‌లో పలు మేటి జట్లున్నా అందరి చూపు సాంబా టీమ్‌పైనే.అత్యధికంగా 5సార్లు సాకర్ ప్రపంచకప్‌ను బ్రెజిల్ అందుకుంది. చివరిసారి 2002లో ప్రపంచకప్ విజేతగా నిలిచింది. దాదాపు 24 ఏళ్లుగా బ్రెజిల్ ను ట్రోఫీ ఊరిస్తోంది. ఈసారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని సాంబా టీమ్ ఫోకస్ పెట్టింది.*



(వార్త క్రీడా విభాగం)

ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-సిలో బ్రెజిల్ జట్టు పోటీపడుతోంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆసక్తికర గ్రూపుల్లో ఇది ఒకటి. అయిదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ ఇందులో ఉండడమేకారణం. గ్రూస్-సిలోని మిగతా జట్లు మొరాకో, హైతి, స్కాట్లాండ్. 2022లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన మొరాకోను తక్కువ అంచనా వేయలేం. కూనలు స్కాట్లాండ్, హైతి కూడా తమదైన రోజున సంచలనాలు సృష్టించగలవు.

ఫిఫా ర్యాంకింగ్స్ ఆరో స్థానంలో ఉన్న బ్రెజిల్.. గ్రూపులో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. అయితే ఈసారి ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో బ్రెజిల్ కష్టపడాల్సి వచ్చింది. మెగా టోర్నీకి అర్హత సాధిస్తుందా లేదా అన్న అనుమానాల నేపథ్యంలో.. కోచ్ మార్పు ఆ జట్టుకు ఎంతో మేలు చేసింది. కార్లో అన్సెలోటి బాధ్యతలు స్వీకరించాక.. ఆఖరి నాలుగు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో మూడు గెలిచిన బ్రెజిల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. జట్టు ప్రపంచకప్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేస్తుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

**స్టార్ అట్రాక్షన్‌గా నెయ్‌మార్**

మార్కినోస్ సారథ్యంలోని బ్రెజిల్ గ్రూపులో అగ్రస్థానంలో నిలిచేఅవకాశాలు మెండుగా ఉన్నాయి. బలమైన జట్టుగా ఎదిగిన మొరాకో నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. హైతి, స్కాట్లాండ్‌ల నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాకపోవచ్చు. అయితే టోర్నీ ముంగిట స్టార్ ఆటగాడు నెయ్‌మార్ గాయపడడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. తొలి కొన్ని మ్యాచ్‌లకు నెయ్‌మార్ అందుబాటులో ఉండడం లేదు. అయినా బ్రెజిల్ యువ ఆటగాళ్లతో కళకళలాడుతోంది. విన్సియస్ జూనియర్, మార్కినోస్, నెయ్‌మార్, రాఫినా, ఎండ్రిక్, మార్టినెలిబ్రెజిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. ప్రస్తుత ప్రపంచకప్‌లో సాంబా జట్టు ఎక్కువ మంది యువ ఆటగాళ్లతో బరిలో దిగుతున్నా.. అభిమానుల ఆశలు మాత్రం వెటరన్ స్టార్ నెయ్‌మార్‌పైనే ఉన్నాయి.

**మొరాకో నుంచి అసలు పోటీ**

మొరాకో ప్రమాదకర జట్టుగా ఎదిగింది. 2018 వరకు నాలుగుసార్లు మాత్రమే ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన మొరాకో... 2022లో అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన ప్రదర్శనతో ఆశ్చర్యంలో ముంచెత్తింది. క్వార్టర్‌ఫైనల్లో బలమైన పోర్చుగల్‌కు షాకిస్తూ.. సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫిఫా ప్రపంచకప్‌లో సెమీస్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈసారి కూడా క్వాలిఫికేషన్‌లో మెరుగైన ప్రదర్శన చేసి, గ్రూప్ విజేతగా నిలిచిన మొరాకోపై మంచి అంచనాలే ఉన్నాయి. మొరాకో జట్టులో అష్రాఫ్ హకిమి, బ్రహీమ్ దియాజ్, సొఫ్యాన్ అమ్రాబాత్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు.

## ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20లకు టీమిండియాలో కీలక మార్పు

# సిరాజ్ ఔట్, ప్రసిద్ధ్ కృష్ణ ఇన్




**ముంబై:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ కోసం ప్రకటించిన టీమిండియా జట్టులో కీలక మార్పు జరిగింది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి కల్పించింది. అతని స్థానంలో టీ20లకు ప్రసిద్ధ్ కృష్ణను ఎంపిక చేసింది. సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్ ముందున్న నేపథ్యంలో సిరాజ్‌పై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనికి విశ్రాంతి కల్పించినట్లు బీసీసీఐ వెల్లడించింది. రెండు సిరీస్‌లకు సిరాజ్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణ ఆడనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించనున్నారు.యువఆటగాళ్లకు అవకాశం దక్కింది.

**షెడ్యూల్ విడుదల**

ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ కూడా విడుదలైంది. జూన్ 26న ఐర్లాండ్‌తో మొదటి టీ20 మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత జూన్ 28న రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. ఐర్లాండ్ పర్యటన ముగిసిన వెంటనే జూలై 1 నుంచి ఇంగ్లాండ్‌తో అసలైన సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్ జట్టుతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది.

**భారత పూర్తి జట్టు**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ.

# ఆసీస్ ఓపెన్ టైటిల్‌పై సింధూ ఫోకస్



**సిడ్నీ:** ఈ సీజన్లో అయిదు నెలలు పూర్తయినా భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధూ టైటిల్ సాధించడంలో విఫలమవుతోంది. సింగపూర్, థాయ్‌లాండ్ ఓపెన్లలో క్వార్టర్స్‌లో ఓడిన సింధు.. ఇండోనేసియా ఓపెన్లో రెండో రౌండ్లో ఇంటిముఖం పట్టింది. దీంతో మంగళవారం ప్రారంభమైన ఆసీస్ ఓపెన్లో మరోసారి టైటిల్ కోసం సింధు బరిలో దిగుతోంది.

ఈ టోర్నీలో ఆమె ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో లూసియా కాస్టిల్లో (పెరూ)తో సింధూ తలపడనుంది. మరో తొలి రౌండ్ పోరులో హాన్ గ్జియాన్ (చైనా)తో ఇషారాణి బారువా పోటీపడనుంది. చియాన్ (చైనీస్ తైపీ)తో తన్వి శర్మ.. ఒకుహార (జపాన్)తో అన్మోల్.. వాంగ్ లింగ్ (మలేసియా)తో ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో మో జాకీ (ఇండోనేసియా)తో ప్రణయ్, జస్టిన్ హో (మలేసియా)తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ మ్యాచ్‌లు ఆడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అర్జున్, అచ్యుతాదిత్య రావుఅర్జున్ రెడ్డి, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ ఈ టోర్నీలో తలపడతాయి.

# ఒత్తిడిలోనే పసిడి, వెండి ఫ్యూచర్లు

## స్పాట్‌గోల్డ్ ఔన్స్‌కు 4300 డాలర్లు



**న్యూఢిల్లీ,జూన్ 9:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించే అవకాశాలను పెంచుతున్న నేపథ్యంలో సమీప కాలంలో బంగారం ధరలు ఒత్తిడిలోనే కొనసాగే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ అంచనావేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గినప్పటికీ, పెట్టుబడిదారులు ఇప్పుడు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు మరియు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశంపై దృష్టి సారించారు. మంగళవారం స్పాట్ గోల్డ్ ఔన్సుకు 4,300 డాలర్లకు పైగా స్థిరంగా కొనసాగింది. ముడి చమురు ధరలు తగ్గడం, ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణ ఆందోళనలు సడలడం బంగారానికి మద్దతు ఇచ్చాయి. అమెరికా కార్మిక మార్కెట్ బలంగా ఉండటంతో డాలర్ మరియు ట్రెజరీ బాండ్ యీల్డ్స్ పెరిగాయి. ఫెడ్ వడ్డీ రేట్లను ఎక్కువ కాలం ఉన్నత స్థాయిలో కొనసాగించే అవకాశాలపై అంచనాలు బలపడ్డాయి. ప్రస్తుతం మార్కెట్లు డిసెంబర్‌లో వడ్డీ రేటు పెంపుకు సుమారు 70 శాతం అవకాశాన్ని అంచనా వేస్తున్నాయి.కోటక్ సెక్యూరిటీస్ ప్రకారం, ఎంసీఎక్స్ గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్‌కు రూ.1,53,649 వద్ద కీలక మద్దతు ఉంది. ఈ స్థాయి కంటే దిగువకు పడితే ధరలు రూ.1,53,092 వరకు, ఆ తర్వాత రూ.1,51,290 వరకు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, పైస్థాయిలో రూ.1,55,451 వద్ద ప్రతిఘటన ఉండగా,తదుపరి ప్రతిఘటన స్థాయిలు రూ.1,56,008 మరియు రూ.1,57,810గా ఉన్నాయి. స్పాట్ గోల్డ్‌కు ఔన్సుకు 4,296.5 డాలర్లు, 4,274.8 డాలర్లు, 4,204.8 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 4,366.5 డాలర్లు, 4,388.2 డాలర్లు, 4,458.2 డాలర్ల వద్ద ప్రతిఘటన కనిపిస్తుందని తెలిపింది. వెండి ధరలు మెరుగైన మార్కెట్ సెంటిమెంట్ కారణంగా ఔన్సుకు 68 డాలర్లకు పైగా చేరాయి. మద్దతు స్థాయిలు బలహీనపడితే వెండి ధరలు కూడా ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ హెచ్చరించింది. స్పాట్ సిల్వర్‌కు 67.18 డాలర్లు, 66.43 డాలర్లు, 64.01 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 69.60 డాలర్లు, 70.35 డాలర్లు, 72.77 డాలర్ల వద్ద ప్రతిఘటన ఉండొచ్చనిఅంచనావేసింది. ఎంసీఎక్స్ సిల్వర్ జూలై ఫ్యూచర్స్‌కు రూ.2,42,937, రూ.2,40,928, రూ.2,34,422 వద్ద మద్దతు స్థాయిలు ఉండగా, రూ.2,49,442, రూ.2,51,452, రూ.2,57,958 వద్ద ప్రతిఘటన స్థాయిలున్నట్లు అంచనావేసింది.

## ధరల పెంపుతోనే ఆయిల్ కంపెనీలకు నష్టాల రికవరీ

**న్యూఢిల్లీ, జూన్ 9:**పశ్చిమాసియా యుద్ధంతో ఏర్పడిన ఇంధన కొరత వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఈ 78 రోజుల్లో ఎదురయిన రూ.1.23 లక్షలకోట్ల భర్తీకోసం కేంద్రం పెట్రోలు,డీజిల్‌పై సుంకాలను రద్దుచేసింది. కస్టమర్లపై ఎక్కువ భారం పడకుండా ముందు ఆయిల్‌కంపెనీలకు ఈ సుంకాల రద్దుతో కొంతమేర నష్టం రికవరీచేసిందనినిపుణులు పేర్కొంటున్నారు. గతనెల చివరినాటి వరకూ ఉన్న డేటానుచూస్తే ఆయిల్‌మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.600 కోట్లమేర నష్టం భరిస్తున్నట్లు తేలింది. నాలుగుసార్లు పెట్రోలు, డీజిల్‌ధరలు పెంచడంవల్ల ఈ నష్టం కొంతమేర భర్తీ అయిందని తెలుస్తోంది. పెట్రోడీజిల్ ధరలను పెంచడంవల్లనే ఎదురవుతున్న రూ.1.23లక్షల కోట్లనష్టాన్ని భర్తీచేయగలిగామని పెట్రోలియం కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. ఇంధన ధరలు పెంపునకు ముందు రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఓఎంసిలు ఎదుర్కొన్నట్లు తేలింది. మేచివరివారంలోనే ఇంధన ధరలను లీటరుకు రూ.2.7 చొప్పున పెంచింది. ఈచర్య మార్కెకటింగ్‌కంపెనీల నష్టాలను 44శాతం మేర తగ్గించగలిగింది. నాలుగుదశలుగా మే 15,19,23,25 తేదీల్లో పెట్రోలు డీజిల్‌లపై ధరలు పెంచారు.హార్ముజ్‌లో సమస్యలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత్ ఇంధన సరఫరాకు ఎలాంటి ఇబ్బందులువేలని సుజాత శర్మ వెల్లడించారు. ఫిబ్రవరి8 నుంచి ప్రారంభం అయిన పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్ల భారత్‌లో వివిధ రంగాలపై ప్రభావం పడిందన్నారు. అయితేప్రభుత్వ చర్యలవల్ల నష్టాల భారం రోజుకు రూ.750క ఓట్లకు తగ్గాయని అన్నారు. ఇక గ్యాస్‌సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరాఘాటంగా పెంచాలని ఆయిల్‌కంపెనీలకకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

# టెక్నాలజీ,బ్యాంకింగ్ షేర్ల మద్దతు

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబై, జూన్ 9:** అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరల తగ్గుదల, బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్లతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తిరిగి లాభాల బాట పట్టాయి.ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 93 డాలర్ల దిగువకు చేరింది. దీంతో ద్రవ్యోల్బణం, భారత దిగుమతి వ్యయాలపై ఉన్న ఆందోళనలు తగ్గాయి.ప్రపంచ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు కోలుకోవడంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ మెరుగుపడింది. మరోవైపు, విదేశీ కరెన్సీ నిధుల సమీకరణకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫారెక్స్ స్వాప్ కార్యాచరణ బ్యాంకింగ్ రంగానికి ఊతమివ్వడంతోబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

రోజంతా లాభాల్లో ట్రేడైన మార్కెట్లో సెన్సెక్స్ 394.50 పాయింట్లు పెరిగి 73,918.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 119.10 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద స్థిరపడింది. గత రెండు సెషన్లలో నిఫ్టీ 1.25 శాతం క్షీణించింది. నిఫ్టీ పెరుగుదలకు ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.11, ఐసీఐసీఐ బ్యాంక్ 1.98, యాక్సిస్ బ్యాంక్ 1.92 షేర్లు మద్దతు ఇచ్చాయి.బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.24 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.39 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్‌ఈలో 2,782 షేర్లు లాభపడగా, 1,423 షేర్లు నష్టపోయాయి. 207 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ డాలర్‌కు 95.41 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధరలు 0.01 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,789కు చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.558 శాతానికి చేరింది.బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.74 డాలర్లు లేదా 1.85 శాతం తగ్గి 92.51 డాలర్లకు చేరింది.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 5.25 పెరిగిది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీలో 0.30 వాటా కొనుగోలు చేసింది. యాపిల్ ఐఒఎస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు ప్రకటించడంతో రెడింగ్టన్ షేరు 4.69 పెరిగింది.ఆయే ఫైనాన్స్ 15మిలియన్ డాలర్ల వరకు ఎన్సీడీల ద్వారా నిధుల సమీకరణకు అనుమతి ఇవ్వడంతో షేరు 8.68 ఎగిసింది. జేఎన్‌కే ఇండియా యూఏఈ సంస్థ నుంచి రూ.100300 కోట్ల మధ్య విలువైన భారీ ఆర్డర్ పొందడంతో 15.70 లాభపడింది.

గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కర్ణాటకలో లయోసెల్ ఫైబర్ సామర్థ్య విస్తరణకు రూ.3,094 కోట్ల పెట్టుబడి ప్రకటించడంతో 1.49పెరిగింది. అవాంటెల్‌కు డీఆర్డీవో నుంచి రూ.9.94 కోట్ల ఆర్డర్ లభించడంతో 4.35 పెరిగింది.

వీఏ టెక్ వాబాగ్ యూఏఈలో అజ్మాన్ సెవేజ్ బయోరిఫైనరీ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకోవడంతో 2.72లాభపడింది. హెక్సాగన్ న్యూట్రిషన్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. జూన్ 9 సాయంత్రం 4:25 గంటల వరకు ఈ ఇష్యూకు 52.89 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. మొత్తం 2.16 కోట్ల షేర్లకు గాను 114.24 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. షేరు ధర బ్యాండ్‌ను రూ.4245 మధ్య నిర్ణయించారు.

## భారత్ ఆర్థికవృద్ధి 6.4శాతం మాత్రమే: ఫిచ్ రేటింగ్స్

**ముంబయి,జూన్ 9:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఫిచ్ రేటింగ్స్ భారత్ జిడిపి వృద్ధిరేటును తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.7 నుంచి 6.4శాతంగా మాత్రమే ఉంటుందని తెలిపింది.అమెరికా ఇరాన్ యుద్ధం ఆర్థికవ్యవస్థను కొంతమేర ఒత్తిడికి గురిచేసిందని, సెప్టెంబరు, డిసెంబరు త్రైమాసికాల్లో ఆర్థికవృద్ధి మందగమనంతో ఉందని ఫిచ్ వెల్లడించింది. 2027 ఆర్థికసంవత్సరంలో కూడా 7.4శాతంనుంచి తగ్గుతుందని అంచనావేసింది.ధరల పెరుగుదల,వాస్తవరాబడుల్లో కోత, వినియోగదారుల వ్యయంలో క్షీణత వంటివి కొంతకారణం అయ్యాయి. జిడిపి వృద్ధి 2027లో 6.4శాతంగా మాత్రమే ఉంటుందని ఫిచ్ అంచనావేసింది. దేశీయ డిమాండ్ ఒక్కటే వృద్ధికి ఆస్కారంగా నిలిచింది. దిగుమతులు తగ్గినట్లయితే ఆర్థికవృద్ధి పెరుగుదలకు కొంత దోహదంచేసినట్లవుతుంది. బాహ్య డిమాండ్‌నుంచి వచ్చే వృద్ధికూడా కొంతమేర జిడిపికి కీలకం అవుతుందని ఫిచ్ రేటింగ్స్ తన జూన్ గ్లోబల్ ఎకనమిక్ ఔట్‌లుక్‌లో వెల్లడించింది.గతవారంలో ఆర్‌బిఐ కూడా భారత్ వృద్ధిరేటును ప్రస్తుత ఆర్తిక సంవత్సరంలో 6.6శాతంగ ఆమాత్రమే ఉంటుందని వెల్లడించింది. ద్రవ్యోల్బణం కూడా 5.1శాతంగా పెరుగుతుందని తెలిపిన సంగతి తెలిసిందే.కేవలం పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్లనే ఇంధన ధరలు ఇటీవలి కాలంలో 4నుంచి 5శాతంవరకూ పెరిగాయని,దీనివల్ల ధరల పెరుగుదల ఆర్థిక వృద్ధికి బ్రేకులు వేసినట్లు అభిప్రాయపడింది.వినియోగ వ్యయం పెరిగితే, ఇంధన ధరలు కొంతమేర సద్దుమణిగిన పక్షంలో పెట్టుబడులు పెరిగి వృద్ధిరేటు6.7శాతంగా ఉంటుందని అంచనావేసింది. 2029 ఆర్థికసంవత్సరానికి మాత్రం 6.4శాతం వృద్ధి ఉండవచ్చని కూడా ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది.

## రూపాయి స్థిరీకరణ చర్యలతో 65 బిలియన్ డాలర్ల రాక

**ముంబయి,జూన్9:**రిజర్వుబ్యాంకు ఇటీవలికాలంలో రూపాయి కట్టడికి చేపట్టిన కార్యాచరణ కారణంగా భారత్‌కు 55నుంచి 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరిగాయని తెలుస్తోంది. రూపాయి స్థిరీకరణతోపాటు దేశ చెల్లింపుల సమతుల్యతను మిగులులోకి తీసుకురావడంద్వారా పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నదని ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక ఉటంకించింది. ఆర్బీఐ సమన్వయంతో చేపట్టిన కార్యా చరణతో రూపాయి స్థిరపడిందని, డెట్‌మార్కెట్‌కు ఊతం ఇచ్చిందని, విదేశీ మూలధన వనరులు స్థిరంగా సమకూరేవిధంగా ఆర్బీఐ చర్యలు ఉన్నాయని ఎస్బీఐ ఎకోరాప్ నివేదికలో ఉటంకించింది. చూన్‌నెల మానిటరీ పాలసీ సమీక్షను చూస్తే ఆర్బీఐ విదేశీ మూలధన వనరులు సమీకరించడానికి అనేక చర్యలు చేపట్టింది. పెట్టుబడులపరిమితులను పెంచింది. దీనివల్ల దేశ బ్యాలెన్స్ఆఫ్ పేమెంట్స్ పటిష్టం అయినట్లు ఎస్‌బిఐ నివేదికలో ప్రస్తావించింది. రాయితీలతోకూడిన ఫోరెక్స్ స్వాప్‌వల్ల విదేశీ వాణిజ్య రుణాలకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చినట్లయింది. బ్యాంకులు కూడా మూడు, ఐదేళ్లకాలానికి ఎఫ్‌సిఎన్ఆర్ బి డిపాజిట్లుసేకరించుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. 55నుంచి 65బిలియన్‌డాలర్ల రాకవల్ల 2027 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి డిపాజిట్ల వృద్ధి మరింత పెరుగుతుందనిఎకోరాప్ నివేదికలో ప్రస్తావించింది. 14.5 నుంచి 15వాతం వరకూ డిపాజిట్ల వృద్ధి ఉంటుంది.



## ఒక్కరోజులోనే ఈక్విటీలనుంచి 4566.03 కోట్ల ఎఫ్‌పిఐలు వెనక్కి!



**ముంబై, జూన్ 9:** భారతీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు వరుసగా పదో ట్రేడింగ్ రోజున పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రభుత్వ సెక్యూరిటీల పెట్టుబడి పరిమితులపై సడలింపులు ప్రకటించినప్పటికీ, మంగళవారం ఒక్కరోజే ఎఫ్‌పీఐలు రూ.4,566.03 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం కొనుగోళ్లను కొనసాగిస్తూ రూ.6,159.48 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. జూన్ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు రూ.56,384 కోట్ల మేర నికరంగా పెట్టుబడులను ఉపసంహరించుకోగా, 2026 సంవత్సరంలో మొత్తం విక్రయాల విలువ రూ.2.81 లక్షల కోట్లకు చేరింది.2026లో ఫిబ్రవరి నెల మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు భారతీయ షేర్లను నికరంగా విక్రయించారు. జనవరిలో రూ.35,962 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో రిస్క్ పెరగడంతో ఎఫ్‌పీఐలు మళ్లీ విక్రయాల బాట పట్టారు. మార్చిలో రికార్డు స్థాయిలో రూ.1.18 లక్షల కోట్ల ఈక్విటీలను విక్రయించగా, ఏప్రిల్‌లో రూ.60,847 కోట్ల మేర వాటాలను అమ్మేశారు.ఇదిలా ఉండగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్ 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడదారుల ప్రభుత్వ సెక్యూరిటీలు మరియు రాష్ట్ర అభివృద్ధి రుణపత్రాల్లో పెట్టుబడి పరిమితులను ఇటీవల ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.